లక్ష్మీనరసింహారావు, పానుగంటి,$d1865-1940.

పద్మిని : ఆఱంకముల కల్పిత నాటకము

కాకినాడ, 1929.

Record no. 160

Lakṣmīnarasiṃharāvu,
Pānuganṭi,$d1865-1940.

Padmini : Āṟaṅkamula Kalpita Nāṭakamu

Kākināḍa, 1929.

Record no. 160

Bibliographic Record Target

లక్ష్మీనరసింహరావు, పానుగంటి, 1865-1940.

పద్మిని : ఆఱంకముల కల్పిత నాటకము / పానుగంటి లక్ష్మీనరసింహరావు.-1. కూర్పు.- కాకినాడ : కాకినాడ ముద్రాక్షరశాల, 1929.

(2), 103, (1) p. ;21 cm.

Record no. 160

Lakṣmīnarasiṃharāvu, Pānugaṇṭi, 1865-1940.

Padmini : Ār̲aṅkamula Kalpita Nāṭakamu / Pānugaṇṭi Lakṣmīnarasiṃharāvu.-1. kūrpu.- Kākināḍa : Kākināḍa Mudrākṣaraśāla, 1929.

(2), 103, (1) p. ;21 cm.

Record no. 160

3894

తా॥నం 212

౧.౪౦ – ౫

3894

పద్మిని

(ఆఱంకముల కల్పితనాటకము)

పానుగంటి లక్ష్మీనరసింహారావుచే

రచియింపఁబడినది.

మొదటికూర్పు 1000 ప్రతులు.

కాకినాడ:

కాకినాడముద్రాక్షరశాలయందు

ముద్రింపఁబడియె.

1929

[వెల 0_12_0

శ్రీరామ.

పీఠిక.

ఈ పద్మిని నా పందొమ్మిదవ నాటకము. దీనిలోని కథ కల్పితము. శ్రీశ్రీ పీఠికాపురాస్థాన మహారాజావారు దీని నచ్చువేయించిరి. వారికి వారికుటుంబమునకు భగవంతుఁడు సర్వశ్రేయముల నిచ్చుఁగాక!

నా మిత్రులగు బ్రహ్మశ్రీ కూచి నరసింహముగారు దీనికి నాందీప్రస్తావనలను వ్రాసియిచ్చినారు. ఆయన కనేకనమస్కారము లర్పించుచున్నాను.

పీఠాపురము,
5-10-29.

పా॥ లక్ష్మీనరసింహారావు.

ఇందలి పాత్రలు.

పురుషులు.

మురళీమనోహరుఁడు—కళింగరాజపుత్త్రుఁడు—పద్మినిని ప్రేమించినవాఁడు.

విజయనారాయణవర్మ—రత్నప్రభను వరించినయాతఁడు.

గోపాలవర్మ—రత్నప్రభతండ్రి—నారాయణవర్మ మేనమామ.

స్త్రీలు.

పద్మిని—సౌభాగ్యనగరపురాణి—కథానాయిక.

రత్నప్రభ—గోపాలవర్మపుత్త్రిక.

మాలిని—పద్మినిదాసి.

శ్రీరామ.

పద్మిని

నాంది.

చ. మనసిజుప్రేరణన్ జెలువు మాయలు, పిమ్మట నాత్మనుష్క్రియా
జనితమహానుతాపశిఖి; స్వాంతమున న్వనితానురక్తి, పై
కనువగు సాధువేష;—మిటు లద్భుతలీలల నొప్పు సర్వస
ష్టిని గనరాక త్రిప్పుచు నటించెడు రాముఁడు మిమ్ముఁ బ్రోవుతన్!

(నాంద్యంతమున)

సూత్రధారుఁడు—కథానాయిక యగు కాంత పురుషులమించిన పరుషస్వభావురాలును, గపటికశిఖామణియు నైనప్పుడు, నటి నేల పిలువవలయును? బావా పారిపార్శ్వికా!

పా—[ప్రవేశించి] ఏమిసెలవు?

సూ—పిలుచువాఁడను నేనును బిలువఁబడినవాఁడవు నీవును నైనప్పుడు, ప్రయోజనము నాటకప్రదర్శనముగాక యన్య మేమై యుండును?

పా—ఎవరినాటకము? ఏనాటకము?

సూ—

సీ. ఆంధ్రాంగ్లభాషల నారి తేఱినవాఁడు,
పరిపక్వలోకానుభవమువాఁడు;
గద్యంబునకు హృద్యపద్యమాధురిఁ గూర్చు
సుకవితాచతురతఁ జూపువాఁడు;

భావంపుటూటల । బావియౌబుద్ధివా,
డంచితోపమలఁ గుప్పించువాఁడు;
నిర్ఝరపాతసన్నిభ వాణిగలవాఁడు,
పలుకుపలుకున హాస్య । మొలుకువాఁడు;

గీ. సాఖ్యవ్యాసముల నాంధ్రజనుల నెల్ల
హర్షవివశులఁ జేసెడు । నట్టివాఁడు;
మేటియౌ పానుగంటి లక్ష్మీనృసింహ
రావు, బావ! నాటకమును । వ్రాసినాఁడు.

పా—ఆలాగునా? కుశీలవబృందమున కాయన చిరపరిచితుఁడైన ప్రఖ్యాతనాటకకర్తయే! కవివయసెంత?

సూ—నూఱేండ్లకును అఱువదినాలుగు. అట్లడిగినావేమి?

పా—వార్ధకమువలన వపుర్బలముతో బుద్ధిపాటవముగూడ జంకునేమోయని!

సూ—శరీరసత్వమించుక జంకిన జంకుఁగాక, బుద్ధిబలము మాత్ర మెప్పటియట్లే యున్నది. ఆమాట నేఁ జెప్పనక్కఱలేదు. నేఁడు ప్రదర్శించుటకుఁ బఠనార్థము మీ కిచ్చిననాటకమే చెప్పఁగలదు.

పా—ఏమీ! అదేనా మన ప్రస్తుతప్రస్తావనావిషయమైననాటకము?

సూ—ఔను.

పా—అయిన, నాయనుమానము నిరాధారము.

గీ. పూర్వనాటకముల రసపుష్టితోడ
నేయొలర్చుచున్నది । యిదియుఁగూడఁ;
గడుమనోహరమౌ కథాకల్పనంబు
ప్రస్ఫుటంబుగఁ జూపట్టు । బావ! యిట్టిఁ

సూ—

గీ. వయసు గడచిన కొలఁదిని । వన్నె కెక్కు
వస్తువులు కొన్నిగల వీప్రపంచమందు
వంటమందులు ద్రాక్షాసవంబు—నిట్టి
వానిలో నిదెపూ! కవిత్వంబుగూడ.

అదియుఁగాక—

గీ. రసికుఁడు నుదారుఁడౌ మహారాజపోష
ణంబునను జిత్తశాంతి నుండఁగఁ గాంచు
కవికి, వార్ధక మాత్మబంధు వగనుండుఁ
గాని యెవ్వడు శత్రువు । గాదుసుమ్ము!

పా—అయినయెడలఁ, బోషితుఁడును బోషకుఁడునుగూడఁ జిరాయురారోగ్యయశస్సంపన్నులై యుందురుగాక!

సూ—తథాస్తు!

పా—సరియే కాని, మీ రీనాటకము కవిరచించిననాటకములలో నెన్నవనాటకమో, దానిపేరేమో, యింకను జెప్పినారు గారు.

సూ—(నవ్వుచు) బావా! అడిగినవెంటనే యది కవియే చెప్పలేక పోయినాఁడు. నాటకపటిమఁ బట్టి యది యాయన జ్ఞాపకశక్తిలోపమని చెప్పలేముగదా! ఇఁక నాదోషమంతయుఁ దత్పూర్వకృతనాటకగ్రంథసంఖ్యాబాహుళ్యమున కంటఁగట్టక తీఱదు.

పా—కవిపరిహాసప్రియత్వము మిమ్ముఁగూడ నంటుకొన్నట్లున్నది. వేళాకోళములు గట్టిపెట్టి యడిగిన ప్రశ్నకుఁ బ్రత్యుత్తరము సెలవిండు.

సూ—పందొమ్మదవ నాటకము—పేరు పద్మిని—నాయికానామమును నాటకనామమును నొక్కటియే

పా—పేరుమంచిదేగాని తీరుమంచిదిగాదు. నాయిక మహాకంటకురాలు.

సూ—ఆమె యెట్టిదైన నీకేమి? ప్రదర్శనమునకు సర్వము సిద్ధముగా నున్నదికదా?

పా—ఉండకేమి? మీరు సిద్ధసంకల్పులు. తలంచుకొన్నపని కాకపోవునా?

(తెరలో) తలంచుకొన్నపని కాకపోవునా?

సూ—అవిగో! పద్మినీవాక్యము లప్పుడే వినఁబడుచున్నవి. నాటకము ప్రారంభమైనట్లున్నది. మన మింకఁ బోవుదము రమ్ము!

(ఇద్దఱు నిష్క్రమింతురు.)



పద్మిని

ప్రథమాంకము.

ప్రదేశము:—సౌభాగ్యనగరము - అంతఃపురము.

[ప్రవేశము:—పద్మిని.]

పద్మి—తలంచుకొనినపని కాకపోవునా? కాకపోవుటకు లోపమేమి? ధనలోపమా? అధికారలోపమా? ఉత్సాహలోపమా? బలలోపమా? ప్రయత్నలోపమా? ఏలోపముఁగూడ నున్నట్లులేదే? ఇఁకఁ గాకపోవుటయెట్లు? మాలినీ! మాలినీ!

మాలి—[ప్రవేశించి] అమ్మా! ఏమిసెలవు?

పద్మి—అతఁడు వచ్చినాఁడా?

మాలి—ఇంక రాలేదు.

పద్మి—రాకపోయినయెడల నీ వేలవచ్చితివి? నీపనికిమాలినమొగముఁ జూచుటకే నిన్నుఁ బిలిచితి ననుకొంటివా? పో—పోయి యాతనిజాడఁ గనుఁగొనిరమ్ము. (మాలిని పోఁబోవును.) ఇదిగో చూడు. నీవు తిరుగ రానక్కఱలేదు. ఆతని నిటకుఁ బంపుము. తెలిసినదా? అట్లు తేఱిపాఱఁజూచెదవేమి? ఇందునఁ దప్పేమున్నది. అతఁడొక్కఁడు నిచ్చట నాతో మాటలాడఁగూడదా? నీవుండినఁగాని మాసంభాషణమునకు గౌరవమును, ఘనతయుఁ గలుగవని యనుకొంటివా? నేను మహారాజ్ఞిని. ఆతఁడు సామంతరాజులలో నొక్కఁడు. సామంతరాజుఁగూడఁ గాఁడు. ఆతని బంధుఁడఁట. ఎవఁడైననేమి?

అదిగో! మొద్దులాగున నట్లు నిలువఁబడెద వేమి? నీసందేహ మేమో చెప్పక గుక్కిళ్లు మ్రింగుచు గ్రుడ్లుపెట్టుకొని యట్లు చూతువేల?

మాలి—అమ్మా! నేను మాటలాడవచ్చునా?

పద్మి—మాటలాడకుండ-మాటలాడకుండ-నీనోరుమూసితినా? అయినను నీవు మాటలాడవలసినయావశ్యకత యేమున్నది? ఇదివఱకే యనవసరముగ చనవుఁదీసికొని యిందుఁగూర్చి నాకెన్నిపర్యాయములో యడ్డుచెప్పితివి. నీవు మాటలాడనక్కఱయే లేదు. నీవు నాకు సేవఁ జేయవలసినదానవు కాని నన్ను దిద్దవలసినదానవు కావుగదా! అదిగాక, నేనేమైనఁ దప్పుఁజేయుచుంటినా? ఆతఁడు నాదర్శనమునకు వచ్చెదననినాఁడు. అదిగో! తల యడ్డముగ నూపెద వేమి? ఆతఁడు నాదర్శనమునకు వచ్చెదనని చెప్పుట యసత్యమనియా? ఊఁ. అసత్యమే యగుఁగాక. నేనే ముందాతనికి నాదర్శనమునకు రమ్మని వార్త నంపితిని. నిజమే. అందుపై నాతఁడు వచ్చెదననినాఁడు. రానీ-ఏవో నాల్గుమాటలు మాటలాడి సెలవిచ్చి పంపెదను. దీనికింత పూర్వపక్షరాద్ధాంతము లేల? నీమొగము మాడుపు, మూఁతిముడుపు లేల? నీవిప్పుడేపోయి యాతని నిటఁ బంపుము. కిక్కురుమనకుండఁ బొమ్ము. (మాలిని పోఁబోవును)

పద్మి—చూచు. ఇదివఱకే రావలసినవాఁడుకదా? ఇంతవఱకేల రాకుండెను! ఎక్కడ నేమిచేయుచున్నాఁడో నీకేమైనఁ దెలియునా?

మాలి—ఏమో నా కెట్లు తెలియును?

పద్మి—ఏమో నా కెట్లు తెలియునని సంగనాచివలెఁ బ్రత్యుత్తర మిమ్మని నిన్నడుగలేదు. ఏలరాలేదోయని నన్ను నేను పృచ్ఛించుకొంటిని.

తెలిసినదా? ఆతనినిగూర్చి నేనాందోళన మొందుచుంటినని నీ వనుకొనుచుంటివి కాఁబోలు! ఆతఁడు వచ్చిన సరియే. రాకున్న సరియే. నా కాగణన మెంతమాత్రము లేదు సుమా! మహాధికారిణినైన నన్నుఁ జూచుటకు వచ్చుచున్న వారిలో నాతఁ డొక్కఁడు. నేనేమో యాతనియందు విశేష మారోపించితినని నీ వనుకొనుచున్నావు కాఁబోలు! ఎదుటి చిత్తమునుఁ గనిపట్టుట కెంత తెలివియుండవలయును? నీవు పెద్దదానవు. నీవంటిదానికిఁ దెలివి తీక్ష్ణముగా నుండుట కవకాశము లేదు. నీవయస్సువారికిఁ బనికిమాలినసందేహములు, కారణములేని భ్రాంతులు, ననావశ్యకములైన యాలస్యములు ప్రబలముగా నుండును. మా కవియేవియుఁ గిట్టవు.

మాలి—నిజమే. పడుచువారితొందరపాటులు ముసలివారికిఁ గూడఁ గిట్టవమ్మా!

పద్మి—నీకు బుద్ధిలేదా? నా కట్టితొందరపాటును లేదని నీతో నెన్నిసారులు చెప్పియుండలేదు. మాటవరుసకుఁ దొందరపాటున్నదనియే యెంచుము. నీకు నావయస్సున నీమాత్రపుఁ దొందరపాటు లేదని నీవు ప్రమాణముఁ జేసి చెప్పఁగలవా? నాకున్నట్లు పదునెనిమిదేండ్లవయస్సు సర్వాంగసౌందర్యము, మహాధికారము, మహారాజ్ఞీపదవి, మహాబుద్ధివిభవము, సర్వస్వాతంత్ర్యము నీకున్నయెడల, నీవు నామాత్రపుఁ దొందరపాటుతో సరిపుచ్చియుందువా? మింటికెగిరి పేఁకజువ్వవలె మిడిసిరాలకుందువా? అయిదుపదులు నెత్తిమీఁదికివచ్చి యన్నియు నుడిగియుంటచే నీవు నాకు ధర్మపన్నములు చెప్పుచున్నావు. నీతివ్యాఖ్యానము లిచ్చుచున్నావు. నీమాటలు నాచెవి కెక్కవు. ఎక్కవని యిదివఱ కెన్నిసారులో చెప్పితిని. అంటుకొన్న

తుపాకికిఁ బ్రేలవలదని చెప్పుము. మేఘమునకు బడబడలాడ వలదని చెప్పుము. అంతేకాని నాతోఁ జెప్పెదవేల? చాలుఁ. చాలుఁ. పో. పో.

మాలి—అమ్మా! పోయెదనుగాని తలుపుచాటునఁ గూరుచుండియే యాతనితో మాటలాడవలయునుజుమీ! ఆమర్యాదను మాత్రము మీఱవలదు దానివలన ముందెన్ని చిక్కులున్నవో మీ రాలోచించుకొనవలయును?

—ప్రపంచస్వభావము నాకంటె నీకెక్కువ తెలియదు. నీకు వార్ధకము వచ్చినది కాని ప్రపంచజ్ఞానము రాలేదు. చిక్కులని జడిసినకొలఁది సందేహించినకొలఁదిఁ జిక్కులెక్కువయగును. విధేయునిమీఁదనే ప్రభుత్వ సవారియగును. మెత్తనివానికే మొల్లెక్కువ జడిసినకొలఁది సాంక్రామిక వ్యాధివచ్చును. ప్రపంచసౌఖ్యమునకు మొండితోఁ బ్రింతటి సులభమార్గము మఱేదియు లేదని నానమ్మకము.

మాలి—అమ్మా! అంతసాహసమా? మీకుఁ గాఁదలఁచిన భర్తగారి సంగతి రవంత యాలోచింపనక్కఱలేదా?

పద్మి—ఛీ. ఛీ. ఆసంగతి నీకెందులకు? అది యిప్పుడేల ప్రస్తావించితివి. దానికి దీని కేమిసంబంధమున్నది? ఉన్నదేయనుకో- ఆ సంగతి చెప్పవలసిన దానవు నీవా? నీవెవతెవో యెఱుఁగకుండ మాటలాడెదవా? నోరు సంభాళించుకొనుము. జాగ్రత్త. పో.

మాలి—చిత్తము. భద్రముగాఁ బ్రవర్తింపవలయునని ప్రార్థించుచున్నాను. పోయెదను. సెలవు. (పోఁ బోవును.)

పద్మి—ఉండు. ఉండు. పొమ్మనుసరికిఁ దుఱ్ఱునఁ బరుగెత్తెదవా? మీ దాసిజాతి కెన్నివిధముల నిచ్చటుఁ బోషించుచున్నను నీటికిఁ బోవలయుననియే యెప్పుడు దేవులాట. ఇంటియొద్ద నేము

న్నది. నీమొగము. వాఁకిటిలోఁ గోళ్ళగంప—వంటయింటిలో సజ్జకూడు—పడుకపంచపాళిలో నులకకుక్కి—చిలుకలో య్యానుగుండ. ఇంతేకాదా? పోయెదను సెలవఁట! నీవుపోయిన యెడల నిచ్చట పని యెవరుచేసెద రనుకొంటివి?

మాలి—ఇచ్చట నేను జేయవలసిన పనియంతయు నైనదమ్మా.

పద్మి—పనినైనదా? ఏమైనది, నీమొగము. ఆతఁ డిక్కడకు వచ్చునుగదా! ఏకుర్చీ వేయవలయునో, ఎక్కడ వేయవలయునో ఏలాగున వేయవలయునో, ఏపళ్ళెరములోఁ బువ్వును లుంచవలయునో, ఏపళ్ళెరములోఁ దాంబూల ముంపవలయునో, ఏదియెక్కడ నుండవలయునో, ఏదియెక్కడ నుండఁగూడదో, ఏదియుండి యుండనట్లుండవలయునో, ఏదియుండకుండ నుండి నట్లుండవలయునో—

మాలి—అమ్మా! మీమాట కడ్డువచ్చితినని కోపపడకుము. ఇంత గొడవ, యింతగందరగోళము, నింత కాళ్లు తొక్కుకొనుట యెందులకమ్మా! ఆతఁడు మీసామంతరాజు బంధువేకాదా?

(నేపథ్యమున) అమ్మా! విజయనారాయణవర్మగారు దయచేసినారు.)

పద్మి—చూచితివా! నీమూలమున నెంతపనిజరిగినదో! వట్టి సంత శోషముతోఁ గాలక్షేపమైనది. ఏప్రయత్నమును జేయలేదు. ఎక్కడిదక్కడే. చూడు! ఆ యద్దమిటు తెమ్ము. (అద్దమును జూచుకొని) సరే చూడు. ఈవైపు ముంగురులు కొంచెము ముందునకు వ్రాలినవి. సరిచేయుము- ఛీ! ఆవైపునఁ గాదు. ఈవైపున. నీవు వట్టిపెద్దమ్మవు. నేనే సరిచేసికొందును తెమ్మా. నీవు పరుగునఁ బోయి యాతని నిటకుఁ దీసికొనిరమ్మా. (దాసినిష్క్రమించును.) నా కాతఁడు విధేయకోటిలోనివాఁడు. నేను మహారాజ్ఞిని. ఆతఁడు వచ్చినప్పుడు నేను లేవవలయు

నా ? అక్కఱలేదు. ప్రమాదవశమున లేచెదనేమో? కట్టుదిట్టముగఁ గూరుచుండెదను.

[నారాయణవర్మ ప్రవేశించును.]

పద్మి—(అదఱిపడి లేచును.)

నారా—(ఆమెనుజూచి యదఱిపడి మో మోరజేసికొని) మహారాజ్ఞీమణీ ! మీవిధేయవర్గములోని నన్నింత పెద్దసేయవచ్చునా? మీరు నిలువఁబడితిరేల ?

పద్మి—(తొట్రుపాటుతోఁ జప్పునఁగూరుచుండి) (తనలో). ఆహా ! నేను నిలువఁబడితినా ? తెప్పపాటు క్రిందనే కాఁబోలు బింకముగఁ గూరుచుంటినే. ఇప్పుడెట్లు నిలువఁ బడియుంటిని? ఎఱుఁగనీకుండ మనస్సు మనచే నెన్నిపనులు చేయించుచున్నది. మనస్సులో నెన్నిదొంగయుఱులున్నవో? (ప్రకాశముగా) నీవు రాజ్ఞీదర్శనమువలనఁ గలిగిన సంకోచమును విడిచి నిస్సందేహముగా నటఁ గూరుచుండుము.

నారా—అనుగ్రహింపఁబడితిని.

పద్మి—నారాయణవర్మా ! క్షత్రియకాంత పరపురుషునెదుటఁ గానఁబడఁగూడదను మర్యాద నెఱుఁగనిదానను గాను. చక్రవర్తిని నైన నేనట్లు తలుపుచాటునఁ గూరుచుండునెడల నాకెట్లుజరుగుఁబాటగును ? నీవంటి తగుమనుష్యుఁడు దర్శనార్థియై వచ్చినప్పుడు నేను గోడచాటునఁ గూరుచుండునెడల నిన్నుఁ జులకన చేసినట్లు నీకుఁ దోఁచునేమో ? మీరందఱు నావలనఁ గౌరవింపఁబడినప్పుడే కదా నాకు గౌరవము. అవిలంఘ్యమైన రాజద్గ్నమునకు [illegible] ట్టుపడి నేను నీకుఁ బ్రత్యక్షముగఁ గనబడి వంగులాడు [illegible] పుము.

నారా—ఎంతమాట? క్షమింపుమని మీరు నన్నుఁ గోరుట ధర్మమా? మీతండ్రిగారు మా మేనమామగారిసామంతరాజ్యముపై మిగుల నభిమానముతో నుండెడివారు. మీతండ్రిగారు స్వర్గస్థులైనపిమ్మట మా మేనమామ యీయవలసిన కప్పములో సగము కొట్టివైచి మాయెడల నెంతయభిమానముతో నున్నందులకు మహానంద మొందుచున్నాము. మీకు భగవంతుఁడు—(చేతులు జోడించుకొనును.)

పద్మి—వలదు. వలదు. వ్యవహారపుముచ్చట లిచ్చట నేమిటికయ్యా ? ఇది యంతఃపురముకాని మహారాజసభకాదు. పాలనాతంత్రములు, పాత్రికములు, కట్టుబడులు, కప్పములు నిచ్చట యుక్తములుకావు నారాయణవర్మా ! నీవు మహాధీమంతుఁడవని మహావిద్వాంసుఁడవనియు, ధర్మప్రవర్తనతత్పరుఁడవనియు ఊ. మహా ఊ. ఊఁ. సుందరస్వరూపుఁడవనియు, ననేకుల వలన విని యానందమొందితిని. మాతండ్రిగారి సభలో నిన్నొకసారి చూచి శిరఃకంపన మొనర్చితిని. అట్లులికిపడెద వేల ? నే నొరులను స్తోత్రముఁ జేయుదానను గాను. నామనస్సునకు నచ్చుటచేతనే నే నిట్లు చెప్పుచుంటిని. నీవంటివారు దేశమున కలంకారములు. మధురమధురమైన సపోటాపండు పైకసహ్యముగనుండును. బంగరుపండువలెనుండు నిమ్మపండునకుఁ జెప్పరాని పులుసుండును. మొసలితలలో మాణిక్యముండును. గాజులోఁ బురుగుండును. మయూరపుఁగూఁత రోఁత. కోకిలరుత మమృతము. అంతర్బహిస్స్వరూపములందు సృష్టిలో నెంతయో వ్యత్యాసము కనఁబడుచున్నది. విజ్ఞానవంతుఁడు వికృతరూపుఁడుగా నుండును. అటికయంతతలతోనో, బొమరుకప్పయంత ముక్కుతోనో, కాకికన్నుతోనో,

గాడిద వాలకముతోనో తఱచుగానుండును. ముఖకాంతిచేతఁ జంద్రోదయమునర్చు లావణ్యవంతునకుఁ దలలో మన్ను, హృదయములోఁ బన్ను తఱచుగా నుండును. కత్తికిఁదగిన యొర, యొరకుఁదగిన కత్తి తఱచుగా లభి పవు. అందుచే నిన్ను సావధానముగఁ జూడఁగోరి యిటకు రప్పించితిని. (తనలో) హా! జగన్మోహనుఁడగు నీతనిఁజెట్టఁబట్టకుండునెడల నా జన్మమేల? నాయైశ్వర్యమేల? (ప్రకాశముగా) నారాయణవర్మా! ఏదియో యోజించుచు నూరకుంటివేల?

నారా—ఏమియు లేదు.

పద్మి—ఏమియు లేదనుట సరికాదు. ఏదియో యున్నది. దానిని జెప్పుటకు నీ నాలుక సందేహపడుచున్నది కాని నీకన్నులు దానిని వెల్లడిచేయుచున్నవి. మనోరహస్యమును బైటఁబెట్టుటలోఁ గన్నంత చలపాదివస్తువు లేదుసుమా? కన్ను వెలిబుచ్చలేని శరీరవ్యాధియు లేదు. మనోవ్యాపారమును లేదు. గొంతుకోయఁదలఁచిన యుద్రేకము మొదలు, ముద్దుకొను నుబలాటమువఱకన్ని మానసికావస్థలను గూడ మొలచినది మొలచినట్లు కన్ను చిత్రింపఁగలదు. కంటికొనలోనున్న గ్రంథభండారమింతింతయా? ఇప్పుడు నీకంటిచూపునుబట్టి నీమనస్సునేమి యోజించుకొనుచుంటివో నేను జెప్పఁగలను. చెప్పనా?

నారా—చెప్పుదలఁచినవారు మానుదురా?

పద్మి—తలఁచుకొన్నపని మానుట నాయొద్ద లేదే. క్రొత్తవాఁడవైన నాతో నీమె యింత నిస్సందేహముగ నింత చనవుగ నేల మాటలాడుచున్నదో. ఈమెయంతరంగవైఖరి యెట్టిదోసుమా యని నీవు గుబ్బెటలు పడుచున్నావు. అదిగో ముసిముసినవ్వు

నవ్వుచున్నావు. నేను జెప్పినది సత్యమేకద. నీతో నే నింత చనవుగ నేలమాటలాడుచున్నానో చెప్పెదను వినుము. మా తండ్రిగారు స్వర్గస్థులై దాదాపుగా నాఱుమాసములు కావచ్చినది. ఈమహారాజ్యభారమంతయు నాతలఁగట్టి యామహానుభావుఁడు మహాదేవసన్నిధానమును జేరినాఁడు. పదునెన్మిదేండ్ల బాలను. అయినను జంకుగొంకునెఱుఁగనిదాననుగాని వ్యవహారసమర్థనము కష్టముగానున్నది. మంత్రులు లేరా! సేనాధిపతులు లేరా యని యందువేమో? ఉన్నారు. వారు నామాటకు బళీ యనువారేకాని నాకుఁ జెప్పఁదగినవారు కారు. కఠినమైనహితము నాకు బోధించునెడల నాకెక్కడఁగోపమువచ్చునో, తమలబ్ధి యెక్కడఁజెడునో యని దేవులాడు మంత్రికాని సేనానికాని నాకుండిననేమి లేకున్ననేమి రాష్ట్రలాభముకంటె స్వలాభమును జూచుకొనువాఁడు రాష్ట్రమున నుండుట మహోపద్రవము కాని మఱియొకటి కాదు. పాపము! వారి ననవలసినపని యేమున్నది? ధనసంపాదనకై సేవకొప్పుకొన్నపిమ్మట నెవ్వఁడైన నొక్కటే. నీవు బుద్ధిశాలివనియు, మారాష్ట్రముపై నవ్యాజాభిమానముఁ గలవాఁడవనియు నేనెఱిఁగియుండుటచే నిన్నిక్కడకు రమ్మంటిని. అదిగో మొగము ముడుచుకొనుచున్నావు. నిన్ను సేవకై నియోజించెద ననుకొనుచున్నావు కాఁబోలు. నీవు నాకు హితబోధముకై నాయొద్దనుండవలయును. నీయభిప్రాయము లేకుండ నేనేపనియుఁ జేయను. నీవు నాతో సమానప్రతిపత్తికలవాఁడవై యిచ్చట నుండుము. నాచే నీరాష్ట్రమును నీయిష్టానుసారముగఁ బరిపాలింపఁజేయుము.

నారా—చక్రవర్తినీ! మీరు నాతో నింతధారాళముగ మాటలాడు చున్నప్పుడు నే నట్లు మాటలాడకుండుట నాభవితవ్యము. మీకు నాకీయఁదలఁచిన గౌరవాధిక్యతకు నేను సర్వదా కృతజ్ఞుఁడను గాని—

పద్మి—ఆగు నారాయణవర్మా! అంతటితో నాగుము. ఇంకఁ గాని యేల? ఈరాష్ట్రమంతయు నీవే పరిపాలించుకొనుచుండవచ్చునే. నేను నిమిత్తమాత్రముగనుందును. నీయోగ్యతను, సమంజసతను జూచి నేనిందులకుఁ బ్రార్థించుచున్నాను. మాతండ్రిగారు నాకొసఁగినరాజ్యము ససందర్భముగఁ బరిపాలించిన నింద నాకు రాకుండ నన్నుఁ గనిపట్టుము. అంతియే నా కోరిక.

నారా—మీతండ్రిగారిరాజ్యమును యథాన్యాయ్యముగఁ బరిపాలించుట మీకెట్లుసమీచీనమో మీతండ్రిగారు మిమ్ముఁ గళింగరాజపుత్రుని వివాహమాడుమని యిచ్చిన యాజ్ఞను బరిపాలించుట మీకంతసమీచీనమే. కావున మీ రాతనిఁ ద్వరలోఁ బెండ్లియాడి యాతనిఁ దెచ్చి యిటబెట్టుకొనుఁడు. ఆతఁడే మీకు సర్వహితముల బోధించును. మఱియొక్కఁడేల?

పద్మి—ఏమంటివి? నేను నిన్నడిగినదేమి? నీవు చెప్పినదేమి? నీవిచ్చటనిల్చి నారాజ్యపాలనతంత్రమున సాహాయ్యమును జేయుమని నిన్ను నేను గోరుటయేమి? కళింగరాజపుత్రుని వివాహమాడుమని నీవు నాకు బోధించుటయేమి? దానికి దీని కేమైన సంబంధమున్నదా? నీసాహాయ్యమునకు నామనువునకును లంకెవైచితివేమి? ఇది విరుద్ధముగ లేదా? ఎక్కడిమహీపాలనము. ఎక్కడిమనువు? నారాజ్యములోనిప్రజలు పంటలులేక

పోవుటచే నెంగిలిలంఘనములతో నుండ నేను పెండ్లివిందు లారగింతునా? నేను స్త్రీనని నారైతులు నాయాజ్ఞలను వ్యతిరేకించుచుండ మగనిని వరించుకొని తూఁగుటుయ్యెలలోఁ ద్రుళ్ళిపడుమని నీయభిప్రాయమా? రాచపుట్టువునకు రాజ్యపాలనము విధికాని వివాహమంతవిధి కాదే. మనకుఁ గావలసినది జనసౌఖ్యమా? స్వసౌఖ్యమా? రాజులు ప్రపంచసౌఖ్యమునకు సృష్టింపఁబడిరి కాని లోఁడితెడుకుటుంబములో గుడుగుడుగుంచములాడుటకా? నారాయణవర్మా! స్వార్థపరిత్యాగమొనర్చి పరహితాభిలాషచే రాజ్యతంత్ర మొనర్చు నేను రవంతతోడుపడుమని నిన్ను వాంఛింపఁగఁ గళింగరాజపుత్రుని బెండ్లి చేసికొనుమని నీవు నాకు బోధించితివి. నేను గోరినకోరిక నీకిష్టమగు నెడల సరే యనవలయును. కాదేని నా కవకాశము లేదనవలయును. అంతేకాని సంబంధశూన్యమైన యీ యుపదేశము నాకుఁ జేయఁదగునా? నేనెవరినైనఁ బెండ్లిచేసికొందునో లేదో నీవెఱుంగుదువా?

నారా—(తనలో) ఈమె నన్ను వరించుచున్నదని దుర్భ్రమనొందితిని. ఈమెప్రకృతి దురవగాహముగనున్నది. (ప్రకా) చక్రవర్తినీ! నాహితబోధనము సదా విని యట్లుప్రవర్తించుటకై నన్ను మీరాజ్యమున నుండుమంటిరి. నేనిప్పుడు చేసిన స్వల్పమైనహితబోధనమును మీకు వినుటకే కష్టమయ్యెనే?

గీ. హితము బోధింపు మనికోర । హితము చెప్ప
మంత్రిమాటగణింపఁడు । ముగ్ధనృపుఁడు
ఛాత్రుఁ డాచార్యుమాటను । సరకుఁగొనఁడు
మఱి పురోహితుమాట నెవ్వరును వినరు

ఎల్లవారును హితబోద్ధ లెల్లవారు
హితతిరస్కారపారీణమతులు, హితము
చెప్పుమనికోరువారికి సిగ్గులేదు
చెప్పువారి కంతకంటె సిగ్గులేదు.

పద్మి—ఎంతమాటనంటివి. ఎంతమాటనంటివి. ఎంతయలక్ష్యముగ మాటలాడితివి. చక్రవర్తినినని కానంత యాలోచించితివి కావే! సెబాస్! నీయలక్ష్యమే, నీనిర్భయత్వమే నాకు సంతోష మిచ్చినది సుమా! నీవుకూడ నితరులవలె వంగివంగి, వంగివంగి కల్లబొల్లి స్తుతిపాఠములాడి యుండినయెడల నాకు రోఁతగ నుండియుండును. నీస్వతంత్రబుద్ధిఁ గనఁబఱచితివి. ఆనందించితిని. నామాటకందఱు తలలువంచుకొనువారే. అందఱు చేతులు నులుముకొనువారే. అందఱొడలు ముడుచుకొనువారే. ఒక్కఁడైన మచ్చునకైన నెదురు తిరిగినవాఁడు కనఁబడఁడే! దోసిలొగ్గి చిత్తము చిత్తమను వానినిఁ జూడ నాకు రోఁత. తలయెత్తి రవంత మొరాయించినవానినిఁ జూడ నాకు ముచ్చట. ఎంతసేపు వినమ్రత, ఎంతసేపు మెత్తన, ఛీ! నా కసహ్యము. రవంత కఱుకుఁదనము, రవంత యెదురెక్కుఁడనము, రవంత త్రుళ్ళిపాటు ప్రభుత్వమున కప్పుడప్పుడు మోతాదుగఁ దగులుచుండినఁ గాని సుఖమే లేదు. వద్దన్న వాఁడెల్లప్పుడు వెన్న దినవలసివచ్చునెడల వానికది యెంతయసహ్యముగనుండునో యీసంతతవినయప్రవర్తనప్రదర్శనము నాకంతకంటె నసహ్యముగనున్నది. కఱకఱలాడుచుఁ గటుక్కుమన్నది కాని పంటికి సుఖమీయలేదు. మిరెపుఁగాయ చురుకుగాని నాలుకకు ద్రవమీయలేదు. వాదములో రవంత యెత్తిపొడుపున్నఁ గాని ప్రతివాదికుద్రేకములేదు. ప్రజలతిరుగుఁబాటున్నప్పుడు

కాని ప్రభుని కుత్సాహములేదు. మొత్తముమీఁద నాతత్త్వమది. ప్రపంచతత్త్వమదియగునో కాదో? ఎటులైననేమి? సంపూర్ణవిధేయతాదర్శనమున మొగము మొత్తిన నాకు నీయవిధేయవాక్యమున నా మొత్తు వదలినది. ఏలాగు! చెప్పుమనికోరువారికి సిగ్గులేదు. చెప్పువారికిఁగూడ సిగ్గులేదు, ఇక్కడకు నాకును నీకును గూడ సిగ్గులేదని చెప్పితివికదా! ఇంక సంకోచమేల? నీవు పనిలేనిదే నాపెండ్లినిగూర్చి ముచ్చటించితివి. నే నూరకుందునా? నీపెండ్లిమాట యేమని నేనడుగుచున్నాను. నీమేనమామకూఁతుతో నీకు వివాహము స్థిరపడినదా? నారాయణవర్మా! నీమేనమామపుత్రిక యెట్లుండునో నేను జెప్పనా? గుండ్రని మొగము. అవునా? గుండ్రని కన్నులు, ఉంగరాల వెండ్రుకలు, కుడికంటిలోఁ బుట్టుమచ్చ, గడ్డము మీఁదఁ బచ్చబొట్టు. ఎడమచెవి రవంత వంకర, అవునా?

నారా—(నవ్వుచు) చక్రవర్తినీ! మీ కింతస్పష్టముగ నెట్లు తెలిసెను?

పద్మి—దేవేంద్రున కొడలంతయుఁ గన్నులైనట్లు మా కొడలంతయుఁ జెవులే. అదిగాక యామెయు నేను నిచ్చట బాల్యమునఁ జదువుకొంటిమి కాదా? నీభార్య నాకుఁ గ్రొత్తయనుకొంటివా? పోనీ! ఆసంగతి యెందులకు? నీ వామెను వివాహమాడుట కంగీకరించినట్లు నీమందహాసమే స్పష్టపఱచుచున్నదే? నారాయణవర్మా! తెలిసినవాఁడవుకదా? ధర్మాధర్మవిచక్షణుఁడవు కదా! మేనమామకూఁతును వివాహముఁ జేసికొనుట తప్పని యెఱుఁగవా? ఏల యంగీకరించితివి?

నారా—అట్టియాచార మచ్చటచ్చట నున్నది కాని లేకపోలేదే!

పద్మి—అచ్చటచ్చటనున్నదా? ఎచ్చటెచ్చటనున్న మనకేమి? మారాజ్యమందున్నదా? మీ మేనమామరాజ్యమందున్న

దా? ఆచారము దేశమునకు సంబంధించినదేకదా? మనదేశాచారమును మనమే మీఱవచ్చునా? ఈదేశమునకు దురాచారమైనది నీకు సదాచారమెట్లు? నీవీదేశములోనివాఁడవు కావా? ఆచారకాండమందుఁ బ్రత్యేకముగ నీకొఱకు వ్యతిరేకసూత్రము పుట్టియున్నదా? ఉండుము. ఉండుము. నేను జెప్పఁదలఁచిన దేదో చెప్పినతరువాత నీవు చెప్పవచ్చును. తొందర యేల? పండితుఁడవు ప్రత్యుత్తరమే చెప్పలేకుందువా? కాని నీ పాండిత్యము పరబోధమున కక్కఱకురాఁదగినదే కాని స్వాచరణమున కక్కఱకురాదేమి? దురాచారమును మనవంటివారే యవలంబించినయెడల నిఁకేమున్నది. ప్రజలు పాడైపోరా? ప్రజలకు మార్గదర్శకులుగా నుండవలసినవారము కాని సామాన్యులము కామే. వంకరదువ్వెనతో సూటియైన పాపట వచ్చునా? ప్రజలతో నాకేమిసంబంధమని నీవు తప్పించుకొనుట కవకాశము లేదే? నీ మేనమామ యపుత్రకుఁడగుటచే నీ వాతనిరాజ్యమును స్వీకరింపవలసినవాఁడవు కావా? ప్రజలప్పుడే నీమంచిచెడ్డలను గనిపెట్టుచున్నారని యెఱుఁగవా? ఉదయవైఖరినిబట్టి దినమెట్లుండునో గొల్లవాఁడైన గ్రహింపలేకుండునా? ప్రభుత్వము లేనప్పుడే యింతనిరంకుశముగఁ బ్రవర్తించువాఁడవు. ప్రభుత్వమువచ్చినపిమ్మట నెట్లుందువో యని జనులకు సందేహము కలుగనీయవచ్చునా?

నారా—నాచరిత్రమును మీరు వినవలయును. అతిసంక్షేపముగఁ జెప్పెదను. నేను తొమ్మిదేండ్లపిల్లవాఁడనై యుండగా మాతల్లిదండ్రులు పరలోకగతులైరి. అవసానకాలమున వారు మా మేనమామతో నిట్లు చెప్పిరి. "మాదురదృష్టవశమున మా రాజ్యమిదివఱకే పోయినది. మా పిల్లవానిని నీవు పెంచి యిప్పటికి

రెండేండ్ల వయస్సున్న నీపిల్లను మాతులకన్యావివాహము మాదేశమున నాచారమే కావున, వానికిచ్చి జీవనాధారమేమైనఁ గల్పించినయెడల మాయాత్మలు సంతోషించును." వారి యవసానవాంఛను మా మేనమామ తీర్పఁదలచినాఁడు.

పద్మి—ఈచరిత్రము నేను వినినదనియే నాతోఁ జెప్పితివా? నీవు చెప్పినమాటలనుబట్టి బాల్యమున నీతల్లిదండ్రుల మృతి, వారు నిన్ను మేనమామ కప్పఁజెప్పుట, ఆతఁడు నిన్ను బెంచుట, యిల్లరికముండుట తక్క నీకితరాధారమేదియు లేకుండుట యివియే కారణములని తెలియుచున్నది. కాని మీయన్యోన్యానురాగము మాట చెప్పకపోయితివేల? ఇట్టిసన్నివేశములో నన్యోన్యానురాగ ముండుట కవకాశముండునా? నీ వెఱుఁగనిసంగతి కాదే! నీయెడల వారికుండునది జాలి కాని యనురాగమెంతమాత్రము కాదు. వారియెడల నీకుండునది కృతజ్ఞత కాని ప్రేమ కానేరదు. 'పాపము. ఇతరాధారము లేనివాఁ'డని వారికి నీయందుండును. ఎంతో పెంచి పెద్దవానినిఁ జేసినారు వారియెడల విశ్వాసము గనఁబడకపోవునెడల బాగుగా నుండదని నీకు వారియందుండును. ఇట్టి మనస్థితులు వివాహమునకు సాధనములగునా?

నారా—చక్రవర్తినీ! ఈయంశము లాలోచించుశ్రమమంతయు మీకెందులకు? నన్ను రమ్మని యెందుల కాజ్ఞాపించితిరో యది సెలవిచ్చి నాకు సెలవీయఁదగును.

పద్మి—ఎందులకీగొడవయని యెంత తృణప్రాయముగాఁ జెప్పితివి? చక్రవర్తినినగుటచే నన్నిగొడవలు నాకే కావలయునని నీ వెఱుఁగవా? నాకు సహపాఠిని నాకత్యంతమిత్రమునైన రత్నప్రభను నీవు వివాహమాడఁ దలఁచియున్నావు కదా?

నీవు నాకింక సామంతరాజవు కావలసియున్నావు కదా! ఆమెకు నీ యందనురాగమున్నదో? లేదో? నీ కామెయం దెట్లున్నదో! నేను గనుఁగొని మీవివాహమును స్థిరపఱుపవలయును గాదా! అంతేకాని నీ తల్లిదండ్రుల యవసానవాక్యములు తీర్పఁదలఁచిన నీమేనమామ తొందరచేత మీకు హృదయపరీక్ష లేకుండ గలిపించినవారియెడల గౌరవముకొఱకు దంపతులయి యెడమొగము, పెడమొగమై యిడుములందగ నేను సహింతునా? నన్నెందులకుఁ బిలిపించితిరో త్వరగఁ జెప్పుమని నీవు నన్ను దొందరపెట్టుచుంటివే. నిశ్చలమై, నిరంతరమై, నిర్వ్యాజమైన యనురాగము నాచెల్లెలియందు నీకున్నదా? నిజము చెప్పుము.

నారా—ఉన్నది.

పద్మి—(తనలో) హా! బాకుపోటు బ్రహ్మరంధ్రము నంటినది. (ప్రకా) ఉన్నదా? నిజముగనున్నదా? చక్రవర్తిని మొగము బాగుగాఁ బరిశీలించి మఱి చెప్పుము.

నారా—చక్రవర్తినీ! దైవముఖమును జూచి చెప్పుచున్నాను. ఉన్నది. ఉన్నది.

పద్మి—(తనలో) హా! ప్రాణమెగిరి పోవుచున్నది. (ప్రకా) కనఁబడని దైవముఖమును నీవు చూచుటయేమి? చెప్పుటయేమి? నాకది పనికిరాదు. ఇదిగో నామొగమును జూచి చెప్పుము. విద్యుద్దీపమువలె వెలిగిపోవుచున్న నామొగమును జూచి చెప్పుము. (తనలో) హా! పెదవులదరుచున్నవేమో. గుండెలు గొంతులోఁ గొట్టుచున్నవేమో? బింకముగఁ గూరుచుండెదను. (ప్రకా) నారాయణవర్మా! తొందరలేదు. బాగుగా నిదానించి మఱి చెప్పుము.

నారా—(చక్రవర్తినివంకఁ జూచి) త్రికరణశుద్ధిగా మనవిచేయుచున్నాను. మీ కన్యోన్యానురాగమున్నది.

పద్మి—(తనలో) హా! భగవంతుఁడా! ఇఁక నాబ్రతుకెట్లు? ఈతఁడు నన్ను బాగుగాఁ జూచినప్పటికి నాయందుఁ గానంతయైన ననురాగము లేకున్నాఁడే. నేను సౌందర్యహీననా? ఈతఁడు గ్రుడ్డివాఁడా? (ప్రకా.) ఏమంటివయ్యా! నేను దిన్నఁగ వినలేదు.

నారా—చక్రవర్తినీ! మీ కన్యోన్యానురాగ మున్నదని మనవిచేసితిని.

పద్మి—(తనలో) హుఁ. (ప్రకా) అన్యోన్యానురాగముమాట యెవ రడిగినారని చెప్పితివయ్యా! నీమాట నేనడుగగ, నామెమాట కూడ నీవే చెప్పనేల? అది నీవు చెప్పఁదగదు. నేనామెను గనుగొనకపోవుదునా?

నారా—మీయిష్టము.

పద్మి—నీ విఁకఁ బోవచ్చును. రత్నప్రభ నిక్కడకుఁ బంపుమని నీవు మీమేనమామతోఁ జెప్పుము.

నారా—అభ్యంతరమేమి? సెలవుదీసికొందును. (పోఁబోవును.)

పద్మి—ఉండు. ఉండు. రత్నప్రభ నిక్కడ కెవ్వరు తీసికొనివచ్చెదరు?

నారా—ఆమెతండ్రియే తీసికొనివచ్చును.

పద్మి—ఆతఁడు పెద్దవాఁడు. అతని నెందులకు శ్రమపెట్టవలయును? పోనీ రత్నప్రభ వెంట నీవే రాకూడదా?

నారా—నేనెందులకు? నేనువచ్చితినిగాదా! నాపరీక్ష యేదో యైనదిగాదా?

పద్మి—నీవు తిరిగి రాఁదలఁచుకొనినప్పుడు వెళ్ళుట యెందులకు? ఇక్కడనే యుండుము. ఆమె వచ్చినతరువాత నిద్దఱుపోవచ్చును.

నారా—నన్ను క్షమింపుము వివాహముకాకుండ నామెను నేనును కలసివచ్చుటకాని, పోవుటకాని బాగుగానుండదు.

పద్మి—నీ కట్టిసందేహమున్న యెడలఁ బొమ్ము.

నారా—చిత్తము. (పోవును.)

పద్మి—ఉస్సు. ఉస్సు. నారాయణవర్మా!

నారా—(ప్రవేశించి) వచ్చుచున్నాను.

పద్మి—నీవు పోకతప్పదా?

నారా—పనిలేకుండ నేల యుండవలయును?

పద్మి—పనిలేకుండ నుండుమనుదాననే యనుకొంటివా? నే నెందుల కుండుమంటినో యోజించితివా?

నారా—నాకుఁ దెలియదు.

పద్మి—రత్నప్రభ నాకు ప్రాణసమానమైనసఖి. ఆమెకు నీయెడల ననురాగ మున్నట్లు నాకుఁ దెలిసిన యెడల—వింటివా? అట్లు స్థిరపడిన యెడల—అబ్బ! అబ్బ!

నారా—అదియేమి. అదియేమి?

పద్మి—(తనలో) అయ్యో! వెల్లడిపడితిని గాఁబోలు. (ప్రకా) ఎదను గుండెలో 'కలుకు' మని పొడిచినట్లైనది. చూచితివా దేహములో నెక్కడ నేమిజరుగుచున్నదో యెంతమాత్రము తెలియదు. హృదయముమాట నింకఁ జెప్పవలసిన దేమున్నది? ఈ మాటలకేమి. చూడు. ఊఁ నేనిదివఱ కెక్కడనుఁ జెప్పితిని?

నారా—ఆమెకు నాయం దనురాగమున్నట్లు స్థిరపడిన యెడల—

పద్మి—హుఁ. ఆమాటయెందులకు. అది అయిపోయినదికదా. మీకు వివాహపూర్వమున జరుగవలసిన ప్రథానోత్సవమును నాతోటలో నేను జేయింతును.

నారా—అనుగ్రహింపఁబడితిని.

పద్మి—అందువలన నిన్నిట నే యుండుమని యంటిని.

నారా—చిత్తము.

పద్మి—రత్నప్రభను దీసికొనిరమ్మని యామెతండ్రికి మఱియొకనిచే వార్తనంపెదను.

నారా—చిత్తము. సెలవు.

పద్మి—సరే. (నారాయణవర్మ పోవును.)

ఎవరక్కడ?

(నేపథ్యమున) అమ్మా! ఏమి సెలవు?

పద్మి—ఇటురా.

[మాలిని ప్రవేశించును.]

మాలినీ! నారాయణవర్మ వెళ్ళినాఁడా?

మాలి—ఆ.

పద్మి—ఆతని మొగమును నీవు పరిశీలనముగఁ జూచితివా?

మాలి—ఏమమ్మా అట్లడుగుచున్నారు?

పద్మి—తిరుగప్రశ్నింతువేల? చూచితివా?

మాలి—చూచితిని.

పద్మి—సంతోషముగానున్నడా? విచారముగానున్నడా? ఆలోచనభారమున నున్నడా? సందేహాన్వితమైయున్నడా? సంభ్రమసంకులమై యున్నడా?

మాలి—అంతసూక్ష్మపుసంగతులు నేను జెప్పలేనమ్మా.

పద్మి—నీ మొగము. నీకుఁగన్నులెందుకు. నెమలితోఁకకుఁ గన్నులే—నీకుఁగన్నులే. మంచమునకుఁగన్నులే—నీకుఁగన్నులే. ముంజెకాయకుఁ గన్నులే—నీకుఁ గన్నులే. ఎందులకున్నకన్నులు. సూక్ష్మపుసంగతులు చెప్పలేనంటివికదా! పోనిమ్ము. ఆతఁడు చులుకుగా నడచినాఁడా? మెల్లఁగనడచినాఁడా? అటునిటు కాకుండ నడచినాఁడా? అడుగు వేసినప్పుడు బింకముగ వేసినాఁడా? వదులువదులుగ వేసినాఁడా?

మాలి—ఆతనియడుగు నామెడపై వేయకపోవుటవలన నెట్లువేసినాఁడో చెప్పలేనమ్మా!

పద్మి—ఓసి నీగొంతుకఁ గోయ! చమత్కారపుమాట నేర్చుచుంటివా! ఆతనికాలు నీగొంతుకపైఁ బడలేదందువా? ఆలోపముఁ దీర్చుటకు నేనుంటినిగాదా! పో! ఆవలికిఁ బో! నీవిక్కడ కింక రానక్కఱలేదు. (మాలిని పోవును.)

నాసేవకుఁ బడుచుదాసిని జేర్చునెడల నది యితరదృష్టిచే నాసేవ తిన్నగఁ జేయదేమోయని యీముసలిదాసిని జేర్చఁగ నిది యీతీరుననున్నది. బుద్ధిహీనయేగాని విశ్వాసవతి.

(నేపథ్యమున) అమ్మా! స్నానమునకు దయచేయవచ్చును.

పద్మి—మాలినీ!

మాలి—(ప్రవేశించి) అమ్మా!

పద్మి—ఈయుదయమున నూరిలోని విశేషము లేమియు చెప్పలేదేమి?

మాలి—ఇచ్చటివిశేషములలోఁ దెఱపిలేకపోయినది. అమ్మా! ఒకబైరాగి వచ్చి కోటగుమ్మమునొద్ద నిన్నసాయంకాలము నుండియుఁ గూర్చుండియున్నాఁడు ఆతఁడు చక్రవర్తినిగారి దర్శనము నపేక్షించియున్నాఁడు. మీ కామెదర్శనము కాదనియు, మంత్రిని జూచి మీయభీష్టమేదో చెప్పుకొనుఁడనియు నెందఱో చెప్పినారు. ఆమెదర్శన మగువఱకు నేనిక్కడ నభోజనముగఁ గూర్చుండుదునని ప్రతిజ్ఞచేసి యట్లుకూరుచుండినాఁడు. ఏమిసెలవు?

పద్మి—ఆతనికాపట్టెందులకో? నే నిప్పుడు చూడనొల్లను. మధ్యాహ్నమునఁ జూతునని చెప్పుము. చూచుట నిశ్చయము కావున భుజింపుమని నేనుగోరితినని చెప్పుము.

మాలి—చిత్తము. స్నానశాలకు దయచేయుఁడు.

పద్మి—సరే. నీవు మూఁడుగంటలకు నాతోమాటలాడి మఱియాతనిని దీసికొనిరావలయును.

మాలి—చిత్తము. (ఇద్దఱును నిష్క్రమింతురు.)

ఇది ప్రథమాంకము.

పద్మిని

ద్వితీయాంకము.

ప్రదేశము—అంతఃపురము.

[ప్రవేశము—మాలిని, పద్మిని]

మా—పుట్టగిడసలాగున నున్నాఁడమ్మా- పడుచువాఁడు.

ప—అటులైన విరాగియెట్లయ్యెను? అతఁడు దొంగబైరాగియేమో సుమా?

మా—నిజమైన బైరాగియైనయెడల మీకు లాభమేమి? దొంగవాఁడైనయెడల నష్టియేమి? ఎవఁడో యొకఁడు; మీకు రాణిగారు దర్శన మిప్పించెదరు, భుజింపవయ్యా యని యతని బతిమాలితిని. అంగీకరింపలేదు.

ప—నాకీపాపముగూడ నెందులకు? త్వరగఁ దీసికొనిరమ్ము. మూఁడునిమిసములకంటె నేనెక్కువ యవకాశ మాతనికీయఁజాలను. ఆసంగతి యాతనితోఁ జెప్పి మఱి తీసికొనిరమ్ము.

మా—అమ్మా! వెళ్ళనా?

ప—మాలినీ! వెళ్లుదువు గానిలే- చూడు- ఈదినమున నేమో కాని మనస్సు మనస్సులో లేదుసుమా?

మా—ఔనమ్మా. అడిగినయెడలఁ దిట్టుదురేమో యని యూరకుంటిని గాని నేను గనిపట్టకపోలేదు. కోడిమాంసము సెనగపప్పు వేసిన యిగురు మీకెంతయో యిష్టముకదా యని చేయించితిని. వేలితో ముట్టుకొననైన ముట్టుకొనక పోతిరి.

ప—నామాట కేమి? మన యతిథిసుఖము ముందుగా మనము చూడఁదగినది. విజయనారాయణవర్మ సుష్టుగా భుజియించినాఁడో లేదో కనుగొంటివా?

మా—అతని కేమమ్మా మన్నపుగోరవంక మిరెపుబొడ్లను మ్రింగి నట్లాఁతఁడొక్కటే మ్రింగుట కాని నమలనైన లేదఁటమ్మా.

ప—హుఁ (దీర్ఘనిశ్వాసముతో) నాతో నిచ్చటఁ జిన్నతనమునఁ జదువుకొన్న రత్నప్రభ నీకు జ్ఞప్తిలో నున్నదా?

మా—లేకేమమ్మా! ఆమె మీవయస్సుదే కాదా? కంటిలోఁ గుఁదపలాగునఁ బుట్టుమచ్చయున్న పిల్లయే కాదఁటమ్మా?

ప—ఆమె నాకంటె రెండేండ్లు చిన్న. కంటిలోఁ బుట్టుమచ్చమాటయే చెప్పితివి, కాని చెవికున్న వంకరమాట చెప్పితివి కావేమి?

మా—అమ్మా! పెద్దవారిలోపములు మేము చెప్పఁగూడదు. కంటిలోఁ బుట్టుమచ్చ యదృష్టచిహ్నము కావునఁ జెప్పితిని.

ప—సరి. దీనికేమి? ఆమె చక్కనిదనియే నీయభిప్రాయము కాదా?

మా—ఆసంగతి నాకెట్లు తెలియునమ్మా?

ప—తెలియక పోవుటయేమి నీమొగము?

మా—ఆఁడుదాని చక్కఁదనము గ్రహించుశక్తి యంతో యింతో మగవానికున్నది కాని యాఁడుదానికి లేదు. ఒక యాఁడుది మఱియొక యాఁడుదానిని జూచునప్పుడు మొట్టమొదటఁ బరీక్షించునదేదనగా! గాగరా యేమి పీటేందో తొమ్మిది పీటీలదో- తొడుగుకొన్న ఱైకది పాలపిట్టరంగో భరతపక్షిరంగో- పెట్టుకొన్న జూకాలలోనిముత్యములు గట్టివో గుల్లవో యింతే- ఈప్రథమ పరీక్షయైన తరువాత, రెండవపరీక్షయేదో చెప్పనా? ముదురురవంత యెత్తు. పెదవి కానంతబెట్ట. గడ్డముక నూలువాసి పొడుగు. ఎడమచేతికి పుప్పిగోరు. ఇది

రెండవపరీక్ష. ఇంతటితోఁ బరీక్షకు భరతవాక్యము. అంతే కాని యాఁడుదానియవయవములచక్కఁదనము మఱియొక యాఁడుది గ్రహింపదు. గ్రహింపలేదు కూడను. మొత్తము మీఁద నాఁడుదానిసౌందర్య మాఁడుదానికి నచ్చదు. ఎవరిమట్టునకు వారే యప్సరసలని వారినమ్మకము. బుద్ధిగ్రహణ విషయమునఁ గవులలోఁ గూడ నిట్టి తెగులేయున్నదఁట. కాని నా కాసంగతి మట్టునకుఁ దెలియదు.

ప—అటులైన నాసౌందర్యము నీకు నచ్చలేదన్న మాటయేనా?

మా—అబ్బే. బజారుమాట చెప్పినాను గాని కోటమాట చెప్పినానా? అమ్మా! మీసౌందర్యము నాకు నచ్చకపోవుట కూడనా? ఎంతమాట?

ప—చూచు-రత్నప్రభది గుండ్రముగమని జ్ఞప్తియున్నదా?

మా—ఆ- గుండ్రమొగమే.

ప—మగవానికి గుండ్రమొగ మిష్టమా? కోలమొగ మిష్టమా?

మా—మగవాఁడనుచునొక్కఁడెవ్వఁడైనను న్నాఁడా అమ్మా! ఎంత మందిముండకొడుకులు గలసి మగజాతియైనదో- మొత్తముమీఁదఁ జెప్పుట్టవంటి మొగముగలవాని కువ్వకాయవంటి మొగముగలయాఁడుదిష్టము. పందిటిదోసకాయవంటి మొగముగల యాఁడుదాని కతుకుపాత్రమువంటి మొగమున్న మగవానిపై యిష్టము. ఇదిదేశాచారముగా జరుగుచున్నపద్ధతి. కాని మఱియొకటి కాదమ్మా! ఇందులోను చెటుకులు తిరకాసు లెన్నో యుండవచ్చును. కొందఱు మగముండకొడుకుల కవసరమే సౌందర్యము కాని యంతకంటె లేనేలేదమ్మా! ఈమాటలెల్ల కేమికాని బైరాగిమాట నేమిచెప్పినారు?

ప—సరే. తీసికొనిరమ్ము. మూఁడునిముసములకంటె నే నెక్కువ సేపు కూరుచుండనని చెప్పుము.

(మాలిని నిష్క్రమించును.)

సౌందర్యరసగ్రహణమున మాలిని చెప్పినమాటలు కొంత సత్యముగను కొంత యసత్యముగను గానిపించుచున్నవి. విజయనారాయణవర్మది కోలమొగము కావునసే రత్నప్రభగుండ్రముఁ మాతని కంతయిష్టమైనది అంతవఱకు సత్యమే కాని కోలమొగముగల నేను విజయనారాయణవర్మ నంతగాఢముగా వలచుట యేలసిద్ధించును? ఇచ్చట నాపరిపాటి యసత్యముగఁ గానఁబడుచున్నది. ఈవలపు నా కెందులకుఁ గలుగవలయునో, దీనివలన నేమికూడఁదలఁచియున్నదో యేమియుఁ దెలియదు. నాతండ్రి నాకు నియమించినభర్త నిదివఱకుఁ జూడనైన లేదు. ఏమో ఒక్కసారి కాఁబోలును మాతండ్రి సభలో మంచపుఁ గన్నులతో నేమిచూచితినో యెవరిని జూచితినో జ్ఞప్తిమెంత మాత్రమును లేదు.

[నేపథ్యమున] సాధువర్యా! ఇటు. ఇటు.

బైరాగిని దీసికొని మాలినివచ్చుచున్నది. నిలువఁబడియే యట్టి మహనీయుని గౌరవించుట మంచిది. (నిలువఁబడును.)

[మురళీమనోహరుఁడు మాలినితోఁ బ్రవేశము.]

విరాగివతంసమా! నమస్కారము.

ము—(తనలో నదరిపడి యట్టెశాంతించి)

గీ. బగ్గుమనువెల్గు హృదినుండి । బ్రహ్మరంధ్ర
మంటి వెన్నముద్దలకోటు । లంబరమునఁ
జెవులలో హోరుగలుగఁగఁ । జిమ్మెవైచి
నట్టు లొకరెప్పపాటులో । నయ్యె నహహా!

ప—విరాగివతంసమా! నమస్కరించితిని. ఉపవాసమునఁగాఁబోలు నాలుక యెండఁగ మాటలాడలేకుండవున్నారు. నీరసతచేఁ దూలుచున్నారు. మాలినీ! నీవుపోయి పరిమళభరితమైన చల్లని నీరు తెమ్ము.

ము—నారాయణ- వలదు. నారాయణ- వలదు.

ప—(తనలో) నేను నారాయణవర్మను వివాహము చేసికొన నిశ్చయించికొనియుండ నారాయణ వలదు నారాయణ వలదని యీతఁడపశకునముగ నాశీర్వదించె నేమి? (ప్రకాశముగ) మీరట్లు దయచేయుఁడు.

ము—(తనలో)

గీ. పెండ్లికూఁతును జూడఁగఁ । బెండ్లికొడుకు
వజ్రహారాలతోడుగుత్తో । వచ్చెఁగాని
బిచ్చగానిరూపంబున । వచ్చునొక్క
మగువఁగను నాస నన్నిట్లు । మూర్ఛవైచె.

గీ. తనువుబంగారుచాయయుఁ । గనులనైల్య
మధరశోణిమ గాఁగ రా । యాకుపచ్చ
మణులజిలజిలతలకట్టు । మబ్బునందు
వేయిఇంద్రచాపము లుద్భవింపఁ జేసె.

గీ. కపటసన్యాసినై నను । గావలసిన
యట్టియమనస్కతాసిద్ధి । యంతలోన
నయ్యె నాదుజన్మంబు కృతార్థమయ్యెఁ
జూడరానట్టి వెల్గు నే । చూచినాఁడ.

ప—అయ్యా! ఒకపావుగడియసేపు శ్రమతీర్చుకొనుఁడు. పిమ్మట నే మాటలాడవచ్చును. మాలినీ! నీవు వీవనతో నాయనకు విసరుము.

(మాలినిపోవును.)

ము—(తనలో) సన్యాసివేషమునన్నుఁ గాని నన్నీమె చూడదని నేఁటిట్లు సన్యాసివేషము వేయవలసివచ్చినది. స్వార్థమునకై వేషధారణము తఱచుగఁ బ్రకృతిలో జరుగుచున్నదే కాని యొక్క నా తలనే పుట్టినదా ?

గీ. విటునిసర్వస్వము గ్రహింప । వెలవెలంది
స్వచ్ఛకులసతీపాత్రంబు । నభినయించు
విభునిభూషలు హరియించు । వేడ్క ద్రోహి
భక్తివిశ్వాసగీతము । లాపుచుండు.

జనులధనము గొల్లగఁ దోఁచుకొనఁగ దొంగ
పరమదేశభక్తుని రంగు । బ్రాముకొనును
ముద్దరాండ్రను గౌఁగిటఁ । బొమువబోజుఁగు
కల్లజడలను దాల్చి భాగవతమాడు.

తరుణికొఱకేను కాటి లాతాముపూని
కపటయతిసాము తెరదాఁటి । కథవినుతు
తనుమనసులందు మాయబొంతలనుగప్పి
గజ్జెకట్టుట, జననైజ । గతియె సతము.

ధనమొ, కీర్తియొ రాష్ట్రమో । వనజముఖియొ
యేదొ మరియేదొ జనుఁడు కాంక్షింపకుండఁ
దీరదందుకై మాయసింగారములను
దాల్చి తెయితెక్కలాడుట । తప్పదెపుడు.

పంక్తిబాహ్యులు నటులని । ప్రజలుతలఁతు
రిలను నటకుఁడుగాని వాఁ । డెవఁడుగలఁడు
జగతియే నాటకము సర్వజనులు నటకు
లవసరముబట్టి యాడుదు । రాటలన్ని.

[మాలిని వీవనతోఁ బ్రవేశించును.]

ము—రాజ్ఞీమణీ! మీదాసి నాకు విసరనక్కఱలేదు. నేను సుఖముగ నున్నాను. మీయాదరమునకు మిగుల సంతసించితిని. నే నిటకువచ్చినకారణమేదో సంక్షేపముగఁ జెప్పెదను. వారాణసిలో గంగాతీరమున నొకమఠము బైరాగులకొఱకుఁ గట్టించుటకు సంకల్పించుకొనియున్నాను. విశేషధనసాధ్యమైనపని యగుటచేతఁ జక్రవర్తినియొద్దకు వచ్చితిని. వలదనుచుండగా నింకవిసరెద వేల?

ప—మాలినీ! నీవు పో.

(మాలిని నిష్క్రమించును.)

అయ్యా! కాశీక్షేత్రమున నిదివఱకనేకమఠము లున్నవి కాఁబోలు నేమి?

ము—ఎన్నియున్నను బైరాగు లిఱుకటపుబాధ నొందుచున్నారు.

ప—బైరాగులసంఖ్య వృద్ధియగుచున్నదా యేమి?

ము—అగుచుండుటలేదా?

గీ. దేహసౌఖ్యమే పరమావధిగ గణించు
జాతిగల దేశమందుఁ బ్రాచకులు తొత్తు
లనృతవాదులు తుచ్ఛశాస్త్రార్థవిదులు
కర్మశాలలు నభివృద్ధిఁ । గాంచురీతి.
భవవిముక్తియే యవధిగాఁ । బరిగణించు
మనదు భరతఖండంబున । దినదినంబు
భక్తవరులు బైరాగులు । పరమదాత
లన్నశాలలు దేవాలయములు మించు.

ప—వీరందఱు నిజముగా బైరాగులనియే మీయభిప్రాయమా ?

ము—వారు కాకపోవుట వారిది తప్పు. కాదని యనుకొనుట మనది తప్పు.

ప—ఈమాత్రపుఁ దప్పునకేమి? ఇతరులమాట యటుండుఁడు. మీ మాటయే యడుగుచున్నాను. యథార్థవిరాగత మీకుదయించుటచేతనే యిట్లయితిరా?

ము—(తనలో)

గీ. వేసినది దొంగవేసమై । వెలయుచుండఁ
గొంక కేవంకకూఁతనో । కూయవలయు
పూసినది హరితాళంపుఁ । బూఁతగాగ
బెదరి కేమంటగంతునో । వేయవలయు.

(ప్రకాశముగా) యథార్థమైన వైరాగ్యమునొందియే నేనిట్లయితిని.

ప—హేహేహే! పడుచువాఁడవు—ఆదిత్యతేజముగలవాఁడవు—ప్రభుకుటుంబములోనివాఁడువలెఁ గానఁబడుచున్నావు. మీకు బ్రపంచవైముఖ్య మెట్లు కలిగినదయ్యా!

ము—చక్రవర్తినీ! మనుజునిప్రాయముకాని, తేజముకాని జన్మాధికతకాని, వైరాగ్యప్రవృత్తికెన్నఁడైనఁ బ్రతిబంధకములగునా? ప్రపంచమా దేవపుట్టుటకేదో మహాకారణమావశ్యకమని యనుకొనుచున్నారా! కాదు. స్వల్పకారణ మందులకుఁ జాలును. కన్నుతిన్నగాఁ దెఱచిచూచినయెడలఁ గనఁబడునదంతయు రోఁతకాని మరియొకటియా? బాగుబాగని మనము కొనియాడువస్తువున్నదే-దానిని దిన్నగాఁ బరీక్షింపక మన మట్లను కొనుచున్నాము. కాని దాని చాటున నేమున్నదో చూచినయెడల నిఁక భవమందు వాంఛయుండునా? తెల్లవాఱినది మొదలు చూచినవస్తువులనే చూచి, యాడినమాటలనేయాడి, చేసినపనులనేచేసి, తలఁచినతలఁపులేతలఁచి, గిఱగిఱరంకులరాట్న

ములో దిరుగుటకంటె విసుగు మరియొకటి యుండునా? ఈ విసుగువలనఁ గొందఱు సన్యసింతురు. కాక మరియొక్క సంగతి.

ప—ఇఁక నేనడిగినది యక్కఱలేదు. ఇట్టికొన వెఱ్ఱిప్రకృతులు సన్యసించినంతమాత్రమునఁ బ్రపంచవస్తువులందు రోఁత తగ్గినదా? దినచర్యలోని పునరావృత్తిదోషము తగ్గినదా? ఈరెంటిలో వారినెట్టునకైన నేది తగ్గినది? ఇఁక సన్యసించుటెందులకు? పడుచుసన్యాసుల శిక్షించుటకొక చట్టముండునెడల మీ రిట్లయియుందురా? మీ రేరాజ్యములోనివారో కావున సరిపోయెను గాని మీరు మా రాజ్యములోనివారైనయెడల మీరు సన్యసించుటకు నే నంగీకరించి యుందునా? జరిగినదేదో జరిగినది. ఆచింత యిప్పుడక్కఱలేదు. కాని మీ రేయే విద్యలనభ్యసించినారు?

ము—విద్యలేవియు విశేషముగ నభ్యసించి యుండలేదు. ఒక్క జ్యోతిషమందు మాత్రము కొంతప్రవేశము కలుగఁజేసికొంటిని.

ప—ఆలాగా? మీరు మంచిసమయమునకే వచ్చితిరి. మాకోటలోఁ ద్వరలో నొకవివాహప్రధానముహూర్తము పెట్టవలసియున్నది. పెట్టుదురా?

ము—ప్రధానమా? ప్రధానము జరుగుటకేమికాని, మీకు బహుమనస్తాపము, బంధువిరోధము కలుగుటకు సిద్ధముగనున్నవి.

ప—(తనలో) ఇంతవఱకు సరిగనే చెప్పినాఁడు. మనస్తాప మారంభమే యైనది. అది వృద్ధియగును గాఁబోలు. బంధువిరోధమును నేను గణింపను. ఏమివచ్చినను సరియె. (ప్రకాశముగా) అయ్యా! ఈసంగతి మీ రెట్లు చెప్పగలిగితిరి?

ము—(గ్రహబలాబలములచేత—(తనలో) మొదటినుండియు నాపక్ష మవలంబించి పనిచేయుచున్న మాలినికీసారి విశేషధనమిచ్చి యన్నిసంగతులు తెలిసికొనుటవలన నాజ్యోతిషజ్ఞానమున కింత కాంతివచ్చినది.

ప—ఇంక నన్నుఁగూర్చి యేమైనఁ జెప్పఁగలరా? నాజన్మనక్షత్రము—

ము—అది నాకక్కఱలేదు. ముఖమునుజూచియే చెప్పఁగలను. (నిదానించి) మీ యొక్కరాజపుత్త్రుఁ డసాధారణముగా వలచియున్నాఁడు.

ప—అది యెందులకు? అదియెందులకు? ఆసంగతి యాతనిగూర్చినది కాని నన్నుఁగూర్చినది కాదే? ఆతఁడు నన్నువలచెనా? అందులో నసాధారణముగనా? నన్నుఁ బ్రేమింపుమని యాతని నేను గోరితినా? చంద్రికళను వలచినయెడల నాతని కెంత ప్రయోజనమో నన్నువలచినయెడలఁగూడ నంతే. ఆతనివల పాతనిలోఁ దెగటాఱవలసినదే. కాని యది యెక్కఱకు వచ్చునా? రానిచ్చెదనా? నన్ను వలచినాఁడట అబ్బ! వలచుటకు నేనంత మీఁదమీఁద నున్నాననుకొనెను గాఁబోలు! తాను సామంతరాజనియు నేను జక్రవర్తిననియుఁ దానెఱుఁగఁడా? ఎంతభయభక్తులులేని ప్రవర్తనము!

ము—(తనలో) ఈమాట లిదివఱకు మాలినివలన వినినవే కాదా? ఇప్పుడు తిరిగి నే నేల చింతింపవలయును? ఎప్పటికైన నీమె మనస్సుతిరిగి నన్నంగీకరించునా? నేను సంసారినే యగుదును. కాదేని దొంగసన్న్యాసమే నిజమైనసన్న్యాస మగును. (ప్రకాశముగా) మీరు చక్రవర్తిని యగుటచే నెన్నటికైన మిమ్ము సామంతరాజే వివాహమాడవలయును గాని మీతో సమానుఁడగు చక్రవర్తి యింక నొకఁడేఁడీ? పరదేశచక్రవర్తులతో

మనకు సంబంధములు లేవయ్యెను. ఆతనివల నసాధారణమైన దని యేలచెప్పితి ననఁగ మీ రాతనివరింపకుండునెడల నాతఁడు ప్రాణపరిత్యాగమైనఁ జేసికొనును. భవపరిత్యాగమైన జేసికొనును.

ప—ఇప్పుడు మీరు చెప్పినమాటలు జ్యోతిషపరిజ్ఞానమువలనఁ జెప్పినమాటలు కానట్లగపడుచున్నది. నా మొగము చూచి యాతని చావు కాని, సన్న్యాసము కాని మీరెట్లు చెప్పఁగలిగితిరయ్యా?

ము—గీ. అర్కుఁడని చంద్రుఁడని శుక్రుఁడని గ్రహంబు
లన్ని వేర్వేఱునామంబు । లందియున్న
నన్నిరూపంబులను వెల్గు । చున్నయట్టి
తేజ మొక్కటి యౌనుగా । దే లతాంగి!
అబ్ధమని నదమని గంగ । యనుచు భిన్న
సంజ్ఞలే కాని యొక్కటే । జలము కాదె
కుండ గుడియను పైభేద । ముండుఁ గాని
యంతరాకాశ మొక్కటే । యగునుగాదె?
ప్రాణులన్నియు బహువిభి । న్నాకృతులను
గర్మభేదంబులను బట్టి । కలిగియున్న
నన్నిప్రాణులలో నిండి । యున్న యాత్మ
తత్త్వమున నొక్కటే యంచుఁ । దలఁపవలయుఁ
తనదు నాత్మఁ బరీక్షించు । కొనిన యోగి
యెల్లవారల నాత్మల । నెఱిఁగియుండు
నన్ను నే నెఱుంగుటచేత । నిన్నువలచు
వాని యాత్మ నెఱింగిన । వాఁడనైతి.

ప—అట్లైన నితరులహృదయములన్నియు మీకుఁ బ్రత్యక్షము లేనా?

ము—తెలిసికొనఁ దలఁచినయెడలఁ గరతలామలకములే కాని మే మట్లు చేయము.

ప—కాని యిది జ్యోతిషశాస్త్రప్రజ్ఞయా ?

ము—కాదు మఱియొకటి

ప—ఏదియైన నాకేమి కాని నాహృదయమును బరిశీలించి చెప్పుఁడు.

ము—ఏదో లబ్ధికై వచ్చినవాఁడను నేను మీరహస్యములు బైటఁ బెట్టుటేల ?

ప—మీలబ్ధి యందువలనఁ జెడునది కాదు. మీరు సరిగా జెప్పినయెడల మీరనుకొన్నలాభముకంటె నెక్కువలాభము కలుగును.

ము—(నిదానించి) రాజ్ఞీమణీ! నేను జెప్పఁబోవునది సావధానముగ వినఁ బ్రార్థింతును. మిమ్ము వలచినవానిపై మీకుఁ బ్రేమము లేదు.

ప—ఔను. కళింగరాజుపుత్రునిపై నాకుఁ బ్రేమ లేదు. ఆసంగతి నే నిదివఱ కనినమాటలవలననే తెలిసికొనఁదగినది. గొప్ప జ్యోస్యమే చెప్పితిరి.

ము—అంతటితోఁ గాలేదు. ఇంకఁ జెప్పుచున్నాను. మీరు మఱియొకరాజపుత్రుని గాఢముగా వలచిరి. కాని యాతఁడు మిమ్మపేక్షింపలేదు.

ప—ఆఁ. ఆఁ. నిజముగా నిది హృదయపరీక్షవలనఁ జెప్పినదేనా ? నిజముగా మీరు దైవజ్ఞులు. నేను చాల సంతసించితిని. కాని మీకుఁ జిన్నవయస్సగుటచేతఁ గొంత యనాలోచితముగఁ జెప్పినారు. నా కవమానకరమైనమాటయైనప్పు డదిసందేహముతో సంకోచముతోఁ జెప్పఁదగినది సౌందర్యవతినై చక్రవర్తినైననేను వలచినవాఁడు నన్నుఁ బ్రేమింపకపోవుటకంటెఁ

బరాభవము నాకున్నదా ? ఆతఁడు నన్నపేక్షింపఁడని మీరు ధారాళముగా నే నేమనుకొందునో యనుసంశయమైన లేకుండఁ బలికినారు. నాయాశాభంగమునకై, నాపరాభవమునకై మీరు విచారింపకపోవుటయే కాక యుత్సాహమొందుచున్నట్లు గూడ మీముఖవైఖరిచేఁ దెలియుచున్నది. ఆతఁ డింతవఱకు నన్నుఁ బ్రేమింపకపోవచ్చును గాని యికముందు నేను జేయఁదలఁచినప్రయత్నమువలనఁ బ్రేమించునేమో-ప్రేమింపఁడని మీ రెట్లు స్పష్టముగఁ జెప్పఁగలిగితిరి? ఇప్పటివఱకే హృదయపరీక్షకాని ముందు హృదయమందుఁ గలుగఁబోవు మార్పుల నెట్లిప్పుడే పరీక్షింపఁగలిగితిరి? ఒకవేళ నన్నాతఁడు ప్రేమింపఁడనియే నిశ్చయపఱుపుఁడు- ఆమాటనంత విస్పష్టముగఁ జెప్పి నామనస్సును మీరు బాధింపవచ్చునా ? మీకింతభయహీనత యెందువలన ? నామనస్సునకు నొప్పికలిగినయెడల నేను జేయలేనిపని యేదైన నుండునా ? నాబాధను దగ్గించుటకు మీవంటివారు నాకుఁ దోడ్పడుటకుబదులుగా బాధను వృద్ధిచేయుటకై ప్రయత్నించుట తగునా? సరే యిది యటుండనిండు. ఆతఁడు నన్నుఁ బ్రేమించుట కేమియభ్యంతరము ?

ము—ఆతఁడు మఱియొక కాంతను వలచినాఁడు.

ప—ఆకాంత యాతని బ్రేమించినదా?

ము—ఆ.

ప—సరే! 'ఆ' యని యాకాశమంత నోరు తెఱచియంటిరే. ఆతనిపై నాప్రేమ యెక్కువయో దాప్రేమ యెక్కువయో బాగుగా నిదానించి చెప్పఁగలరా?

ము—రెండిటికి భేదము చెప్పుట కష్టము.

ప—కష్టము కావుననే మిమ్మడుగవలసివచ్చినది. మీకున్న యాత్మసాక్షాత్కారము నాకున్నయెడల నీసరికిఁ బ్రపంచము నల్లలాడించియుందును. ఆతనియెడల నామె ప్రేమ యెక్కువయో? నాప్రేమ యెక్కువయో? మహాత్మా! ఇది ముఖ్యమైన యంశము. నిదానించి బాగుగాఁ జెప్పవలయును.

ము—చెప్పటకుఁ బ్రయత్నింతును. ప్రక్కగట్లనున్న ప్రబ్బిపూలు తమ మొగములను నీటిలోఁ జూచుకొనుచు నవ్వుకొనుచుఁ దలలూచుచుండఁ జల్లగ నిష్కల్మషముగఁ బచ్చని బీళ్లనడుమఁ బ్రవహించు పంటకాలువవలె యామె వలపున్నది. ఎత్తైనకొండలనుండి ప్రచండధాటితోఁ బ్రబలవేగముతోఁ దలక్రిందుగా గ్రిందఁబడి ప్రవాహవేగమునఁ గూడఁ గొట్టుకొనివచ్చుచున్న చెట్లతో రాలతో భయంకరములైన సుడిగుండములను గలిగించుచు నాకాశమంతయుఁ గ్రమ్ముకొనిన తుంపరలమబ్బులందు శక్రధనుశ్శతమును గల్గించి, చల్లనయ్యును, దీక్ష్ణమైన యాకృతితో సుందరమయ్యును రౌద్రమైనరూపముతో వెలుగొందుమహాజలపాతమువలె మీవలపున్నది.

ప—నాకీపాము మెలికమాటలు నచ్చవు. నాప్రేమయే యెక్కువయని ఘంటాపథముగాఁ జెప్పరెందుచేత? మరియొక్కసారి యడుగుచున్నాను. చెప్పరెందుచేత?

ము—ఒకటి యెక్కువయేమి? ఒకటి తక్కువయేమి? దాని నైజమది. దీని నైజ మది. మనోమార్దవమును గలుగఁజేయు మర్దళధ్వనివలె నామె వలపున్నది. హృదయావేగమొనర్చు భేరీరవములె మీయనురాగ—

ప—అదిగో! తిరుగ నట్టి కప్పదాటుమాటలాడెద రేల? నాప్రేమయే యెక్కువయని స్పష్టముగాఁ జెప్పుఁడు. అందువలన నసత్య

కథన దోషము మీకు లేదు. నేనూరక యడిగితివి గాని నాకంటె నామె హృదయము మీరు బాగుగా నెఱుఁగుదురా? మీ యాత్మదర్శనము నా యనుభవముకంటె నెక్కువది కాదు. ఆమెకు నాయంత ప్రేమయే! నాతోఁ జదువుకొన్న యింతకు ఆడది. మెత్తమెత్తని మొడలు, భయశీలములై సాధువులైన కన్నులుగల లొండ తెమకుఆడది. ఆఁ యని నేనన్నట్టె కన్నార్ద్రదేయు సరికిఁ గన్నులనీరు తెచ్చుకొనినదే! ఎక్కడఁ గూలఁబడుమన్న నక్కడఁ గూరుచుండునదే! ఏవస్తువైనఁ గావలయునని యెప్పుడైన నంతపట్టు పట్టినదా? ఇయ్యానియెడలఁ దాను దానిని సాధించి తెచ్చుకొనుదాఁకఁ దహతహలాడినదా? వట్టి జావకడికుఆడదాని కనురాగము బలిష్ఠముగా నుండునని మీ రెట్లనుకొంటిరయ్యా? దేహతత్త్వమునుబట్టియే యనురాగతత్త్వము గూడనుండును. ఈమాట లేల? నాయనురాగమే యెక్కువయని మీ రొప్పుకొంటిరి కాని— మఱియొకటి—

ము—మఱియొకటి చెప్పెదను.

ప—ఏదది?

ము—ఆతని కాతనికాంత యం దెక్కువ ప్రేమమో? కళింగరాజపుత్త్రునికి మీయం దెక్కువప్రేమమో మొలచినది మొలచినట్లు, పూచినది పూచినట్లు చెప్పెదను.

ప—ఆమాట మీరనఁదగదు. నేను వినఁదగదు. తెలిసినదా?

ము—మీరు ప్రేమించినయాతఁడు మిమ్ముఁ దిరుగఁ బ్రేమింపకపోవుటచే మీకు మహాపరాభవము కలిగెనని మీరిదివఱకిబ్బంది పడితిరే! మిమ్ముఁ బ్రేమించిన కళింగరాజపుత్త్రుని మీరు ప్రేమింపక యిట్లు పరాభవించుట మీకు బాగుగానున్నదా? మీమనస్సువంటిదే కదా యాతనిమనస్సుకూడను—

ప—మీ యింటనుండి వెడలిపోదలఁచిన యెడలఁ బొండు. అంతేకాని యాతనినిగూర్చి చెప్పకుండు- ఒక్కఁడు మనస్సంతయు నాక్రమించుకొనివాఁడు. రెండవవానికి దావేది? ఒక్కనివీనెనలో రెండు వీణ లిముడునా? సన్యాసులు మాకొఁడువారివంటివారే కావ నామనస్సు కొల్లడిచేయుచున్నారు. ఆతనిగూర్చి మీరు పెదవి కదల్పవలదు. కాని యాతనిఁగూర్చి మీరిదివఱకుఁ జెప్పినారు ఇప్పుడుకూడఁ జెప్పినారు. మీకీపట్టుదల యెందులకో నాకు సందేహముగానున్నది ఏమి చెప్పెదరు?

ము—ఆత్మసాక్షాత్కార మొనర్చుకొనఁబోవునప్పుడు మీతండ్రిగారు నాకు గానఁబడి కళింగరాజపుత్రునివంక వ్రేలుచూపి నాకు సంజ్ఞచేసినారు తండ్రిగారియాజ్ఞ మీఱుట మీకుఁ దగదు. కావున నట్లు చెప్పవలసివచ్చినది.

ప—ఏమైననసరే! నేను వినను. ఆతనినిగూర్చి మీరింకఁ జెప్పఁదలఁచు నెడల మీరు దయచేయవచ్చును.

ము—(తనలో) కానీ, యెంతకైన సహించి యీమెమనస్సు మఱల్చి తుదకీమెనే వివాహముచేసికొనవలయును. లేదా ముక్తికాంత నపేక్షింపవలయును. వేఱుమార్గము లేదు. ఇక్కడ నే నుండవలయును. పొమ్మనునేమోయని భయముగా నున్నది. (ప్రకాశముగా) రాజ్ఞీమణీ! మీయిష్టము.

ప—మీరు చెప్పనక్కఱలేదు. నాయిష్టమే కాని మఱియొకనిమాట నేను వినను.

ము—మీరడిగితిరి కావున నింతదూరము మాటలాడవలసివచ్చినది. మత్ప్రాణమునకు నేను గోరినధన మిప్పు డవకాశమున్న యెడల నీయఁగోరెదను. కాదేని గొల్లఁది దినములుండి తీసికొనిపొమ్మన్న నట్లు చేసెదను.

ప—మీధనముకొఱకు మిమ్మాఁపనక్కఱలేదు. మీధనమిచ్చిన యెడల మీరు పోవుదురేమోయను సందేహమున నిప్పుడీయను. మీరు కోటలోఁ గొలఁదిదినము లుండవలయును.

ము—అయ్యయ్యో! సన్యాసిని నే నిచ్చటనుండుట తగునా?

ప—తగునో తగదో నన్నడుగువాఁ డెవ్వఁడు? నే నెవనికిఁ జెప్పవలసి యున్నది? నా కోటలో నాయధికారము- నాయిష్టము- మీరు కోటలో నుండవలయునని యెందులకుఁ జెప్పితినో చెప్పనా? కారణము చెప్పినఁగాని మీరుండరేమోయను సందేహము చేతఁ జెప్పుచున్నానని యనుకొనవలదు. మీరుండనియెడల నుండవలసిన క్రమమేదో నేనెఱుఁగుదునయ్యా? ఇఁక మూఁడు నాల్గుదినములలో నాకోటలో సమస్తవైభవములతోఁ బెండ్లియో, సంఘమరణమో జరుగనైయున్నది. ఆమహావసరమున నెవరిహృదయ మెటులుండునో నేను మిమ్మడిగి తెలిసికొన వలసియున్నది. అందుకొఱకుండుఁడని చెప్పితిని. మీరిఁక మాటలాడఁదగదు. నేనుగూడనట్టే మాట లాడఁదలఁచుకొనలేదు. మాలిని మీకుఁ గనఁబఱచుబసలో మీ రుండవలయును.

ము—మూఁడు నిముసములకంటె నాకు వ్యవధి దయచేయకుండినను నింతసేపు మీకు శ్రీమయియాయసాహసించినందులకు మన్నింపవలయును.

ప—చాలసేపు గూరుచుంటిసని మీరు నన్ను దెప్పిపొడుచుచున్నారా? మీవైఖరి మీమాటలు నాకుఁ గొంత విశ్వాసభాజనములుగా నుండుటచేత నింతసేపు మాటలాడితిని. మాలినీ—

ము—(తనలో) ఇన్నిమాటలలో నీయొక్కమాటయే నాకుఁ గొంత యనుకూలముగ నున్నది. [మాలిని ప్రవేశించును]

ప—మాలినీ! ఈయనను నాయనగారిపూజామందిరమున విడియింపుము.

మా—చిత్తము. మహాత్మా! దయచేయుడు.

ము—రాజ్ఞీమణీ సెలవు.

ప—సరే.

(మాలిని మురళీమనోహరుఁడు నిష్క్రమింతురు.)

స్ఫటికశాలలో విజయనారాయణవర్మ యున్నాఁడు. ఎల్లుండియో యావలెల్లుండియో నాకోర్కె కడ్డుగనున్న రత్నప్రభను దీసికొని యామెతండ్రి వచ్చును. ఇంతలో నాకస్మికముగ నీబైరాగి యెవఁడో వచ్చినాఁడు. ఇటుపైని విజయనారాయణవర్మతోఁ దిరుగ మాటలాడి రత్నప్రభతో మాటలాడవలయునో, రత్నప్రభతో మాటలాడినపిమ్మట నే విజయనారాయణవర్మతో మాటలాడవలయునో, వీరిద్దఱికంటె ముందుగ నామెతండ్రితో మాటలాడవలయునో యీనడుమ నెప్పు డెప్పుడు బైరాగితో మాటలాడవలయునో యేమియుఁ దెలియకుండ నున్నది. ఎచట దట్టమైన మంచున్నప్పుడు కన్నెంత నిష్ప్రయోజనమో నాయూహ యంత నిష్ప్రయోజనముగనున్నది. కథనంతను ముందు కుదుర్చుకొని యంకవిభజన మొనర్పకుండ మొండిత్రోపుగ నాటకమారంభించుకవివలె నే నీప్రయత్నమున దిగితిని. ముందంకమేదో యాతనికిఁ దెలియదు. నాకుఁ దెలియదు. తుదకెట్లో యతనిగ్రంథము పూర్తియగును. నాప్రయత్నము పూర్తియగును. ఏట్లో స్థితులో అతనికి సుఖమో దుఃఖమో నాకు—

(నేపథ్యమున) సెలవుప్రకారము బైరాగిని బసలో దింపితిని.

ప—మాలినీ! ఇటురా.

[మాలిని ప్రవేశించును.

నాకుఁ దలనొచ్చుచున్నది. సాయంకాలము కావచ్చుచున్నది. ఉద్యానవనద్వారము తెఱచియుంపుము. అటకు వచ్చెదను.

మా—చిత్తము. (పోఁబోవును.)

ప—చూడు ఉద్యానవనమున నూరక కూరుచుండు నెడలఁ దలనొప్పి తగ్గదు. కొంతవ్యాయామ మావశ్యకమేమో విజయనారాయణవర్మ నాతోఁ గుండబంతియాటకు వచ్చునేమో కనుగొందువా?

మా—చిత్తము.

(పోఁబోవును.)

ప—చూడు మాలినీ! అక్కడనున్నావు కాదా? అతనితోఁ జెప్పవలదు. నామూలమున నాతనికి శ్రమ మెందులకు? మేనమామ కూఁతుతోఁ బ్రధానమగునని యాతఁడు సంతోషముతో నున్నాఁడు కాఁబోలు నేమి?

మా—భోజనమైనపిమ్మట నాతనిని జూడలేదమ్మా.

ప—మంచిపని చేసితివి. చూడకపోవుటయే నా యిష్టము చూడు. సంగీతము వినుటవలనఁ దలనొప్పి సర్దుకొనునేమో?

మా—ఆస్థానగాయనీమణిని బిలిపింపనా?

ప—పోనిమ్ము. పాడునప్పుడు దాని మొగముచూడగ మఱింత తలనొప్పి వచ్చునేమో. ఏమియువలదు. అభ్యంగన మొనర్చుకొందును. అన్నియు సిద్ధపఱుపుము.

మా—చిత్తము.

[(మాలిని పోవును.)

ప—మాలినీ! ఇటురా?

[మాలిని ప్రవేశించును]

ఉన్న వేడిమి తలలోఁగాదు. మనస్సునో నున్నట్లున్నది. అభ్యంగన మెందులకు? నిద్రకు మందు సిద్ధపఱుపుమని యాస్థానవైద్యునితోఁ జెప్పుము. ఈరాత్రి నేను భుజింపను. ఇప్పుడే పండుకొందును. పడకగదికి దారిచూపుము. మాలినీ! రత్నప్రభ మూఁడునాల్గుదినములలో వచ్చును. సంగీతములుంకావు. నాటకములుంకావు. సరసములైన సమస్తవినోదములు నామె గౌరవార్థమేర్పఱుపవలయునని నేనాజ్ఞాపించినట్లు మంత్రితో వెంటనే చెప్పుము. నాకుఁ బరాకు హెచ్చుగనున్నది. నడు.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

ఇది ద్వితీయాంకము.

పద్మిని

తృతీయాంకము.

ప్రదేశము—పద్మినియంతఃపురము.

[ప్రవేశము—పద్మిని, రత్నప్రభ.]

ర—అక్కా! నాకొఱ కిన్ని వేడుకలు చేయింపవలయునా? ఇన్ని యుత్సవములు చేయింపవలయునా? నేనేమి క్రొత్తదానవా?

ప—క్రొత్తదానవైనయెడల నీకొఱ కేమియుఁ జేయింపకయేపోవుదును. ప్రీతదానవగుటచేతనే యందులోఁ జిన్ననాఁటిదానవగుటచేతనే నీరాకకు నేనింతసంతోష మొందుచున్నాను. నావలెనే నాప్రజలుకూడ సంతోషింపవలయునని యాజ్ఞాపించినాను. నిన్నుఁజూచి యెంతకాలమైనదో చెప్పు. ఈలోపల నొక్కలేఖయైన వ్రాసితివా? నాక్షేమ మెప్పుడైనఁ గనుగొంటివా? నాప్రాణము లన్నియు నీపైఁ బెట్టుకొంటినిగదా! నీకింత దయలే దెందుచేత? తుదకు నేను వార్తనంపినకాని వచ్చితివే కావే!

ర—అక్కా! అన్నిలోపములను మన్నింపవలయునని విధేయురాలనై మ్రొక్కుకొంటిని గాదా! అన్నిలోపములు తీఱునట్లిప్పుడు చేతులుకట్టుకొని వచ్చితినిగాదా?

ప—వచ్చితివమ్మా! నాకెంతసంతోషముగా నున్నదనుకొన్నావు! కాని యిక్కడనుండి నిన్ను నేను బొమ్మనియనువఱకుఁ బోనని నామీఁద నొట్టుపెట్టుకొనవలయును.

ర—నీవు సెలవిచ్చి పంపువఱకుఁ బోవనని ప్రమాణము చేయుచు
న్నాను. అక్కా! ఇట్లావరించు వారెవరమ్మా! మాతల్లి
కాలధర్మమునొందినది. నీవే నాకింక తల్లివి. సోదరివికూడను.

ప—చెల్లెలా! నాకుమాత్ర మెవరున్నారు. తల్లిదండ్రులు లేనే లేరు.
తో డంతకంటె లేదుగదా? నాకు నీవు, నీకు నేను చెల్లెలా!
పూచినగులాబి మొగ్గలాగున నీ వెంతకన్నులపండువుగా ను
న్నావే. కోక కచ్చపోసి కట్టుకొనలేకపోయితివా? త్రైఁ చేతు
లంతపొడుగుగాఁ బెట్టుకొంటివేమే? అంతపై కొంగలాగుకొని
పోకుండ నంతక్రిందికి సాగిపోకుండ నాత్రైక చేతు లెట్లున్నవో
చూడు. జిగినీలోనినడిమి రాయిమాత్రము చాల బాగుగా ను
న్నదే. నాకంటె రెండేడ్లు చిన్నదాన వైనను నీ వెంతగోవగా
నెదిగినావే! మొదటినుండియు మెత్త యొకలిదానవు. నీవేలా
గునవుందువో యని నామనస్సులో నే నెన్నిబొమ్మలుగీచికొ
న్నాననుకొన్నావు? నీవు పొడుగెదిగిపోవుదువేమో యని నే
నెంతయో జడిసినానుసుమా! నీగుండ్రమొగమునకుఁ బొట్టిగా
గుమ్మటములాగున గుదించిన ట్లుండుటయే సొగసమ్మా? మొ
త్తముమీఁదఁ గన్నులునిండుగఁ జప్పజప్పనఁ దోటకూర కాడ
లాగున బాగుగ నెదిగినావే.

ర—అక్కా! నీవుమాత్రము బాగుగా నెదుగలేదా?

ప—అడుగవక్క ఆలేదు. పట్టి కట్టుపడి. ఒడలఁగట్టుపడియే. మనస్సున
గట్టిపడియే.

ర—కొందఱకుఁ గాపురముచేయుచుండగా నొడలువచ్చునమ్మా! అ
క్కా! కళింగరాజపుత్త్రునిమాట స్థిరపఱచితివా?

ప—నాకంటెఁ జిన్నదానవయ్యును ముందుగా నీభావను స్థిరపఱచు
కొని నీవు కూరుచుంటివి. కాని యెందు అట్లుస్థిరపఱచుకొనఁ

గలరా? యింటిలో మగఁడు-మేనయత్తకొడుకు. ఎప్పటికప్పుడే
చాటునుండియో చూచిచూడనట్లు రవంత చూచుకొనవచ్చు
ను. ఆడియాడనట్లు రవంతమాటలు కలుపవచ్చును. చేసిచేయ
నట్లు కొంత యుపచారములు సేయవచ్చును. నీసుఖము
నీసంతోషము, నీయుత్సాహము నాకెందులకు వచ్చునమ్మా!
అనఁగనఁగ నొకరాజఁట. ఆరాజేదో సముద్రతీరమందలి
యొకపల్లె కధికారియఁట. ఆతని కొకకొడుకఁట. ఆతని మొగ
ము కోఁతిమొగమో కొండముచ్చుమొగమో తెలియదఁట.
ఆతఁడు మైనపుదిమ్మయో రాతిబొమ్మయో యంతకంటెఁ దె
లియదఁట. ఆతఁడు భోగాలవీధి భోగయ్యయో ఆడారిదద్ద
య్యయో మొదలే తెలియదఁట. ఆతనినోటఁ బల్లేరుకాయయో
తలలో మట్టిముద్దయో మనసులో దుష్టపురుగో హృదయ
ములో నిసుకదిబ్బయో బొత్తిగాఁ దెలియదఁట. ఆతని జేసికొన
వలసినదని తండ్రిగారి యాజ్ఞయఁట. చక్రవర్తిని యతనినింకఁ
జెట్టఁబట్టి సింహాసనముపైఁ బెట్టలేదని యూరియమ్మలక్కలు
బుగ్గలు నొక్కుకొందురఁట. నాబ్రదు కిట్లున్నది. ఏమడు
గుదువు!

ర—నీవు చక్రవర్తినివగుటచే నందఱు నీయాజ్ఞకు బద్ధులుకారా!
కళింగరాజునకు వార్తనంపి పెండ్లికొడుకును బిలిపించి యాతని
విద్యాబుద్ధులు స్వరూపస్వభావాదులు పరీక్షించుటకై కోట
లోఁ గొన్నిదినములు పెట్టుకొనరాదా?

ప—నాల్గుదినము లింటియొద్దఁ గట్టిపై చికొని పాలుచూచుకొని పరి
ష్కరించుకొనట కిదియేమిబట్టబేరమా? నాపెండ్లిమాట
కేమిగాని ముందు నీప్రధానపుసంగతి నిశ్చయింపవలసియు
న్నదికాదా?

ర—అక్కా! మీకు మాయందున్న యభిమానమునకై మేము మిక్కిలి సంతసించుచున్నాము. ఏనాటిపాఠశాల, ఏనాటిచిన్నతనము, ఏనాటిచదువు. మాప్రధానమునకై మీరింత యాత్రపడుచున్నారు. నాయందలి మీప్రేమకు హద్దున్నదా?

ప—నీమీఁద నాకు, నామీఁద నీకుఁ బ్రేమలున్ననేమి లేకున్ననేమి? మీకిద్దఱ కన్యోన్యానురాగ మున్నదిగదా! ఆసంగతియే యిప్పుడు కావలసినది.

ర—(సిగ్గు నటించును.)

ప—సిగ్గుపడుటకాదు. ఆఁడుదానికేమి మగవానికేమి యిదే మహావసరము. బహుజాగరూకతగఁ బ్రవర్తింపవలసిన సమయము. ఎత్తునుండి దిగునప్పుడు కాలుజాఱినయెడలఁ గూడఁ దీసికొనవచ్చును. విషము ప్రమాదమున మ్రింగిననైన వాంతిచేసికొని తనువు నిలుపుకొనవచ్చును. కాని దుర్భ్రాంతిచే మగనిని స్థిరకఱచుకొన్నయెడలమాత్ర మిఁకఁ గూడిరాదు. నాలుక అంపముచేఁ గోయించుకొనవచ్చును. కన్నులలోఁ జీలుకొట్టించుకొనవచ్చును. అగ్నిజ్వాలను కౌఁగిలించుకొనవచ్చును. కాని నచ్చనిపతితో మాటలాడలేము. ఆతని జూడలేము. అంత దూరముననైన నిలువఁబడలేము.

ర—అక్కా! అట్టిచిక్కెన్నటికిఁగూడ రాదు. ఆధైర్య మున్నది.

ప—చెల్లెలా! నీమనస్సు నీవెఱుఁగకుండఁ జెప్పుచున్నావని నాకు భయముగనున్నది. బాల్యమునుండి మనమెవనితోఁ బెరిగి తిరిగి యాడుకొంటిమో యాతనిపై మనకుఁ బత్యనురాగ ముండదుసుమా! అదివట్టిచనవుసుమా? సంతతమైన పరిచయముకంటె నదియెక్కువదికాదు. అదిమైత్రికాని మరియొకటికాదుసుమా! దానినినీవు భర్త్రనురాగమని భ్రమించుచున్నావని నే నాఁడో

శంకపడుచున్నాను. ఎదుటఁబడినప్పు డుప్పొంగిపోవుట, రవంత కనుచాటైనయెడఁ గ్రుంగిపోవుట, యొక్కచోఁ గూడుచుందమని, యొక్కచో నాడుకొందమని, యొక్కచోఁ బండుకొందమని సంతతము దేవులాడుచుండుట యనునవి మైత్రికిఁ బత్యనురాగమునకు సమానధర్మములే. అయినను దానికి దీని కెంతయో భేదమున్నది. మైత్రిలో మానుషికతేజముమాత్రమే యున్నది. పత్యనురాగములోఁ బ్రధానముగ దైవతేజమున్నది. దానిలో నెంతకలసియున్నను విభిన్నత్వమున్నది. దీనిలో నెంత దూరముననున్ననరే యేకత్వమున్నది. దానిలో నైహిక గంధమే కాని దీనిలో నాముష్మికసౌరభముఁగూడ నున్నది.

ర—అక్కా! నే నేమి చిన్నదాననా? నా కిన్ని చెప్పవలయునా? భగవంతునికటాక్షమున మే మత్యంతసుఖులమై యుండఁగలము.

ప—(తనలో) అబ్బ! ఆలాగేమి? నిన్నాతనితో సుఖపడనిచ్చెదనా? నీభర్త నాబాహుబంధమందైన నుండవలయును. పరమపదమందైన నుండవలయును. నాసంకల్ప మంతే. (ప్రకాశముగా) చెల్లెలా! నేను నీ కింతదూరము చెప్పుట కేదో కారణమున్నదని గ్రహింపకున్నావు. నీ వెఱుఁగని యంశమేదో నే నెఱుఁగుదునని నీవు తెలిసికొనఁజాలనప్పుడు నే నేమిచేయఁగలను? నీ యిష్టము.

ర—అదేమమ్మా! అట్లనుచున్నావేల?

ప—ఏమియులేదు చెల్లెలా! నీకుఁ బ్రధానదినమున నెట్టిచీర కావలయునే? చూడు నిమ్మపండువంటి నీతనుకాంతి కూదాపట్టుచీర బాగుగా నుండునేమో? కాక నాచురంగుపట్టుచీర బాగుగా

నుండునేమో? దీపాలకాంతి నాకు వచ్చునిరం గెంతశోభావంతముగ నుండు ననుకొన్నావు. నామట్టునకు నాకు—

ర—అక్కా! ఈమాటల కేమికాని యదేదో చెప్పవా?

ప—ఏమున్నది చెల్లెలా! మగజాతివలపు మెల్లకంటిచూపు నొక్కటే తీరు. అది యొకతెపై నున్నట్లగపడుటయే కాని మరియొకతెపై నుండును.

ర—(నవ్వుచు) ఇంతేకద!

ప—నేను జెప్పినది నీవు గణింపనేలేదా? మీఁదుమిక్కిలి పరిహసించుచున్నావా? నీవు పరిహసించుటకు నే నంతప్రకృతివిరుద్ధముగ మాటలాడితినా? మగవాఁడు స్వభావమునఁ జంచలుఁడగునా కాదా? ఒక్కమాట. గాలి యిప్పు డిటువీచుచున్నది. రవంత పైకిఁ బొమ్ము. క్రిందనిటువీచుచుండఁగనే యదియచ్చట మరియొకవైపున వీచుచుండును. మరిరవంతపైకిఁ బోయినయెడలనది వేఱొకవైపు వీచును. ఏవైపువీచుటకూడఁ గాసింతసేపే. అటులే మగవానిమనస్సునకుఁగూడ నన్నియరలు, నన్నియంతరువు, లన్నియవలోకనము లున్నవి. మగవానివలపునమ్మినయెడల నింకనడుగనా? కొఱవిదయ్యపువెల్తురును బట్టి పోయిన నెంతదుర్గతియో మగవానివలపునమ్మి యనుసరించిన యాఁడుదాని కంతదుర్గతి.

ర—అమ్మా! నమ్మక మన మేమిచేయవలసినది?

ప—ఇదిగో! బుద్ధిలేక, పరిశీలనలేక, దూరదృష్టిలేక కట్టుకొన్నవారి సంగతి చూచుచున్నాముకాదా? మగఁడు వీధిలోఁ దూనీఁగ, పెండ్లా మింటిలోఁ బేడపురుగు. మగఁడు పణ్యవీధిలో వసంతకోకిల, పెండ్లాముపంచపాళిలో బోదురుకప్ప. వానిమెడలోఁ బూలదండ. దీనినెత్తిపై నీళ్ళకుండ. వాఁడుకన్ను. ఇదిబున్ను.

ప్రపంచమునన్న నన్నికష్టములకుఁగూడ నసందర్భవివాహములే మూలము. మగజాతి నెన్నఁడు నమ్మఁదగదు.

ర—మగజాతియెట్టిదైన మనకేమమ్మా! మనమగలు బుద్ధిగలిగియున్న మనకుఁ జాలదా?

ప—మనమగలా? నాకు మగఁ డేఁడి? ఇఁక నీమగనిసంగతియా? ఆతఁడుమాత్రము లోకాతీతుఁడాయేమి? చెల్లెలా! ఏటిమాటలు! కోడిమాంసము కాకచేయునని చెప్పినప్పుడు నీయింటికోడిమాంసముమాత్రము మేహశాంతికాఁబోలు నేమి?

ర—అక్కా! స్పష్టముగాఁ జెప్పుచున్నాను. నామగఁ డిప్పటివఱకు నాయందే పంచప్రాణములను బెట్టుకొనియున్నాఁడు. ఇఁకముం దెట్లుండునో యని సందేహించు టెందులకు?

ప—ముందటిసందేహ మక్కఱలేదు. ఇప్పటివఱకు నీమగఁడు నీయందే లగ్నచిత్తుఁడైయున్నాఁడా?

ర—ఆఁ.

ప—హాహాహా! (నవ్వును)

ర—అక్కా! అట్లు నవ్వెద వేల?

ప—నీనమ్మకమునకు సంతోషించుచున్నాను.

ర—కాదు. నా తెలివితక్కువకుఁ బరిహసించుచున్నట్లు నాకుఁదోఁచుచున్నది. అభినందనపునవ్వేదో యధిక్షేపణపునవ్వేదో నేను దెలియలేనా? అక్కా! ఎందులకు నవ్వితివో చెప్పవా?

ప—నీపైఁ బ్రేమచేఁ జెప్పవలయుననియే యున్నది. నీనమ్మకముచూడ నాకు భయము వైచుచున్నది. నీవు రవంతసందేహావతివైయైన యెడల నీసరికిఁ జెప్పియుండనా?

ర—అక్కా! నాకుఁ గష్టముగ నున్నది. చెప్పవా?

ప—నీకష్టముకంటె సహస్రగుణము లధికమైనకష్టము నే నొంద చున్నానని నీ వెఱుఁగుదువా? అయ్యయ్యో! మిమ్మిక్కడకు రప్పించితినే. మీకుఁ బ్రధాన మొనర్చుటకు నిశ్చయించితినే మీతండ్రినిగూడ రమ్మంటినే. అయ్యయ్యో! పెద్దలచే నిశ్చితమైన పెండ్లి. పీటలమీఁదఁ బెండ్లియే నామహాప్రారబ్ధమువలనఁ గాక నే నెందుల కిందునఁ జిక్కుకొంటిని ? ఏమైననరే చెప్పకుండనుండుటయే మంచిదేమోయని యొకవంక నిశ్చయపఱచుకొందమన్న—

ర—అక్కా! నాబ్రదుకునకుఁ బ్రధానమైన రహస్యమును నీ వెఱిఁగి యుండియుఁ గప్పిపుచ్చి నన్నిట్లు వదలివేయుదువా? నాపై నీకు దయలేదా?

ప—దయలేదా యనుమాట యనుటకు నీకు నోరెట్లు వచ్చినదే. మాతండ్రి నిన్ను నాకంటె నెక్కువగాటముగఁ గౌఁగిలించుకొని లాలింపలేదా ? నీకంటె నేను రెండేండ్లు పెద్దదాననగుటచే నిన్ను నేనెత్తుకొని మోయలేదా ? అయ్యయ్యో ! ఒక్కచోఁ గుడిచితిమే- ఒక్కచోఁ బాడుకొంటిమే- ఒక్కచో నాడుకొంటిమే- ఒక్కచోఁ జదువుకొంటిమే- నీ కెనిమిదవయేట జ్వరమురాగ నీ ప్రక్కయొద్దఁ గన్నీరొత్తుకొనుచు నేను గూలఁబడి యుండలేదా? నీ వేడివేడిపెదవులను నేను ముద్దుఁగొనలేదా? నీ కాలు లొత్తలేదా ? చక్రవర్తిపుత్త్రిక కేవల ప్రేమచేతనేకదా నీకిట్టి దాసికనిచేసినది ! నీకుఁ గలిగిన జబ్బు నా కేల గలిగించితివికావోయి భగవంతుఁడాయని నేను ప్రార్థించిన ప్రార్థన నీ వెఱుఁగవు. కాని నేనెఱుఁగనా ? భగవంతుఁ డెఱుఁగఁడా ? ఇప్పుడు నీపై నాకు దయలేదా యని యడుగుచుంటివా ?

ర—అక్కా ! కడుపులోనిమంటచే బుద్ధిలేక యిటులంటిని. క్షమింపుము. సర్వవిధముల నాయెడల దయాస్వరూపురాలవై ప్రవర్తించితివి. కావున నిప్పుడుకూడ నాదయయే కనఁబఱచి—

ప—అయ్యయ్యో ! ఆదయయే నన్నిట్లు బాధించుచున్నది. ఆదయయే నా కిప్పుడు కంఠపాశమైనది. హరి హరీ ! రత్నప్రభా ! నీవు నాకింత ప్రేమాస్పదురాల వేలవైతివి ? నీవు నాకింత ప్రాణాధిక వేలవైతివే ! ఊరిలోని యంద అమ్మలక్కలవంటిదానవే నీవైనయెడల నీ సౌఖ్యముకొఱకు నేనింత దేవులాడియుందునా ? నీ బాధయే నాబాధయనుకొని యింతకొట్టుకొని పోకయుందును గదా! వెఱ్ఱిప్రేమ యెన్నఁడు తగదు తగదు. ప్రేమయేమో మెత్తనిదని యనుకొందుము. కాని బాధపెట్టుటలో శత్రుత్వముకంటెఁ బ్రేమయే యెక్కువ గట్టిదమ్మా !

ర—నాకుఁ గావలసినమాట చెప్పక మఱియేదో చెప్పుచున్నావు. నాకు దడయెత్తుచున్నది. గుండెలలో బరువెక్కుచున్నది. అమ్మా వేగచెప్పుము?

ప—చెప్పినందువలన నాకేమి పాపమో యని లోన నేనెంత చింతించుచున్నానో నీ వెఱుఁగుదువా ? నీచింతయే హెచ్చని నీ వనుకొనుచున్నావు.

ర—చెప్పినందువలన నీకుఁ బాపములేదు. సరేకదా నాబాధ తగ్గించుటచే నీకుఁ బుణ్యముకూడ సిద్ధించును.

ప—(తనలో) ఓభగవంతుఁడా ! రత్నప్రభ నూఱేండ్ల బ్రదుకిక్కడ భగ్నమగునో, యను భయముచేత నామెయందలి యవ్యాజమైన ప్రేమ ప్రేరణచేయుచుండ, సత్యవాక్యమందలి గౌరవముచేత, నప్రియమైన సత్య మామె చెవిని వైచుచున్నాను. తండ్రీ ! ఈపాపమునకు నాకు శిక్షలేకుండఁ గటాక్షింపుము.

శిక్షింపఁదలఁచితివేని- నీవు నాకిచ్చు నరకబాధనైన సహింతును గాని నాచెల్లెలిదుఃఖమును నేను జూడలేను. పరమేశ్వరా! నీ యిష్టానుసార మాచరింపుము. (ప్రకాశముగ) రత్నప్రభా! నీ కీభర్తతగఁడు. నీ వాతనిని వదలుకొనుము.

ర—(తనలో) భగవంతుఁడా! ఎంతకాలపుటనుబంధ మెంతలోఁ ద్రెంపనున్నావు. నీదయచేతనే మాకన్యోన్యానురాగము కలిగినదని సంతసించితిని. నీ దయచేతనే యది యిప్పుడు దగ్ధమై పోవలసినదా? కానీ! తలయొగ్గితిని. (ప్రకాశముగా) అమ్మా! నా కాతఁడు తగఁడని చెప్పితివి. నీవింతదనుక నాడిన మాటలను బట్టియే యీసంగతి యిదివఱకే గ్రహించితిని. ఆతనిదోషమేదో యది నాకుఁ గావలయును.

ప—అది నీకక్కఱలేదు. నాకు నక్కఱలేదు. ఇతరులకు నక్కఱలేదు. నీవు స్థిరచిత్తవు. నీతత్త్వమున కాతఁడు పనికిరాఁడు. సత్యమున కసత్యమునకు ముడివేయవచ్చునా? వైరాగ్యలలకు లాంపట్యమున కదుకునా? వేదాంతవిద్యకుఁ గొక్కోకమునకు లంకె వేయవచ్చునా?

ర—తగదు. నిజమే తగదు. ఆతఁ డసత్యవాదియుఁ జంచలుఁడు నెట్లయ్యెనో నాకుఁ దెలియవలదా?

ప—నీకేల తెలియవలయును?

ర—ఆతనిఁ జేసికొందునని మాతండ్రితోఁ జెప్పియుంటిని. ఇప్పు డాతనిని నిరాకరించుటకు మాతండ్రితో హేతువు చెప్పనక్కఱలేదా? మాతండ్రిమాట యటుంపుము. నామనస్సాతనిని గురువుగ, భర్తగ, దైవముగ, భావించుకొనుచున్నది. నామనస్సునైన సమాధానపఱచుటకు నాకుఁ దగినకారణ ముండవలదా?

ప—ని మనస్సాతనినుండి యింకఁ దిరిగి పోనేలేదా?

ర—తిరిగిపోయినది. కాని—

ప—ఇఁకఁ గాని యెందులకు? భ్రమరము పద్మలతను వదలిపోయినది. అది తంగేడుపూవుమీఁద వ్రాలిననేమి? ఉమ్మెత్తపూవుమీఁద వ్రాలిననేమి?

ర—ఆఁ. ఆఁ. నన్ను విడిచి పరస్త్రీ ననుసరించెనా? ఆ! ఎంతమాట! ఎంతమాట! కాని—ఆపరస్త్రీ యాతనిని నావలెఁ బ్రేమించినదేనా?

ప—ఓసి వెఱ్ఱిదానా! ఆసంగతి మన కెందులకే—అది యాతనిని ముద్దిడుకొనునో మూఁతిమీఁదఁ బొడుచునో! ఆగొడవతో మన కేమి సంబంధము.

ర—(ఉస్సురనుచు) నిజమే- మనకు సంబంధములేదు. మనస్సు చెదఱిపోవుటచేత నేదో యంటిని. కాని—కాని—యాపరస్త్రీ యాతని నమ్మునా? "పురిటిబిడ్డకడనుండి మేనమామకూఁతును జేసికొందునని చెప్పి మామగారి కాళులంటి బాసచేసి యిన్నిసంవత్సరము లింటిలోఁ గూరుచుండి మనుగుడుపుఁ బెండ్లికొడుకువలె నారగించి, బలసి తీఱఁ బ్రధానపువేళ మేనమామకూఁతును మోసగించి వదలిపెట్టి నన్నుఁ బ్రేమించితినని పలుకుచుఁ గులుకుచు నాయొద్దకు వచ్చితివా మూర్ఖా! విశ్వాసద్రోహీ" యని యాపరస్త్రీ యాతనిమూఁతిమీఁద రోఁకలిపుచ్చుకొని పొడువవలసిన దండువా కాదా?

ప—చెల్లెలా! ఆగొడవతో మనకు సంబంధములేదని నేను జెప్పఁగ నౌనని నీ వంటివి కాదా! తిరుగ నామాటయే పట్టుకొని ప్రసంగింతువేల?

ర—అన్నమాట నిజమే- ఇఁక నాసంగతి తలపెట్టను. కాని యొక్క—

సంగతి మాత్రముచెప్పుము. అది యెవతెయో మాత్రము చెప్పుము. నీ కాళులుపట్టుకొందును.

ప—చెప్పెదను. కాని నీవు రహస్యముగ నుందువా ?

ర—ప్రమాణము చేయుమన్నఁ జేసెదను.

ప—నీమాటయే నాకుఁ బ్రమాణము. నీయోగ్యతకు హద్దులేదని నేనెఱుఁగనా ?

ర—రహస్యముగ నుందును.

ప—నీతండ్రితో నైనఁ జెప్పఁదగదు సుమా ?

ర—చెప్పను. చెప్పను.

ప—నారాయణవర్మ యిటనే యున్నాఁడు. నీ వాతని యెదుటఁబడి తుచ్ఛుఁడా! మోసకాఁడా! యని తిట్టవుకదా !

ర—ఆతని మొగమింకఁ జూచుటకూడనా ?

ప—అట్లైన విను- ఆపరస్త్రీ యెవతెయో చెప్పనా ?

ర—చెప్పుము.

ప—నీబలాత్కారమున దైవముఖమును జూచి చెప్పుచున్నానుజుమీ!

ర—చెప్పుము.

ప—ఆపరస్త్రీ నేనే—

ర—ఆఁ. ఆఁ. నిజముగనే- నిజముగనే- అక్కా ! ఇట్టి సమయమునఁ బరిహాసమాడుట తగునా ?

ప—నేనేహో నారాజ్యకష్టములఁ గూర్చి ముచ్చటించుచుండఁగా నాతఁడు నన్ను వలచెననియుఁ బెండ్లిచేసికొని రాజకీయవ్యవహారమున సహాయుఁడుగా నిటనేయుందుననియుఁ గంఠోక్తిగాఁ బలికినాఁడు.

ర—ఆహా ! ఎంత యొడలు తెలియనితనము— ఎంత నిర్భయము— చక్రవర్తినివే! మహాధికారిణివే! తానెక్కడ? తన బ్రదుకె

క్కడ ? తనస్థితి యెక్కడ ? తన కిదియేమి పోగాలము ? బ్రదికి బాగుపడఁదలఁచుకొనలేదు కాఁబోలు ?

ప—ఆతని నిర్భయత్వమును నేనంత గణింపలేదు. నిజముగా గాటమైనవలపునకున్న నిర్భయత్వము. దేనికిని లేదు. బందిపోటు దొంగకు భయమున్నది. అసత్యవాదికి భయమున్నది. ఆహవశూరునకు భయమున్నది. పిశాచావిష్టునకు భయమున్నది. కాని, యనురాగవశునకు భయములేదు. చక్రవర్తిని నిట్లడిగినాఁడేయని యంటివి- చక్రవర్తిని నైనందుల కితరులకంటె నెక్కువ ధనమున్నది. ఎక్కువ భూమియున్నది. ఎక్కువ యధికారమున్నది. ఎక్కువ బాధయున్నది. ఎక్కువ యేడుపున్నది. కాని మగనియొద్దఁ బండుకొనునవసరమునఁ జక్రవర్తిని యెంతయో చచ్చుముష్టిదికూడ నంతయే కాదా? అతఁడాదృష్టినే చూచినాఁడు. ధనమున్నప్పుడులాభమనినష్టమని దేవులాట. సిగ్గున్నప్పుడు పైవారని తనవారని భేదగ్రహణము- భయమున్నప్పుడు హెచ్చువారని క్రిందివారని వ్యత్యాసజ్ఞానము. అంతేకాదా? నేనందులకంతగణింపలేదు. కాని యాతనికి సర్వసామాన్యమైనకన్నె లేకపోయెనేయని నేను వింతపడితిని. ఒకవస్తువును వదలి వేఱొకవస్తువును స్వీకరించునప్పుడు రెండవది మొదటిదానికంటె గుణోత్తరమై యుండవలయును గాదా? చీమపంచదారపలుకునువదలిగోదుమగింజను జేరునా? పాలకుండనువదలి గంజిమూఁకుటి నపేక్షించు పిల్లికిఁ గన్నున్నదనవచ్చునా ? గులాబిపూవువాసనచేఁజొక్కిన తుమ్మెద యెఱ్ఱగన్నేరు జేరుటకిచ్చగింపవలసినదా? అయ్యయ్యో ! కోకిలయేదో చెముడుకాకియేదో పశువులపిల్లవానికైనఁ దెలియునే-సీతాఫలపుష్ప మేదో- సకలఫలచంపక మేదో—

ర—అక్కా! యెందులకీమాటలు.

ప—మాటవచ్చినది కావునఁ జెప్పవలసివచ్చినది. నిజము నేను దాఁచిన యెడల లోకము దాఁచునా? నీసౌందర్యమునకు నాస్తుతి కావలసివచ్చిన దనుకొంటివా? నేనొకతెను స్తుతించుదాననే యనుకొంటివా? నాలోప మేదో నేను గుండపగులఁగొట్టినట్లు చెప్పుదానను. ఎదుటిగుణ మేదో సరిగా గ్రహించి యున్నదున్నట్లు చెప్పుదానను. ఎల్లపుడు సత్యమే పలుకుదును. సత్యమునే ధ్యానింతును. సత్యమునే యారాధింతును. సత్యమే నాదైవము. ప్రపంచమంతయు సత్యమందే నిల్చియున్నదని నాదృఢవిశ్వాసము. అందుచేఁ జెప్పుచున్నాను. నీవు నాకంటె ననేకగుణములు సౌందర్యవతివి. కొందఱకుఁ గన్ను సోగగా విశాలముగా బాగుగనే యుండును. ముక్కు ప్రత్యేకముగాఁ బరీక్షించునెడల సూటిగాఁ దగుమాత్రమైన యెత్తుగాఁ జివర రవంత మొనగల వంపుకలిగి బాగుగనే యుండును. గడ్డముమట్టునకుఁ బ్రత్యేకముగాఁ జూచినయెడల నదియు మలచినట్లు రవంత గుంటకలిగి బాగుగనే యుండును. కాని యివియన్నియుఁ గలపి చూచినయెడల నదియేమికర్మమో కాని తీర్థమునకుఁ దీర్థము ప్రసాదమునకుఁ బ్రసాదముగాఁ గొందఱకుండును. కళకట్టనిదే. ఏచెవి కాచెవి బాగుగానున్నను రెండును సమానముగ వ్రాలక, యొకటి వ్రాలి యొకటి యెత్తిపెట్టుకొని యున్నయెడలఁ గుక్కమొగము చక్కగ నుండునా? కంటిసోగతో ముక్కుసూటితనము కలసి గడ్డపుగుండ్రతనముతో మేళవించి గప్పుమని యనిర్వర్ణ్యమైన కాంతిపుట్టినప్పుడుకదా సౌందర్యము. తాంబూలరక్తి యెట్టిదో, స్వరసంఘాత మాధుర్య మెట్టిదో, మనస్సుల కలయికవలన మైత్రి యెట్టిదో సౌందర్య మట్టిది. అట్టిది

నీలో నున్నది. నీకున్న యవయవములు నాకు మాత్రము లేవా? కాని యిక్కడఁ గూడిక యే లేదు. ఉన్నరవంత కూడికలోఁ గావలసినంత యపస్వరము వెలితియు నున్నవి. ఇది కాక—

ర—అక్కా! నన్ను క్షమింపుము. నీవే నాకంటె సర్వవిధముల సౌందర్యవతివి. కాని నన్నుఁ బ్రస్తుతాంశమునుండి యెంతదూరమో తీసికొనిపోయితివి. నాదృష్టిమాత్ర మచ్చటనే యున్నది. సరే కాని యాతఁడు నిన్ను వివాహము చేసికొందు నన్నప్పుడు నీ వేమంటివో రవంత చెప్పవా?

ప—ఓసి వెఱ్ఱిదానా! ఈమాత్రపుమగఁడు దొరకినాఁడని యుప్పొంగిపోయి యొప్పుకొంటి ననుకొనుచున్నావా?

ర—అమ్మా! నేనంత తుచ్ఛురాలనా? మొగము వాఁచునట్లు తిట్టనే తిట్టితివో తలపగులునట్లు కఱ్ఱతీసికొని వేసితివో తెలియఁగోరి యడిగితిని.

ప—ఏమి చేసితినో నేను జెప్పుట యెందులకు? రేపటెల్లుండి నీకుఁ దెలియకపోవునా?

ర—అమ్మా! రేపటిదాఁక నే నిక్కడ నుండుటెందులకు? ప్రధానమేదో భగ్నమైనదికదా! మగఁడు ముద్దులైనాఁడుకదా! బ్రదుకు పరశురామ ప్రీతియైనదికదా! ఇఁక నే నిక్కడ నెందులకు?

ప—ఎందులకో చెప్పెదను వినుము. నన్నాడినమాటలకుఁ గాదుసుమా నిన్నాతఁడు పరిత్యజించినందుల కాతనిని గారాగృహమునం దుంచినాను. కోటలోఁ దిరుగవచ్చునే కాని దాటిపోఁగూడదు. కాని యాతఁ డట్లు బద్ధుఁడైనట్లెఱుఁగఁడు.

ర—అమ్మా! దేవతలు మెచ్చఁదగినపని చేసితివి! నామనస్సు కొంత సంతుష్టి నందినది.

ప—అతనికిఁ గఠినముగఁజెప్పి బుద్ధితెప్పించి యాతనిచేఁ దిరుగ నీకాళులు పట్టించెదనో లేదో చూడుము. అందుకొఱకు నీవిక్కడ నుండవలయును.

ర—నామనస్సు విరిగిపోయినది. ఇంక నాతనితో సనుబంధమా? మేము మేనత్త మేనమామబిడ్డలమై యేపాపముననో పుట్టినందుల కాతఁడు చచ్చినయెడల నాకుఁ బక్షిణి-నేనుజచ్చినయెడల నతనికిఁ బక్షిణి- ఇంతకంటె మాకిఁక నేదియులేదు.

ప—సరి. ఈమాటలకేమి? నీవుండకతప్పదు.

ర—అక్కా! క్షమింపుము. నేనుండను. మాతండ్రితోఁబోదును.

ప—మీతండ్రి కిదివఱకే సెలవిచ్చి పంపినాను. అదిగాక నీవు వెంటనే వెడలినయెడల మీతండ్రికి సందేహము కలుగదా? పాడైనదేదో చక్కఁబఱచుకొనవలయును గాని, తొందరపడుట తగునా? అదిగాక చెల్లెలా? నేను నిన్నుఁ బంపించువఱకు నీవిక్కడ నుందునని బాసచేసితివి కాదా? నీ విప్పుడు మాటతప్పుదువా?

ర—బాసచేసితిని- అందుచే నటులే- యుండెదను- కాని నన్ను శీఘ్రముగఁ బంపవలయునని మాత్రము ప్రార్థింతును.

ప—సరే! నీవు పూజాశాలయొద్దకుఁబోయి యక్కడనున్న జ్యోతిషికునిఁ జూడుము. ఆతఁడు దివ్యజ్ఞాని- ఆతఁ డేదైన మంచిమాటలు చెప్పును. రవంతసేపు వినుము.

ర—నే నాతనిఁజూడ నంగీకరింతునా?

ప—అవ్వే! ఆతఁడు సన్యాసి. నే నాతనితో మాటలాడలేదా? నీవు పిల్లవు. నీకు సందేహమెందులకమ్మా? చూడు నీవు త్వరగఁ బొమ్ము- ఆతఁడు నీహృదయమును గనిపట్టును గావున నాతనితోఁ బ్రత్యేకముగ నీసంగతులేవియుఁ జెప్పనక్కఱలేదు.

ర—అటులే-

(రత్నప్రభ నిష్క్రమించును.)

ప—ఈమె కాతనికిఁ బూర్తిగాఁ జెడినది. ఆతనికిఁగూడ నీమెతోఁ బూర్తిగా జెడునట్లు చూడవలయును. అందుకొఱకే యీమె నిట నుండుమని చెప్పవలసివచ్చినది- మాలినీ!

[మాలిని ప్రవేశించును.]

నీవు వెంటనేపోయి శారదానిలయములోనున్న రత్నప్రభతండ్రి నెవ్వరు చూడకుండ నీతోటలోనుండి పాణిద్వారమున నిటకుఁ దీసికొనిరమ్ము- అయ్యో! అట్లు మొద్దులాగున నిలువఁబడెదవేమి?

(మాలిని నిష్క్రమించును.)

మాలినీ! ఇటురా! (మాలిని ప్రవేశము) నీవిటు వచ్చుచుండగా రత్నప్రభను జూచితివా?

మా—చూచితిని.

ప—తనతండ్రి తన గ్రామమునకు వెళ్ళినాఁడాయెన నిన్నామె యడుగలేదుకద!

మా—లేదు.

ప—ఈవేళ నెప్పుడైన నిన్నామె యడిగినయెడల నుదయమందే రాణిగారు సెలవిచ్చి పంపినారని చెప్పవలయునుజుమా?

మా—ఆమె నన్నేల యడుగునమ్మా?

ప—ఆమెదాసి జబ్బుచేఁ గదలలేకుండ నున్నది. కావున నిన్నడుగునేమో లే- సరే నీ విఁకఁ బొమ్ము. చూడు మాలినీ! యోగియొద్దకుఁ దన భవిష్యద్వృత్తాంతమును దెలిసికొనుటకు రత్నప్రభ వెళ్ళెదనని చెప్పినదిలే. ఆమె నక్కడకుఁ దప్పకుండఁ

బొమ్మని చెప్పుము- ఆమె యేమియడుగునో - నీవా మెతో మాత్రి ముండవలదు. (మాలిని నిష్క్రమించును.)

అట్టివెల్తురు, అట్టిచీకటి, ఇట్టినవ్వు, అట్టియేడుపు, ఇట్టియాకాశగమనము, అట్టియధఃపతనము, ఇట్టికౌఁగిలింత, అట్టిగొంతుకోఁత, ఇట్టియమృతము, అట్టివిసము, రాగమున కివి లక్షణములు. సముద్రపుఁబోటుకంటె రాగ మెక్కువదూకుడుగలది. పాటులో సముద్రము రవంత మెల్లగజంతునేమోకాని, రాగపుఁదీతయొక్కక్షణమే. రాగ మెంతగాఢమో యంతవేగముగ నశించును. చెడఁగొట్టువారిలో నున్నది. కాని దానిలోఁ బటుత్వము లేదు. వీరికిఁ బూర్తిగాఁ జెడినపిమ్మట నాకేమైన లాభించునేమో? చూడవలెను. లాభింపదా? పోనీ వారికి లేదు. నాకు లేదు. కాని వారికి లేకపోవుటయే నా కున్నదానిగా భావించి నేను గొంత సంతోషింతును. ఎవరిదో దగ్గు వినఁబడుచున్నది. మాలినీ! గోపాలవర్మగారు దయచేసినారా?

[నేపథ్యమున] వచ్చినారమ్మా! [మాలిని ప్ర.]

ప—తనపుత్త్రికవంటిదాననైన నన్నుఁ జూచుట కాతనికి సందేహమెందులకు? నీవు నాప్రాణమిత్త్రమైన రత్నప్రభను గంటితెప్పవలెఁ గనిపట్టి యుండుము. (అపవారించి) రత్నప్రభయొద్దకుఁ గాని యోగియొద్దకుఁ గాని నీవు పోయినయెడల నీగొంతు కోసెదను. పో. వర్మ నిక్కడికి రమ్మని చెప్పుము.

(మాలిని నిష్క్రమించును.)

[గోపాలవర్మ ప్రవేశించును.]

ప—రావయ్యా! ఈయుదయముననే నీగ్రామమునకుఁ బోవుటకు నాసెలవుకొఱకు వార్తనంపితివి కాదా? నీవు వెళ్ళితివని యనుకొంటిని జుమా!

గో—నే నట్టివార్త పంపనే లేదమ్మా!

ప—అలాగా! నీవు సెలవుకోరిన ట్లెవ్వరో చెప్పినారయ్యా! పోనీ! నీవుంటివి. ఆనందముగ నున్నది. చూడు వర్మా! నారాయణవర్మను జేసికొనుటకు నీపుత్త్రిక కిష్టమున్నదని నీతో నామె చెప్పినదా?

గో—చెప్పినదమ్మా.

ప—బాగుగా జ్ఞప్తికిఁ దెచ్చుకొని మఱిచెప్పుము.

గో—అమ్మా! ఎంతపెద్దవాఁడనైన నీసంగతియే మఱచిపోదునా. నాతో నెన్నిమారులో చెప్పినది.

ప—నీపిల్లను మేనల్లున కిచ్చుటయందు నీవు దృఢసంకల్పుఁడవై యుండుటచేత నీమనస్సునకుఁ గష్టముగా నుండునని యట్లుచెప్పియుండునా? రవంత యాలోచించి మరిచెప్పుము.

గో—తల్లి యీనడుమను బరలోకగతురాలైనది. కాని యామె యున్నప్పు డామెతోఁగూడ నెన్నిమారులో చెప్పినది.

ప—వయసురానప్పుడు వచ్చియు రానప్పు డామెచెప్పిన మాటలకు లెక్కయేమి?

గో—ఇప్పుడు తనకిష్టము కాదని చెప్పినదా అమ్మా?

ప—కంఠోక్తిగాఁ జెప్పినది. చూడువర్మా! నాకు రత్నప్రభ బహిఃప్రాణమని నీవెఱుఁగుదువా?

గో—ఎఱుఁగ కేమమ్మా.

ప—నీతోడను నీభార్యతోడను జెప్పని యీరహస్యమును నాతోఁ జెప్పుటచే నాయందామె కెంతవిశ్వాసమున్నదో స్పష్టమైనదా? నేనామె హృదయమును మార్చెదను. ఆమె నిక్కడఁ గొన్నిదినము లుంచుకొని ప్రధానము జరిగించి మరిపంపెదను.

నీవు సందేహింపవలదు. ఆమెను నీతో నిప్పుడు పంపఁదలఁచుకొనలేదు.

గో—అక్కఱలేదమ్మా! మీ కిష్టమైనంతకాల ముంచుకొనవచ్చును. మీ రెటులైన నీశుభకార్యమును జేయించి నన్నుఁ గృతార్థుని జేసి మాపెద్దలను దరింపఁజేయవలయును. నాకొక్కతెయే బిడ్డ. దీనిని దల్లిదండ్రులులేని మేనల్లుని నొకవిధముగాఁ బెంచుకొంటిని. ఇద్దఱును నాకు రెండుకనులు. (కనులొత్తుకొనును)

ప—అబ్బ! నాకే గుండె చెదరిపోవుచున్నది. నీవిబ్బందిపడుట యింతయా? ఊరకుండుము. ఆబాధ్యత నంతను నాపై విడిచిపెట్టి పొమ్ము.

గో—చిత్తము. (నిష్క్రమింపఁబోవును.)

ప—వర్మా! నీవెట్లు వచ్చితివో యటులే నీబసకుఁబోయి మీ గ్రామమునకు వెంటనే పొమ్ము. చూడు నీకూఁతునుజూచి యామెతోఁ జెప్పి మరి పోయెదవా యేమి?

గో—చూచియే పోయెదనమ్మా.

(నిష్క్రమింపఁబోవును.)

ప—వర్మా—ఇప్పుడు—తిరిగిచూచి—ఆమెతోఁ జెప్పవలసిన విశేషాంశము లేమైన—నున్నవా?

గో—ఏమియు లేవమ్మా.

ప—నే నెందుల కింతతొట్రుపాటు పడుచుంటినో చెప్పెదను విను. నేను జెప్పినమాటలవలన నీమనస్సు చెడినది. చెడినమనస్సు నీముఖముమీఁద స్పష్టముగా గనఁబడుచున్నది. నేను దిరుగఁ జెప్పిన ధైర్యపుమాటలవలన రవంత వెలవెల తగ్గినదేమో కాని చిత్తాందోళనము స్పష్టముగాఁ గన్నులలో బుగ్గలలోఁ జిత్రింపఁబడియున్నది. ఇఁక నీపుత్త్రికస్థితిని విను. ఇంతకాలము

తల్లిదండ్రులతో నసత్యముచెప్పి మోసగించితినిగదా యని చింతచే సిగ్గుచేఁ జివికి చివికి పోవుచున్నది. ఇట్టి మనస్థితులలో మీరు సమావేశమగుట తగదని నాకుఁ దోఁచుచున్నది. ఆమెను జూచి నీకు రవంతరోసము వచ్చునో, నిన్నుఁ జూచి యామె యేమగునో? నా కానన్నివేశము స్మరించుకొనగ గుండె దడదడలాడుచున్నది. అదిగాక తన రహస్యము నీతో వెంటనే చెప్పితినని యామెకు దోఁచినయెడల నాయం దామెకున్న మొగ్గర మింక నుండునా? అది తగ్గినయెడల నేను మీకార్యముచేయఁగలనా? నా కీసందేహములు కలుగుటచేత నే నింతయలజడినొందుచున్నాను. నా తెలివితక్కువ యూహయేదో నేను జెప్పితిని. నీవు పెద్దవాఁడవు. నీ చెప్పుచేఁతలలో నుండవలసినదానను గానా? నీ కేది బాగుగా నుండునో యది చేయుము.

గో—అమ్మా! మీరు చెప్పినమాటలు నాకు బాగుగా నచ్చినవి. నేను నాపిల్లను జూడకుండ వెంటనే పోవుదును.

ప—నీవు నావలన విన్నమాటలు విననట్టే యుండవలయును జుమీ!

గో—అమ్మా! ఎంతమాట! నాకు సెలవు.

ప—నేను నీకు రమ్మని వార్తనంపుదును. అప్పుడు రావలయును. నీ పిల్లకేమియు లోపము లేకుండ నేను సంరక్షింతును. నీయొద్ద నున్నట్టే యుండును.

గో—అంతకంటె సర్వవిధముల నెక్కువగా నుండునమ్మా.

ప—సరే—పొమ్మా.

(గోపాలవర్మ నిష్క్రమించును.)

ముసలిపందను మోసగించుటయైనది కద! ఇఁక నారాయణవర్మను జూడవలసియున్నది.

(నిష్క్రమించును.)

ఇది తృతీయాంకము.

పద్మిని

చతుర్థాంకము

ప్రదేశము—కోటలో నారాయణవర్మగది వెలుపల.

[ప్రవేశము—నారాయణవర్మ—పద్మిని.]

నా—ఎందుల కీయాలస్యము ? త్వరగఁ జెప్ప వేఁడుకొనుచున్నాను.

ప—ఏమున్నది? మగవానికి బుద్ధిలేదు. ఇంగితజ్ఞానము లేదు. అందులో స్త్రీహృదయమును గ్రహించుటకు శక్తియే సున్న. తా నెవతె నైన వలచినయెడల నది తన్నుఁగూడ వలచెనని నమ్మియుండును. అది రవంత నవ్వినయెడలఁ దనసరసతకై మెచ్చెనని యనుకొనును. అది వాలుఁగంట రవంతచూచినయెడలఁ దన సౌందర్య మనుభవించుటకని నమ్మును. అది కాసంత సాలోచనముగ నున్నయెడలఁ దన్నుఁజిత్తమున ధ్యానించుచున్నదని భ్రమించును. అదియొక నిశ్వాసమును విడువగఁ దనకై లోవలఁగుమిలిపోవుచున్నదని తన్ను బహుమానించుకొనును. చిత్రవిచిత్రలీలావిలాసములు సహజముగ సరసిజాక్షులనుండి వెలువగును. అవి యన్నియు నీకొఱకేయని నీవు భ్రమింపవచ్చునా ? గులాబిపూవు నీకొఱకే వికసించి పరిమళించుచున్నదా ? ఇంద్రధనుస్సు నీమొగమునకు మంగళపుటారతియిచ్చుటకే యనుకొనుచున్నావా ? కోకిల నీకొఱకే పాడుచున్నదా ? చంద్రకళనుండి వెడలువెన్నెలకు నాఁడుదాని మందహాసమునకుఁ బరమార్థమున భేద మేమున్నది? బ్రహ్మజాతి

వజ్రపు జిలజిలకుఁ బడతికంటి మిలమిలకుఁ బ్రకృతితత్త్వమున భేదమేమున్నది ? సృష్టియంతయుఁ దనకొఱకా ? ఆఁడుది ప్రత్యేకము తనప్రక్కలోనికా ? మగవానియంత స్వార్థలోలుఁడు, నహంభావదూషితుఁడు మఱియొకఁ డున్నాఁడా ?

నా—చక్రవర్తినీ ! ఇంతదూర మెందులకు ? ఆమె నన్నంగీకరింప లేదా యేమి ?

ప—ఉండు. ఉండు. చెప్పుచుండగా నడుమనడుమను దొందరపడి యడ్డువచ్చెద వెందులకు ? నీ స్వరూపస్వభావములు గని నేను మెచ్చినదాననే యగుదును గాక. నీ యందుఁ బరిపూర్ణప్రేమమున్నదాననే యగుదును గాక. నేను నిన్ను మహోన్నతస్థితిలోనికిఁ దెచ్చుటకు సంకల్పించుకొనినదాననే యగుదును గాక. చక్రవర్తిని మాటలాడుచుండగ నీవు నిర్భయముగ నుపన్యసించుటతగునా ?

నా—రాజ్ఞీమణీ! క్షమింపుము. మనసులోని యాందోళనముచే నట్లొనర్చితిని. క్షమింపుము. ఆమె నన్ను వలచియుండనే లేదా ?

ప—అమె నిన్ను వలచినదని త్రికరణశుద్ధిగా వలచినదని నీవు నాతోఁ జెప్పుటచేత నామె నా యిబ్బందిపెట్టితిని. నీమాటలనునమ్మి యామె నేలయడిగితినాయని నేనా యిబ్బందిపడవలసి వచ్చినది. నిన్నుఁ బ్రేమించిన దేవతెయో ప్రేమింపని దేవతెయో యీమాత్రమైనఁ దెలిసికొనలేకపోయితి వేల ? ఎదుటఁబడినప్పుడెల్ల గన్నార్ప రచేసికొనిచూచుచు మాటలాడుటకుఁ బ్రయత్నించినప్పుడెల్ల ముసిముసినవ్వులతోఁ బ్రక్కకొత్తిగిల్లుచు కణుగుమెణుగులేక మెత్తమెత్తగనున్న యాఁడుది నిన్ను వలచినట్లా ? ఎదుటబడి హుంకరించి మాటలాడి నిర్లక్ష్యముగఁ బ్రవర్తించుచున్న యాఁడుది నిన్నుఁ బ్రే

మింపనట్లా? ప్రేమతత్త్వనిర్ణయమున కింతకంటె మంచి సాధనము నీకుఁ దెలియదు కాఁబోలు నేమి?

నా—(తనలో) ఈమె నన్ను వలచుచున్నదేమో యని మొదట రవంత సందేహించి యాసందేహము తప్పని వదలుకొంటిని. ఈమె మాటలు తిరుగ నాసందేహమును గలిగించుటయే కాక బలపఱుచుచున్నట్లున్నవి. నన్నుఁ జేపట్టవలయు నను వాంఛచే నీమెయే నాప్రియురాలిమనస్సు చెడఁగొట్టినదేమో? అయ్యయ్యో! ఆప్రేమ చెడఁగొట్టినను బోవునది కాదే! ఏమో? దురదృష్టదినములలోఁ బోఁగూడనిదొకటియుండునా? మహామారి యింటఁ బ్రవేశించి నాశనము చేయునప్పు డొక్కప్రాణియైన మిగులవచ్చును. భూకంపముచే గ్రామము దిగుచుకొనిపోవునప్పు డొక్కపుట్టయైన మిగులవచ్చును. ప్రబలమైన దురదృష్టము వచ్చినప్పుడు పోకుండ మిగులున దేదియు లేదు. పంచభూతములకంటెఁ బ్రకృతిశక్తులకంటె భాగ్యహీనతయే బలవత్తరమైనది అట్టిచో రత్నప్రభ వలపుపోయిన దనగ నాశ్చర్యమేమి?

ప—నారాయణవర్మా! ఏమి యోజించుచున్నావు?

నా—రత్నప్రభకు నాపైనున్న యనురాగము పోవుటకుఁ దగినంత కారణ మీదినమునఁ గ్రొత్తగా నాకస్మికముగా నేమి కలిగినదో యని యోజించుచున్నాను.

ప—పోవుటా? పోయినదని యెవరు చెప్పినారు? ఉన్నప్పుడు కదా పోవుట?

నా—అయ్యయ్యో! లేనేలేదా?

ప—లేదని చెప్పవలసివచ్చినందులకు విచారించుచున్నాను. నేను మొదట నీతోఁ జెప్పలేదా? నీస్థితిగతులఁ బట్టి నీయందామెకు

సహజముగ నుండునది జాలి కాని వలపు కాదని చెప్పలేదా? నా మాట నీవు విశ్వసించితివా? అందుదాన నయ్యాను నీకంటె నేనే యెక్కువ ప్రకృతిజ్ఞానము కలదాన నని స్పష్టపడినదా?

నా—(తనలో) లేనేలేదేమో? ఉన్నయెడల నొక్కపూటలో నేపోవునా? రాజ్యము పోయినను దల్లిదండ్రులు పోయినను బరతంత్రుఁడనై పరాన్నభోజినైనను రత్నప్రభా! నీ వెప్పటికైన నాదాన వగుదు వను నాశతోఁ గష్టములన్నిఁటిని సహించి యుంటిని. ప్రాణప్రియా! ఒక్క నీయాధారముననే బ్రదికియుంటినని నీ వెఱుఁగవా? తరంగములు లంబికియుబికి యెగిరియెగిరి మింటిపై నురుగుమియుచుండ, గాలి భయంకరారావముతో సముద్రము నాచెంత నీచెంత వాయించుచుండ మొండితనమున బ్రదుకఁదలఁచి బారెడు బాడిదెకఱ్ఱ నాశ్రయించి సముద్రమును దాఁటుచుంటిని. ఆకఱ్ఱకూడ జారిపోవలసినదా? ఊరు చేర్చును సుఖమిచ్చునని నమ్మికొన్న యెదుటిదీవము కొఱవిదయ్యమే యయ్యెనా?

ప—నారాయణవర్మా! దీర్ఘాలోచన చేయుచున్నావే.

నా—నాపై నామెకనురాగము లేనేలేదా?

ప—అదేపనిగ నడిగెద వెందులకు? లేదని నాచే నన్నిమారు లనిపింతువయ్యా! ఒక్క లేదుకంటె మూఁడు లేదుల కెక్కువ బలమున్నదా? అట్లైన లేదు, లేదు. లేదు. లేకపోయినంతమాత్రమున నేమి పుట్టి మునిఁగిపోయెను? నీకుఁ బెండ్లి కాదేమో యని విచారింతువా? ఏదో యూరుపేరు లేని రూపము గుణము లేని కొంకినక్క వచ్చునేమో యని సంకోచింతువా? ఇది యెందులకు వదలిపోయినదో? దాని నెత్తిమీఁద నెగిరిపోవునదే నీకు వచ్చునేమో? నీ వెంత భాగ్యవంతుఁడవు కావలసియున్నదో? నీ వెంత

రాష్ట్రాధిపతిని కాఁదగి యున్నావో? వెనుకటియాశలనిఁకఁ దలపెట్టకుము.

నా—(తనలో) ఈమెయే నాకొంపతీసినది! రత్నప్రభతో నేమిమాటలుచెప్పి యామెమనస్సు చెడఁగొట్టినదో. ఆమె నాకొక్కసారియైనఁ గానఁబడలేదు; సరేకదా దాసిచే వార్తనైనఁ బంపలేదు. ఆమెను దండ్రిని వెనుకకు బంపివైచినదేమో? (ప్రకాశముగా) చక్రవర్తినీ! రత్నప్రభ యిప్పు డెచ్చటనున్నది?

ప—ఇక్కడనే యున్నది. ఇంటికిఁ బోయెదనని తొందరపడినను బంపలేదు. మేనత్తకొడుకును జేసికొందునని యింతకాలము బాసచేసి యిప్పుడిట్లొనర్చుట యిహమునకుఁ బరమునకుఁ గూడ లోపమని బోధించుచున్నాను. ఇఁక రెండుమూఁడుదినములు నయమున భయమున బోధింపఁదలచినాను.

నా—(తనలో) ఆహా! తిరుగ నీమె యిట్లనుచున్న దేల? ఈమె చెడగొట్టలేదు కాఁబోలు!

ప—నారాయణవర్మా! నీవు విచారింపకుము. మిమ్ముల నిద్దఱను నేను గలుప నమకట్టితిని. నాప్రయత్నము సాగకపోవునా? ఎటువచ్చినను నామెమనస్సన్యాక్రాంతమయ్యెనేమో యని సందేహముగానున్నది.

నా—(తనలో) ఆఁ. ఆఁ. అన్యాక్రాంతముకూడనయ్యెనా? ఆయన్యుఁడెవఁడో? నన్నుగాదని నాస్థానమున నిలుపఁబడిన యన్యుఁడెవఁడు? ఇంతయప్పటినుండియు గలసియుంటిమే. వివాహ మనగనేమో రవంత తెలిసినప్పటినుండియు నన్నుఁదక్క నామె యితరులను జూడనేలేదే. నామాటలుతక్క నితరులమాటలు వినలేదే. నాతోఁదక్క నితరులతో మాటలాడనేలేదే. ఇప్పుడామె కొలి కాకసమునుండి యూడిపడిన యన్యుఁ డెవ్వఁడు?

[వెనుకప్రక్కఁ గొంతదూరమున రత్నప్రభ ప్రవేశించును.]

రత్న—అయ్యా! అయ్యా! (వెనుకనున్న గదితలుపు తట్టుచున్నది.)

[మురళీమనోహరుఁడు తలుపుతీసికొని ప్రవేశించును.]

రత్న—స్వామీ! నమస్కారము.

ము—కల్యాణమస్తు. అమ్మా! మీరెవ్వరు?

రత్న—నేను గోపాలవర్మ పుత్త్రికను. మీరు మహానుభావు లని త్రికాలవేదులరని మిమ్ముఁ జక్రవర్తిని యాజ్ఞపై జూడవచ్చితిని.

ము—అమ్మా! దాసియైన లేకుండ నొక్కతెవే వచ్చితివేల?

ర—నా దాసికి జబ్బుగానున్నది.

ము—అమ్మా! ఇటఁ గూరుచుండుము. సంధ్యాసమయము కావున రవంతసేపు ధ్యానించుకొందును.

ర—అటులే.

ప—ఏమి నారాయణవర్మా! మాటలాడకుండ నున్నావు?

నా—ఆమె మనస్సన్యాక్రాంతమైనదని చెప్పితిరి కాదా? ఆయన్యుఁ డెవ్వఁడో మీతో నామెచెప్పెనా?

ప—అయినదని చెప్పితినా? నాకట్టిసందేహ మున్నదనియే కాదా చెప్పితిని. నేను జెప్పనిమాటలుకూడ నేలచెప్పెదవు? నీకల్పనాశక్తింతను నాసత్యవాక్యములపైఁ బ్రయోగింతువా? నన్నుఁ దుదకు మిథ్యావాదినిని జేయుటకా?

నా—క్షమింపుము.

ము—(తనలో) అయ్యయ్యో! ఈమె నిచ్చటి కాచక్రవర్తిని యేల పంపెనో తెలియదు. మాలిని నాయొద్దకువచ్చి తిరుగ నేమియుఁ జెప్పియుండలేదు. ఇప్పుడీమె యేమడుగునో (ప్రకాశముగా) నీవు గోపాలవర్మ పుత్త్రికవా? సంతోషమే. నీప్రథా

నముకే ముహూర్తము పెట్టుమని చక్రవర్తిని నాకాజ్ఞాపించి
నదిసుమా!

ర—నేనిప్పు డాముహూర్తమునుగూర్చి రాలేదయ్యా! ఆప్రయత్న
మంతయు భగ్నమైనదని యిప్పుడే తెలిసినది.

ము—చక్రవర్తిని చెప్పినదా యేమి?

ర—ఔను.

ము—(తనలో) చెప్పినదే యామె కాదు. చెడఁగొట్టినదికూడ నామె
యే. ఆహాహా! తామరతూపరగ బ్రాఁకుచున్న తీఁగనుద్రెం
పివైచినదే- పండుకోసికొనఁగఁ జాచినచేతిని దెగనఱికినదే-
నోటికెత్తుపానకలశమును బడద్రోచినదే. ఎంతపనిచేసినది!
నారాయణవర్మను దానే చేసికొనుట కెంతపనిచేసినదో!
నారాయణవర్మకు రత్నప్రభతోఁ జెడినదికాని తనకు నారా
యణవర్మతో నదుకునా? నే నదుకనిచ్చెదనా? అట్లగు నెడల
నాబ్రదు కేమికావలసినది? (ప్రకాశముగా) సరే; అమ్మా! నీ
విప్పు డిచ్చటి కేలవచ్చితివి? నీ భవిష్యత్తును దెలిసికొనుట కేనా?

ర—ఔను.

ము—అట్లయిన నాలోచించి చెప్పెదను.

ప—(వెనుకకుఁజూచి నారాయణవర్మకుఁ గనఁబడునట్లుగా నాలుక
కఱచుకొని ముక్కుపై వ్రేలువైచికొని తలవంచుకొనును.)

నా—చక్రవర్తినీ! మీ రట్లు పరితాప మొందుచున్నా రేల? మీ రట్లు
నాలుక నేల కఱచుకొనినారు?

ప—ఏమియు లేదు- ఏమియు లేదు- ఇది యిట్టి మాటలాడుకొనఁ
దగినస్థలము కాదు. ఊ. ఊఁ. త్వరగ- త్వరగ రమ్ము- (నడచుట
నభినయించును.)

నా—చక్రవర్తినీ! ఏమంత సంభ్రమపడుచున్నారు?

ప—ఆసంగతి నీవడుగవలదు. నీతో మాటలాడుటకు నేనిక్కడ కేల
రావలయును? నేనున్నచోటికిఁ బిలిపించినయెడల నీవు రా
కుందువా? నేను మొదట నట్లే చేయవలయునని యనుకొంటిని.
పనికిమాలినబుద్ధి మారిపోవనా?

నా—అది మీయిల్లయి యిది కాకపోయినదా? అంతయు మీదే- కాని
యిప్పుడు మీరంత పశ్చాత్తాపపడుట కేమియావశ్యకత కలి
గినది?

ప—ఏదో కలిగినది. కలుగలేదు. ఆసంగతితో నీకుఁ బనిలేదు. కాని
రమ్ము. త్వరగఁ బోవుదము.

నా—మీరంత పట్టుదలగాఁ జెప్పనక్కఱలేదు. నేను మీయాజ్ఞకు
బద్ధుఁడను. మీరు దయచేయుఁడు. మీ వెనుకనే వచ్చెదను.

ప—నీవు ముందు నడచినఁగాని నేనొప్పుకొనను. వెనుకఁ జూడకుం
డ నడచెదనని నాకుఁ బ్రమాణము చేసినఁగాని నేనొప్పు
కొనను.

నా—(వెనుకఁజూచును.) ఆఁ. ఆఁ. (తెల్లబోయి నిలువఁబడును.) ఆతఁ
డెవఁడో ఆతనియొద్ద రత్నప్రభ కూరుచుండియున్నదే- సం
ధ్యాసమయమగుటచే బాగుగాఁ గానఁబడకుండనున్నది. ఆమె
రత్నప్రభయన్నమాట సత్యమే. ఆతఁ డెవఁడో. ఇందుకొఱకే
కాఁబోలు మేనత్తకొడుకును విడిచిపెట్టినది. హు.

ప—(తనలో) పరపురుషునితో మాటలాడుచుండగ రత్నప్రభ నీతని
కిఁ జూపించితినిగదా! ఇప్పుడైన నీమెయం దాతనికి బూర్ణమైన
రోఁత కలుగకుండునా? ఆమెయందు రోఁత పుట్టినతరువాత
నాయందుఁ బ్రేమ మేలకలుగదు? ఏల కలుగకపోవునో చూ

చెసను (ప్రకాశముగా) రమ్మా. నారాయణవర్మా! మరియొక చోటికిఁ బోవుదము.

నా—ఇఁక మఱియొకచోటి కెందులకు? కణకణలాడునిప్పులు న్నాకంటఁ బడినవి కాదా? ఇఁక మరియొకచోటి కెందులకు?

ప—నీవప్లేల చూడవలయును? అవిధేయుఁడా చూడవలదని నీకుఁ జెప్పలేదా? ఆఁడువారి కనేకరహస్యము లుండును. అందులో మగఁడని యనుకొనువానియందు విశ్వాసము లేనప్పుడు మఱికొన్ని రహస్యములుండును. అవియన్నియుఁ బనిలేక కనిపట్టి గుబ్బెటలు పడుచుండుట మగవానికి లక్షణమా? పాపము- పెండ్లియాడుపిల్లకు రవంతసేపౌక స్వరూపము బాగుగా నుంటచేత నాతనిమీఁద మనసుండును. మరి రవంతసేపటికింకొకస్వరూపముమీఁద మనసుండును. ఆతనితో మాటలాడినంతమాత్రమున నితనిపై మనసు లేదనవచ్చునా? ఇతనితో మాటలాడినంతమాత్రమున నతనిపై మనసు లేదనవచ్చునా? పదునాలుగేండ్లపడుచునకు సౌందర్యగ్రహణశక్తి చూలెంతరాలిరుచివలె. సర్వదా చంచలముగ నుండునుగాదా? ప్రపంచజ్ఞానసంపన్నుఁడవైన నీవెఱుఁగవా? మొదట నీమీఁద రవంత యుండెనే యనుకో- ఇప్పుడు మఱియొక్కనిమీఁదికి మనస్సుపోవుటచేత నీమీఁద లేదు లేదనికూడఁ జెప్పనేజెప్పినది. ఆమె దాఁచిన దేమియులేదే! తిరుగ నీమీఁది కామెమనస్సు రాఁగూడదా? రాకపోయినయెడల నే నూరకుండుదాననే యనుకొంటివా? రెండుమూఁడు దినములలోఁ బ్రధానముచేయింతునో లేదో నాశక్తిచూడు. ఆమాత్రముపట్టుదల పంతము లేనిదానను గానయ్యా.

నా—ఇఁక రత్నప్రభను నాకొఁ గూర్పుటయందు మీ రేమియు శ్రమతీసికొనవలదు. ఆమె నన్నిఁక నపేక్షింపనక్కఱలేదు. అందునుగూర్చి యెట్లు జరుగవలయునో జరుగును గాని నాస్థానమందు నిల్చుటకు సాహసించిన యాతఁ డెవఁడు?

ప—ఆతనిని గొట్టెదవా యేమి? మంచి సరసముగానున్నది. నీవిప్పుడుద్రేకముచే నాతనినిఁ గొట్టుటకు ముందడుగు వైచునరికి నిన్ను నక్షత్రములలోని కెగురఁగొట్టింతునో లేదో నా చమత్కారము- అట్టి యాలోచనమాత్ర మెప్పుడు చేయవలదుసుమా! నాస్థానమున నిల్చుటకు సాహసించిన యాతఁడెవఁడనియంటివి కాదా! నీకున్నది మేనత్తకొడుకు స్థానమే కాదా? అది యిప్పుడుకూడ నుండనేయున్నది. అంతకంటె నీకు వేఱుస్థానము లేనేలేదే. లేనిది పోవుటయెట్లు? "సాహసించిన" యని యంటివి- ఆతనికి నీభయమేమి? అతనిమాట యటుండనీ- రత్నప్రభకు నీయందు భయముండవలసినపని యేమున్నది? ఆమె నీభార్యకాదే! కాపురముచేయుచు సాహసించిన భార్యలను భర్త లేమిచేయుచున్నారు. కనుచాటునఁ బ్రపంచము సుఖముగా దొరలిపోవునుగాని పరీక్షకుఁ బ్రపంచమాఁగఁగలదా? మనకుఁ గన్నులు తఱచుగా మూసికొనుట కీయఁబడినవి. కాని తెఱచుటకుఁగాదే. చూచినచోటెల్లఁ దప్పుండి తీఱినది. చూడకుండనున్నచోటమాత్రమే తప్పులేదు. అందుచే లేనిపోని ప్రయత్నములు వలదు.

నా—అమ్మా! ఆతఁడెవఁడో తెలిసికొనఁగోరి యడిగితిని.

ప—నీమేనమామ కూతునకంతదగ్గఱివాఁ డెవఁడో నీకుఁ దెలియఁదగినది. ఆమెకుఁ దెలియఁదగినది. అంతేకాని నాకెట్లు తెలియును? ఆతఁడు మీతోవచ్చినవాఁడని నేననుకొనుచున్నాను.

నా—నాతో నెవ్వఁడురా లేదు. మీకోటలోనివాఁడేయని నేనను
కొనుచున్నాను.

వ—మా కోటలో నిట్టివాఁడున్నయెడల డొక్కచీల్పించి రాలుకొట్టిం
పకుందునా? సరి. రత్నప్రభయే నీకుఁ దెలియకుండఁ దీసి
కొనివచ్చినదని యనుకొనవలయునని తోఁచుచున్నది.

ము—రత్నప్రభా! నీకు జాతకమున్నదా?

ర—ఉన్నదేమో నేనెఱుఁగను.

ము—నీచేయి చూపించెదవా?

ర—ఆఁ (కుడిచేయినిచ్చును.)

ము—అమ్మా! నీవు నాకు సోదరివి. నీకింకఁ బెండ్లికాకపోవుటచే నీ
చేతిని స్పృశింతును. (చేయిచూచును.)

నా—(తనలో) ఆహాహా! నాకర్హమైన యామె దక్షిణకరమునే
స్పృశించితివా? ఎంత కాలమునుండి యున్నయాశ
యిట్లు వృధాచేసితివిరా తుచ్ఛుఁడా! కాని నీవామెను ద
క్కించుకొనునప్పటిమాటకదా! ఇంత నమ్మఁదగినయను
బంధమే మాయమైనప్పుడు ప్రపంచమున నింక నమ్మదగినదే
దైనానుండునా?

వ—నారాయణవర్మా! రత్నప్రభ కాతనికి స్నేహమున్నదని నీవిదివ
ఱకు రవంత సందేహింపనైనలేదా?

నా—నాకు సందేహలేశమైన నున్నయెడల నేను బ్రధానముననై
యేల సిద్ధపడియుందును?

వ—ప్రధానమున కభ్యంతరముండదు లే. ఈతఁడెవఁడో యిచ్చటకు
వచ్చి ప్రధానమునుగూర్చి నేను జేసికొన్న యేర్పాటునకు
భంగమొనర్చుచున్నాఁడు. ఈతనిని నేను శిక్షింతును. ఆమెను
నీవు క్షమింపుము. పెండ్లికాకుంటచే నామె మనస్సు పరిపరి

విధములఁ బ్రాఁకును. ఇట్టివారే పెండ్లియైనపిమ్మట మహాపతి
వ్రతలగుదురు. అందుచే—

ము—(రత్నప్రభ రెండవచేతినిగూడఁ జూచును.)

నా—నాకు రత్నప్రభ యక్కఱలేదు.

వ—ఎందుచేత? పట్టిపిల్లదియైన యామె వలపు నీయందునుండి తప్పి
నట్లు కనఁబడినంతమాత్రమున నీవల నామెనుండి తప్పిపోవునె
డల నీకు నామెకు భేదమేమున్నది? ఆమె తప్పుచేసినట్లు నీకుఁ
దోఁచినపుడు దిద్దుబాటుచేసి మఱల్చుకొనుట బుద్ధిమంతుని
లక్షణము కాదా? నీమీఁద లేక యామెకన్యునిమీఁదనే యు
న్నదని నిశ్చయపఱపుము. సముద్రమువంక వృథగఁబోవు
చున్ననది కడ్డుకట్టఁగట్టి మనము దానిమహాఫలమందుచు
న్నామా లేదా? ఇంతకు మించినదేదియు లేదే? అందుచే నా
మాటవినుము. అట్లెవెనుకకుజూడకు.

నా—(వెనుకకుఁజూచి) (తనలో) అయ్యయ్యో! ఈదుర్మార్గుఁడా
మె రెండుచేతులొక్కసారి పట్టుకొనినాఁడే! అనునయిం
చుచున్నాఁడు కాఁబోలు. అప్పళించుచున్నాఁడు కాఁబోలు.
నన్నుఁ బూర్తిగాఁ జిత్తమునుండి బహిష్కరింపుమని ప్రార్థిం
చుచున్నాఁడుకాఁబోలు.

ము—అమ్మా! నీకేమియుఁ గష్టములు లేవు. నీవు తలఁచుకొన్నభర్త
తోడనే నీకు వివాహము త్వరలోనగును.

ర—నాయనా! నాభర్తమున సన్న్యాకాంతమైనదని నేనుస్పష్టముగా
వింటిని. ఆతనితో నాకింకఁ గుదురదు. నాకు సన్న్యాసినీయోగ
మున్నదేమో పరిశీలించి చెప్పుము.

ము—పదుగురు పిల్లలఁగనఁదలఁచినయిల్లాలికి సన్న్యాసినీయోగమెట్లు
చెప్పుదును? నీభర్తమున సన్న్యవనితావశము కాలేదు. కాదు.

ర—పొరపాటు పడుచున్నారు. అతఁడు-అతఁడు—

ము—నీయభిప్రాయము నాకు తెలిసినది. అది యసత్యము. అట్లుకా
కుండ నేను బూటకాపుందును. నీకు సోదరులు లేరని వింటిని.
నేనే సోదరుఁడను. నారాయణవర్మతో నిన్నుఁగూర్చెడువాఁడ
ను నేను. అతనిమనస్సు నీమీఁదనే యున్నది. అమ్మా! ఈ
రెండుచేతులును దల్లిపాదములవలెఁ గన్నుల కద్దుకొందును.

నా—(తనలో) ఆమె రెండుచేతులను ముద్దిడుకొనుచున్నాఁడే? ఇఁక
నేమున్నది? ఇఁకఁజూడదగినదేదియు లేదు. రత్నప్రభచావో
యీచండాలునిచావో, నాచావో, యీమూఁడునో యిక్కడఁ
ద్వరలో జరుగవలసియున్నది. పెండ్లియింకఁ గాలేదని యుపే
క్షించుట బుద్ధిహీనత- గౌరవహీనత- మాతండ్రిసంకల్పించి
నప్పుడేయైనది- దానితండ్రి దానిని నాకీయఁదలఁచి తన యిం
టఁ బెట్టుకొన్నప్పుడే యైనది మేమొకరినొకరు రవంతజ్ఞాన
మురాఁగఁ జూచుకొనినప్పుడే యైనది ఇంతకాలమునుండి
మేము ప్రక్కపైఁదక్క భార్యాభర్తలమై ప్రవర్తించుచు
న్నాము. ఈదుర్మార్గురాలు భర్తృద్రోహ మాచరించినది. అం
దులకుఁ దగిన ఫలమొందవలసియున్నది.

ప—నారాయణవర్మా! తీవ్రముగఁ గ్రూరముగ నాలోచించుచున్నా
వేమి? నామాటవినుము. ఎవ్వరినిగూడ నేమియుఁ జేయఁగూ
డదు. అనఁగూడదు. నీవెవరిరాష్ట్రములో నున్నావో, యెవరి
యింటిలోనున్నావో బాగుగా యోజించుకొనుము. నీవుతీర్పవ
లసిన పగ నేనుదీర్తును. రత్నప్రభ నీకక్కఱలేదని స్పష్టము
గాఁజెప్పితివి-నీపక్షమున నేనున్నాను. నీయిష్టమునకు వ్యతిరేక
ముగా నామెను గ్రహింపుమని నిన్ను నేను నిర్బంధింపను.
నీకు మామగారిరాజ్యము పోవునని సందేహమక్కఱలేదు-

నారాజ్యములో సగము, నాసర్వస్వములో సగము నీకిచ్చెదను
నిన్ను నాతో సమానప్రతిపత్తిగలవానిగఁ జేసెదను. వెనుకటి
సంగతు లేమియుఁ దలపెట్టుకొనకుము. ప్రాప్తిలేనివస్తువు చేంజి
దాటిఁపోక తప్పదు- పోయినదేదో శాశ్వతముగాఁ బోయినదే?
ఇఁక ముందు రాఁదగినదేదో చూచుకొనవలయును. నీవేమియు
నింక మాటలాడకుము. నిన్ను సింహాసనముమీఁదఁ గూరు
చుండఁ బెట్టనియెడల నేను జక్రవర్తినినిగాను—నీకింక మామ
గారు లేరు. అతనిరాజ్యము లేదు. రత్నప్రభ లేదు. నీకున్నది
నేను. నాకున్నదినీవు- రత్నప్రభనీయెడలఁ జేసిన ద్రోహమున
కుఁ బ్రతీకారముగా నేనెంతయైన సంకల్పించుకొని యుంటిని.
కర్తృత్వము నీకుందేమియు నుంచుకొనవలదు. అన్నిటికి నేను
న్నాను. ఆపాపపుణ్యము లన్నియు నావి. ఏమిమాటాడవు?

నా—మీ రేమంటిరో నేను వినలేదు. క్షమింపవలయును.

ప—(తనలో) ఇంత యేమ్పులో నా గాన మీతని చెవికెక్కదు. ఈ
పాట మరియొకపుడు పాడవలయును- రత్నప్రభకు నీతనికున్న
పూర్వానురాగమును స్వార్థలోలతచే నేను జెడఁగొట్టితి నన్న
సందేహ మీతనిమనస్సునకుఁ దగులకుండుటకై యిన్నిపాటులు
పడవలసి వచ్చినది. ఇప్పుడే నేను దొందరపడఁగూడదు.

ర—నాభర్త నన్నే వలచియుండెనా? నా కాతనితో వివాహమగునా?

ము—మరియొకసారి చెప్పుచున్నాను. చక్రవర్తిని కెటులున్నను
నాతనికిఁ జక్రవర్తినిపై లేదు. ఆతని కామెతోఁ బొసఁగదు.
అందుకు మఱియొకఁడు సిద్ధపడియున్నాఁడు. నీకు నారాయణ
వర్మ తప్పడు. నే నిటులంటినని చక్రవర్తిని కేమాత్రమును
దెలియఁదగదు. తెలిసినదా?

ర—(తనలో) చక్రవర్తిని మరియొకలాగునఁ జెప్పిన దెందువలననో.
ఇదంతయు నా కెందులకు? (ప్రకాశముగా) నా కింతదో

చాలును. మీ రమోఘవాక్సంపన్నులు గావున నిర్విచారముగ నుండెదను.

ము——సరే —నీవు నీభర్త నీదినమునఁ జూడవలదు.

ర——చిత్తము.

ము——సరే——నీ విఁకఁబొమ్ము. (ఇద్దఱు లేతురు.)

నా——(తనలో) ఇద్దఱు లేచినారు; కలసి యాగదిలోనికిఁ బోవుదు రేమో? అట్లే పోవునెడల జీవములతోఁ దిరుగరాకుండఁ జేయవలయును. ఆతఁడు గదిలోనికిఁ బోవుచున్నాఁడు. ఈమె మఱియొక వంకకుఁ బోవుచున్నది.

(రత్న, ముర, అట్లు చేయుదురు.)

ప——నారాయణవర్మా! వారు పోయినారు. వారిమాటలు మనకు వినఁబడనట్లే మనమాటలు వారికి వినఁబడవు. కాని వారు మనకుఁ గనఁబడినారు. మన మీచాటున నుంటచే మనము వారికిఁ గనఁబడము. ఇప్పటివఱ కేమియుఁ దొందర లేకుండ జరిగినది. ముందుగూడ నటులే జరుపుకొనవలయును. సరే మనము పోవుదము రమ్ము.

నా——నేను నాబసలోనికిఁ బోవుదును. త్వరలో నాకు సెలవొసఁగునెడల నేయూరైనఁబోయి జీవింతును.

ప——నీసెలవునకుఁ దొందర యేమియు లేదు. నీకు నేను సెలవీయఁ దలచుకొనలేదు. ఇప్పటికి నీవే నాకు సెలవిమ్ము. నేనుబోయెదను.

(పద్మిని నిష్క్రమించును)

నా——ఈగదిలో కేగిన పాపాత్ముని ముందుజంపెదను. ఇప్పటికింక గడియరాత్రియైనఁ గాలేదు. నిశామధ్యసమయమున నిటకు ఖడ్గపాణినై వచ్చెదను. ఇప్పటికి బసకుఁబోవుదును.

(నారా! నిష్క్రమించును.)

ఇది చతుర్థాంకము.

పద్మిని

పంచమాంకము.

ప్రదేశము——మురళీమనోహరుని గది.

[ప్రవేశము——మురళీమనోహరుఁడు.]

ము——సర్వతంత్రస్వతంత్రురాలును సర్వాధికారసంపన్నయు నగు నామె నెట్లుదక్కించుకొనఁగలనో? తెలియకున్నది. ఆమెచూ పెంతసేపు నాతనియందే యున్నది. అతని జేరుట కడ్డువచ్చుచున్నకొండలను భేదించుచున్నది. వనములను గాల్చుచున్నది. నాకుఁగూడఁ జక్రవర్తినియందే చూపున్నది. ఆమెను జేరుటకు నే నేమిచేయుచున్నాను? యోగివేషధారినై జపమాలత్రిప్పుకొనుచు నామెయింటనే కూరుచుండియున్నాను. ఏమిచేయుటకును దోఁపకుండనున్నది. ఎట్లుపోవుటకును దారి కానఁబడకుండ నున్నది. ఆమెకు నారాయణవర్మపై వలపు మితిమీఱిపోవుచున్నది. అది చెడఁగొట్టుటకు నావశముకాకుండ నున్నది. చెడఁగొట్టినయెడలమాత్ర మామె నన్నువలచు నెట్లు? చక్రవర్తిని యెట్టిచిక్కునఁబడికొట్టుకొనుచున్నదో నేను నట్టిచిక్కుననే పడి కొట్టుకొనుచున్నాను. ఆమె స్థానబలిమికలది కావున నామె కృతార్థురాలు కావచ్చునేమో కాని నడుమునఁ గావిగుడ్డయుఁ జేత నానవకాయబుఱ్ఱయుఁగల నే నేమిచేయఁగలను. కాని నేను నిర్వహింపఁగల నను మొండిధైర్యముమాత్రము మనస్సును విడిపోలేదు. ధైర్యమే దైవకటాక్షమునకు

గుఱు తని నమ్మియున్నాను. ముందు రత్నప్రభతో నారాయణవర్మను గలుపుటకంటెఁ గర్తవ్యము లేదు. అది యెంత శీఘ్రముగ నగునో యంతమంచిది. నేను నాకార్య మెట్లునిర్వహించుకొనఁగలుగుదు నను యోజనతోడనే రేయింబవళ్ళు నిద్రాహారములు లేకుండ దొరలించుచున్నాను. నడు మీడ్చుకొనిపోవుచున్నది. తల నొచ్చుచున్నది. రవంత విశ్రమింతును. నారాయణ నారాయణ. (పండుకొనును.)

[నారాయణవర్మ ప్రవేశించును.]

నా——ఒక్కఁడను. నా కెవ్వఁడును లేఁడు. ఏమైననేమి? ఈగదిలోఁ బ్రవేశించిన దుర్మార్గుని జంపుటకు నిశ్చయించుకొంటిని. గది తలుపులు తెఱచియేయున్నవి. అదిగో అక్కడ నిద్రించుచున్నాఁడు. అప్పుడు నేను జూచుచుండగనే యీగదిలోఁబ్రవేశించినాడు. వాఁడే వీఁడనుట నిస్సందేహము. నిదురఁబోవుచున్న వానిని జంపుట కాతరత కాదా? మెలఁకువవచ్చువఱకు వేచియుందునా? ఇంకదగ్గఱగాఁ బోయిచూచెదను. ఆహా! ఇదేమి విరాగివలెనున్నాఁడే. తనభార్యయే తన కక్కఱకు రానప్పుడు నాభార్య తనః కెందులకో? స్వభార్యాతిరస్కారము పరభార్యాస్వీకరణమునకా? ఆహా! మనుజప్రకృతి యెంతభ్రష్టమైపోయినది!

సతతదేశ భక్త్యుపన్యాసంబునోట
నజ్ఞజను లిచ్చుబహుధన మంతయింట
వలపలికరాగ్రమున యతీశ్వరుల యష్టి
సవ్యకరమున నీవిమోక్షణము కాదె?

చీ. ప్రపంచభ్రష్టలోకరీతు నా కెందులకు? నాబ్రదుకుకంటె భ్రష్టమైన దేకేమున్నది? నాభ్రష్టత కీపాంథపరివ్రాజకాధముఁడే

కారణము. వీనిని జంపవలయును. సంసారియగువాఁడు వ్యభిచరించినప్పుడే వానిని జంపవలసియుండునుగదా! సన్యాసియై పరకాంతను దడవిన యీదొంగముండకొడుకును జంపుటకంటె శిక్షయేమున్నది? ఇట్టివానిని జంపుట లోకోపకారముకంటె భిన్నమా? (గదిలోఁ బ్రవేశించి నకిలించుచున్నాఁడు) నకిలించినను లేవకుండనున్నాఁడు. లే బైరాగీ లే.

ము——(లేచి) మీ రెవరయ్యా?

నా——నే నెవఁడనైన నీకేమి?

ము——న న్నెందులకుఁ బిలిచితిరి?

నా——ఇందులకు. (బాకుతోఁబొడుచును. బాకు భుజమునకు గీచికొనిపోవును)

ము——హరిహరీ! దుర్మార్గుఁడా బైరాగినిజంపవచ్చితివా? ఏదీ బాకు? (ప్రక్కక్రింద వెదకును)

[నేపథ్యమున]——రావే త్వరగ రావే. అల్లరి యగుచున్నది

నా——అదేమి చక్రవర్తిని దాసితోఁ ద్వరగవచ్చుచున్నది.

[పద్మిని, మాలిని ప్రవేశింతురు.]

ప——ఆఁగుఁడు. అంతటితో నాఁగుఁడు. చక్రవర్తినికోట యనుకొంటివా? గుడిసెవేట్రుకొంప యనుకొంటివా? సన్యాసివర్యా! నీయంగిరక్తముతోఁదడసినది. వర్మా! నీ వతనిని బొడిచితివా?

నా——ఔనమ్మా! పొడిచితిని.

ప——ఏల?

నా——అతఁడు నాకు మహాపకార మొనర్చినాఁడు.

ప——(తనలో) ఈతఁడు మొదటరత్నప్రభను జంపునేమో నాపీడవదలునని యనుకొంటిని. ఆమెను జంపక యీనిర్భాగ్యుఁ డీతనిఁ బొడిచినాఁడు. నేను వచ్చులోపలనే కార్యము మించినది.

(పరిహాసముగా) ఈసన్యాసి నీ కేమియుపకార మొనర్చెవాఁడు? (సన్యాసి బలహీనుఁడై కనులుమూయుచుఁ దలవ్రాల్చుచున్నాఁడు.) మాలినీ! ఆతనిఁ బట్టుకొని దీసికొనిపోయి మన శస్త్రవైద్యున కప్పఁజెప్పుము.

(మాలిని, మురళీమనోహరుఁడు నిష్క్రమింతురు.)

ప—నారాయణవర్మా! నీ కింతతొందరయేల? ఆతని నేమియు నీవు చేయవలదని చెప్పలేదా? నాకోటలోనున్న యాతని శిక్షించుటకు నీ కెట్లధికారముకలిగినది?

నా—నాభార్యను హరించుట కాతని కెట్లధికారము కలిగెనో యాతని శిక్షించుటకు నా కట్లధికారము కలిగినది. మీకోట యనుమాట సత్యమే కాని యాతని శిక్షించుటకు మీరు నా కధికారమిచ్చువఱకు నాఁగఁదగిన పరిస్థితి కాదు. కావున నే నట్లొనర్చితిని. నరహత్యకై మీరు నన్ను శిక్షించునెడల మహాసంతోషము. చచ్చుట కింతకంటెఁ దగినసమయము నా కుండదు. కానిండు.

ప—నీభార్య కాకస్మికముగఁ గలిగిన రవంత చిన్నతనపుదుర్బుద్ధిని మరలించి యామెను నీతోఁగూర్చి మిమ్మొకయింటివారుగ జేసి మీమామగారి రాజ్య మీయవలయునని నే నెంచి యందుకొఱకుఁ బాటుపడుచుండగ దుడుకుదుడుకునఁ బోయి యాతనిఁ బొడిచి నీవు చచ్చుటకు సిద్ధపడెదవా? నీకు మతి యున్నదా లేదా?

నా—చక్రవర్తినీ! మీరు నాకొఱ కింకశ్రమపడవలదు. ఇదివఱకుఁ బడినదానికే నేను కృతజ్ఞుఁడనై యున్నాను. ఆమె నా కక్కఱలేదు. అక్కఱలేదు. ఇంతకాలమును నమ్మించి నా కింత యపకార మొనర్చినదాని నింక—(తలపంకించుచున్నాఁడు.)

ప—తప్పే చేసినది. చేయలేదని నేనంటినా? అనుటకు నాకు నోరు వచ్చునా? తప్పుచేసినది కావుననే క్షమింపుమంటిని.

నా—చక్రవర్తినీ! క్షమింపుము. నమస్కరించుచున్నాను. ఆమె నా కక్కఱలేదు.

ప—అక్కఱలేదా?

నా—అక్కఱలేదు.

ప—నా మొగము చూచి చెప్పుము. నిజముగా నక్కఱలేదా? నా మొగమువంక జూడవేమి?

నా—(చూచి) అక్కఱలేదు.

ప—పోనీ! అక్కఱలేనియెడల బలాత్కార మెవరు చేయుదురు? పోనీ నీయం దిష్టమున్నదానినే జేసికో. నీయందుఁ బంచప్రాణములు పెట్టుకొన్నదానినే చేసికో. మాటలాడవేమి?

నా—నే నెవ్వరినిగూడఁ జేసికొనను.

ప—సన్యసింతువా? ఇదిగో చూచితివి కాదా? సన్యాసిసౌఖ్య మెట్లున్నదో? కాషాయాంబరధారివై కనబడినవారి నెల్లఁ దపముటకంటె గృహస్థాశ్రమముననే గుడుగుడుగుంచము లాడుటమంచిది కాదా? ఆహా! కాలకృత్యములను దీర్చుకొనుటకుఁ గాళికాలయమేగాని పనికిరాదా? ఓహో! నీవుసన్యసించుట! సన్యాసినియమమును నిర్వహించుట! అడుగ నక్కఱలేదు? అంటఁగూడని మేనమామకూతుకై మురిసిమురిసి కాళ్లఁ జేతుల నెగదిగఁ ద్రాఁకులాడి ప్రాకులాడి తోఁటకూరయాకులోని పురుగునువలె నామె నిన్నంటకుండ దులిపివైవ నింతగా మొత్తుకొని మొత్తుకొని యాకస్మికముగ సర్వసంగపరిత్యాగివై సన్యాసివయ్యెదవా? సిగ్గక్కఱలేదా? పూర్వోత్తరసందర్భమక్కఱలేదా? మామకూఁతురు నీకంటిలో మట్టిఁగొట్టి నీయెదుటనే పైవా

ని పక్క జేరి నీతాపిడు త్రెంపగ నీవు జన్నిదములఁ ద్రెంపు కొని సన్యసింతువా? ఒక్క కెకిలినవ్వు వెంబరగొట్టుడాఁడుది నిన్నుఁ బరాభవించి నీకొంపతీసి నీగొంతుకోసి నీబ్రతుకు వల్లకాడు చేయుటకు సమర్థురాలైనప్పుడు నీవెంతవాఁడవో? ఇదిగో నేను జేసిన దాసరయ్య వీఁడే యని నిన్నుఁ దన ప్రియునకుఁ జూపి కిలకిలనవ్వి కెవ్వునార్చుటకు దాని కవకాశ మీయవచ్చునా? ఇట్టిసమయమున మనస్సు బిఁకపఱచుకొని దాని నెత్తిమీఁద నెగిరిపోవుదానిని గట్టుకొన్నయెడల దాని మొగముమీఁదఁ జెప్పునఁగొట్టినట్లుండునే. స్వాతంత్ర్యుఁడవైన నీవు జేలపడి డీలుపడి గోలుమనెద వెందులకు? తోవ్రక్క మఱియొకదారితొక్కు. బుద్ధిమంతుడవుకావా? నీయదృష్టమునకు నీవే కర్తవు. నీవు చక్రవర్తివగుట నీచేతిలో నున్నది. మహావకాశము నీపుణ్యమున సిద్ధించినది. ఇది దాఁటిపోనీకు. పోనిచ్చినయెడల బ్రదుకంతయు నధ్వాన్నమే. అవమానమే. అపాయకరమే. నీవు త్రాసుముంటిపై నున్నావు. ఇటుజోగిన పరమసుఖమైన బ్రదుకు. అటుజోగిన భయంకరమైన చావు. యోచించుకో!

నా.—నన్నుఁ జంపుదునని మీరు బెదరింప నక్కఱలేదు. చావునకు నేను సిద్ధముగనే యున్నాను. నేనెవ్వనినిగూడ వరింపను. వరింపలేను.

ప.—తిరిగి యెవతెనైన వరింపకుండుట నీతియనుకొన్నావు కాఁబోలు. ఇంత నీతిమంతుఁడనని యనుకొనుచుంటివికదా! నీనీతి యంతయు గోఁతిలోఁ బడునట్లు సన్యాసి నేలచంపఁదలచితివి?

నా.—నేను సంకల్పించుకొన్న మహాసుఖమంతయు నొక్కసారి కూలిపోవగఁ దాత్కాలికోన్మాద మెత్తి యట్లు చేసియుందును.

ప.—పిచ్చిచేఁ జేసితినని చెప్పినవానికిఁ బిచ్చియెక్కడిది?

నా.—అమ్మా! ఎందుల కీమాటలు?

ప.—ఆఁ ఆఁ నాతో మాటలాడుటయే నీకంత రోఁతగా నున్నదా? సరే. ఎవ రక్కడ?

[నేపథ్యమున] చిత్తము.

నీవు పోయి కారాధిపతి నిటకుఁ దీసికొనిరమ్ము.

[నేపథ్యమున] చిత్తము.

ప.—వర్మా! నీవు చక్రవర్తిని కవిధేయుఁడవుగఁ బ్రవర్తించితివని యెఱుఁగుదువా?

నా.—ఎఱుఁగుదును.

ప.—చక్రవర్తినియెడల ద్రోహ మొనర్చితివని యెఱుఁగుదువా?

నా.—నేను మీయెడల ద్రోహినిగాను.

ప.—నాయతిథివైన నీవొక సన్యాసితోఁ గుట్రచేసి నన్నుఁ జంపనెంచితివి కాదా? అతఁ డందుల కంగీకరింపకపోవుటచేతనే కావా నీ వాతనిఁ జంపఁబూనితివి?

నా.—హరిహరీ! ఇదియొక్క కుత్రకల్పనయా? నన్నుఁ జంపుటయే మీ యభీష్టమగునెడల నటులే కానిండు. నరహత్యదోషమునకు మరణదండనమున్నదే కదా? రాజద్రోహ నేరముకూడ నాపైఁ గట్టుటెందులకమ్మా—మీరెంత గొప్పవారైనను నన్ను రెండుమారులు చంపఁగలరా?

ప.—నీ బాకుపోటువలన సన్యాసి చావకుండునెడల?

(కారాధిపతి ప్రవేశించును.)

కారాధిపతీ! ఈతఁడు నరఘాతుకుఁడు. రాజద్రోహి. ఈతని నురిశిక్షనొందువారి కొట్టులో నుంపుము.

కా—చిత్తము.

(నారాయణవర్మతోఁ గారాధిపతి నిష్క్రమించును.)

ప—ఛీ! నపుంసకుడా! లజ్జాముండకొడుకా! రాతిబొమ్మా! నీబ్రదుకు మండిపోను. నీకు పురుషజన్మమిచ్చిన బ్రహ్మగాని నీదాడ నాదాడ వాయింపవలసినదిరా! ఆఁడుదానను. అందుపైఁ బడుచుదానను. అందుపై సౌందర్యవతిని. దానిపైని జక్రవర్తినిని. మగఁడో మగఁడోయని యీ మీసాలముత్తయిదువుకై దేవులాడుగతి కలిగినదే! ఎన్నియిచ్చకములాడినను నెన్ని మోసములు పన్నినను నెన్ని తర్జనభర్జనము లొనర్చినను నీముంచుగడ్డముండకొడుకు కరిగినాఁడు కాఁడే! ఎంతబట్టబయలై పాడైపోయితిని! ఇప్పు డేమిచేయవలసినది. తెలివితక్కువదైన యీఁడు దిప్పుడేమ్పును. నే నట్లు లేద్వను. కాని నామాయరాజ్యమంతయు వ్యాపింపకుండనే చప్పున నెవ్వనినైనఁ బెండ్లి చేసికొందును. నేనీసారిమగనికొఱకుఁ బ్రయత్నింపను. ప్రప్రథమమున నెవఁడు నన్నువరించి యడుగునో మారుమాట చెప్పకుండ నాతనిని బెండ్లి చేసికొందును. వాఁ డెవఁడైననరే. నాయందు గాఢానురాగమున్న వాఁడైనఁ జాలును. మాలినీ. త్వరగ వచ్చుచుంటివేల?

[మాలిని ప్రవేశించును.]

మా—అమ్మా! సన్యాసి బ్రదుకుట దుర్ఘటమని వైద్యుఁడు చెప్పినాఁడు.

ప—ఆఁ ఆఁ! అదేమే-చచ్చిపోవునటే. అయ్యయ్యో! మహావ్యక్తియే.

మా—మరణమునకు మహావ్యక్తియేమమ్మా! మా పిన్నమ్మ చచ్చిపోలేదా అమ్మా!

ప—నీపిన్నమ్మ మహావ్యక్తియా? నీపిన్నమ్మయంత పనికిమాలిన ముండ ప్రపంచమున నున్నదా? మగనిని గడతేర్చినది. కన్నకొడుకునకు విషము పెట్టినది. నీమగనితోఁ గాపురము చెడఁగొట్టుటకుఁ బ్రయత్నించినది. ఇదికాక—

మా—ఇట్టి కాపురములు చెడఁగొట్టుట కీకలికాలములో నెందఱు ప్రయత్నించుటలేదమ్మా! అక్కఱవచ్చినప్పు డందఱన్నియాట లాడినవారే.

ప—(తనలో) దీనిగొంతుగోయ! గుండెలలో శాకుపోటుగఁ బొడిచినది! మోసకత్తెయైనరాణిని దాసికూడ నీసడించునుగదా! పోనీ! ఎంత మోసముచేసినను నెంతయైన ఫలించినదా? మోసముచేసితినన్న యపకీర్తియే మిగిలెను గాని యంతకంతెఫలమేమియు లేకపోయెనే? ఫలములేదుసరికదా! పైగఁ బైవారిచేత నందులోఁ బడుచుకొని బ్రదుకుముండలచేతఁగూడఁ దిట్లా. నేను రత్నప్రభానారాయణవర్మలయెడల మహాద్రోహ మొనర్చితిని. నారాయణవర్మ సన్యాసిని బొడుచుటలోఁ దప్పేమున్నది? యథార్థమాలోచింపగ సన్యాసిని బొడిచినది నేనుగాని నారాయణవర్మ కాఁడే! సన్యాసి చచ్చునెడల నరహత్య నాదికాని నారాయణవర్మదికాదే! ఇందులకు నారాయణవర్మ కురిశిక్ష యెందులకు? ఆనరహత్యకూడ నానెత్తిని గట్టుకొనుటకేనా? పండువంటి రత్నప్రభ కాపురము పరశురామ ప్రీతియైనదికదా! ఎన్నియేడ్పులేడ్చినను నాకు మగఁడు లభింపలేదుగదా! ఇంటి కతిథియైవచ్చిన సన్యాసి నామూలమునఁ జచ్చుటకు సిద్ధముగ నున్నాఁడుకదా! ఇంత సంసారఘాతుకత, యింత జీవనాశనము నేను జేసిన మోసమునకేనా ఫలము! ఏకష్టమువచ్చినను సహించుకొనుటకుఁ బ్రయత్నింతు

నుగాని యిఁక నెవ్వరిని గష్టపెట్టను. బుద్ధివచ్చినది. (ప్రకాశముగా) నీవేమంటివో నేను వినలేదుకాని, సన్యాసి బ్రదుకఁడని యే వైద్యుఁడుచెప్పెనా?

మా—ఔనమ్మా.

ప—అయ్యయ్యో! ఆతఁడెవరో- ఎక్కడఁబుట్టినాఁడో- తలిదండ్రులెవరో- ఎక్కడఁ బెరిగినాఁడో- యెక్కడవిద్య నేర్చినాఁడో- ఎక్కడ నాతనిబంధులు మిత్రులున్నారో. అయ్యయ్యో తుదకు మనకోటలోఁ జచ్చిపోవునఁటే!

మా—కోటయావలి కీడ్చివేయుమని సెలవా అమ్మా!

ప—ఛీ! నోరుమూసికో! నేనంతదుర్మార్గురాలనని నీయభిప్రాయమా? నేనంత పాషాణహృదయనని నీయభిప్రాయమా? నేనంత పాపాత్మురాలనని నీయభిప్రాయమా! మంచిచెడ్డల గుర్తెఱుఁగకుండ మాటలాడెదవా? నే నాతని నడువీధిలోఁ బాఱవేయుమందునా? నే నాతనియం దెంతో గౌరవము భక్తియుఁ గలిగియుందునని నీ వెఱుఁగవా? ఆతనియందేమో యవి యకారణముగ వృద్ధియగుచున్నవని నేను నీతో నిదివఱకుఁ జెప్పియుండలేదా? అసందర్భప్రలాపినీ! పో- ఆవలికిఁ బో.

(మాలిని పోఁబోవును.)

ఏమే- ఆతఁడు బ్రదుకఁడన్నమాటలు చెప్పుటకేనా వచ్చితివి? అంతకంటెఁ జెప్పవలసినమాట లేవియు లేవా?

మా—లేకేమమ్మా?

ప—ఆమాటలు చెప్పకుండఁ బోయెదవేమి?

మా—చెప్పుటకే వచ్చితినమ్మా- చెప్పనిచ్చినమొదలఁ జెప్పకుందునా?

ప—నీయంతనీవే యిటకు వచ్చితివా? నిన్ను వైద్యుఁడు పంపగవచ్చితివా?

మా—అమ్మా! సన్యాసి పంపగవచ్చినాను.

ప—ఆతఁ డేమనెనో త్వరగఁ జెప్పుము.

మా—ప్రాణావసానసమయమున మీతోఁ గొన్నిమాటలు చెప్పవలయునఁట- మిమ్ముఁ దనయొద్దకు రమ్మని కోరినాఁడు.

ప—నేను రావలయుననియే యనుకొనుచున్నాను. వచ్చుచున్నానని నీవు ముందుగఁ బోయి చెప్పుము. కాలుసేతులు గడిగించికొని పట్టుబట్టలు కట్టుకొని భగవంతుని దర్శనమునకు వచ్చునట్లు వచ్చెదనని చెప్పుము. పొమ్ము.

(ఇద్దఱు నిష్క్రమింతురు.)

పద్మిని

షష్ఠాంకము.

ప్రదేశము: కోటలో నొకగది.

[ప్రవేశము: రోగశయ్యపై మురళీమనోహరుఁడు, మాలిని ప్రవేశింతురు]

ముర—ఇంకను రాలేదేమి?

మా—ఇంకను రాలేదేమని యెన్నిసారులడిగితివయ్యా! ఇంత తొందరపడుదు వేల?

ము—తొందర కాక నాకు శాంతియెట్లువచ్చును? నేను గోటకుఁ జేరినది మొదలు కోట గగ్గోలుగానున్నది. నామనస్సంతకంటె గగ్గోలుగానున్నది. రత్నప్రభ మనస్సన్యాక్రాంత మైనదని నారాయణవర్మతోఁ జెప్పి నారాయణవర్మమన స్సన్యాక్రాంత మైనదని రత్నప్రభతోఁ జెప్పి వారిద్దఱకుఁ జెడఁగొట్టినదికదా! రత్నప్రభయవస్థఁ జూడ నాకు మిక్కిలి జాలియగుచున్నది. నేను దనకేదో మహాపకార మొనర్చితినని నారాయణవర్మ స్పష్టముగఁ బలుకకనే పలికినాఁడుగదా! ఈయపకార మేమున్నది? నేను రత్నప్రభను వశపఱచుకొంటినని యాతనికిఁ బద్మిని నచ్చెప్పకపోయినయెడల నాతఁ డట్లేలపలుకును? నన్నేలపొడుచును? రత్నప్రభ బ్రదుకా చెడినది. నారాయణవర్మ బ్రదుకా చెడినది. మరణదండన మొందువారికొట్టులో నారాయణవర్మ పెట్టఁబడినాఁడని వినియేయున్నాము. ఆతని

నాపె చంపునేమో! ఆతఁడు చచ్చునెడల రత్నప్రభ చచ్చును. ఈతంత్రమున బుద్ధిపూర్వకముగ నేమూఁనో చిక్కుకొనియున్న నాకీమహాపాతకములో భాగము రాకతప్పదు. అదిగాక చక్రవర్తిని నట్టి పాపమునుండి తొలగించుట మన విధి- ఏమి మాలినీ.

మా—ఔనయ్యా కాదన్నవా రెవ్వరు? కాని యీమాటలన్నియు నిదివఱకుఁ బదిసారులైన ననుకొన్న వేకదా? తిరుగ నెందులకు?

ము—సరే కాని పద్మిని మొగమును బాగుగాఁ బరిశీలించితివి కాదా?

మా—ఆ.

ము—ఆమెకు రవంత పశ్చాత్తాపము కలిగినట్లు కనఁబడినదా?

మా—కలిగినట్లే నాకుఁ దోఁచినది.

ము—నీకుఁ దోఁచుటయే నాకుఁ జాలును. పశ్చాత్తాపమే కలిగిన యెడల నా పవిత్రదంపతు లిద్దఱు బ్రదికినవారే- నా పుణ్యవశమున నేను నొక యింటివాఁడను గావచ్చును. నేను బ్రదుకననియే స్పష్టముగాఁ జెప్పితివి కాదా? నీ యభిప్రాయ మదియైనట్లు చెప్పితివా? వైద్యుని యభిప్రాయ మైనట్లు చెప్పితివా?

మా—నాయభిప్రాయమైనట్లు చెప్పినయెడల లక్ష్యము చేయదేమో యని వైద్యుని యభిప్రాయమనియే చెప్పితిని.

ము—మాలినీ! వైద్యుని బిలిపించి పద్మిని యడుగునెడల "నేమియు భయములేదు. ఆతఁడు బ్రదుకునని వైద్యుఁడు చెప్పునుగదా? అందుపై నామె యిచ్చటకు రాదేమో?

మా—నే నంతస్పష్టముగాఁ జెప్పినప్పుడు వైద్యు నేల పిలిపించును? మిమ్ముఁ జూచుటకు రావలయునని తొందరపడుచునే యున్నది. అదిగాక పట్టుబట్టలు కట్టుకొని భగవంతుని జూచుటకు వచ్చి

న్లు వత్తురని చెప్పుమని కూడఁ జెప్పెనని చెప్పలేదా? లేని
పోని సందేహము లివన్నియు నేల?

ము—ప్రయత్నకాల మందెంత ధైర్యమున్నను ఫలకాలమందు సందే
హము మెండుగనుండుట నరునిప్రకృతి కాదా?

(పద్మిని ప్రవేశించును.)

ప—మహాత్మా! నమస్కారములు.

ము—నీ కతిశీఘ్రముగఁ గల్యాణము కావలయునని దీవించుచున్నాను.

ప—నా కల్యాణము మాట కేమి? మీరు బ్రదికియుండుటకంటె నాకు
వేఱు కల్యాణమున్నదా? మాలినీ! నీవు వైద్యునింటికిఁ
బోయి యాతనిఁ దీసికొనిరా.

మా—చిత్తము.

(నిష్క్రమించును.)

ప—సన్యాసివర్యా! నేను మహాపాపాత్మురాలనైతిని. నాకు మీ
యొద్ద దాఁపఱికము లేదు. స్పష్టముగ మీతో నాపాపములను
జెప్పి మీ యవసానకాలమున క్షమాపణఁబొంది మీ యాశీ
ర్వాదమునొంది పరిపరి విధములఁ బాడైన మనస్సును బాగు
చేసికొన వచ్చితిని.

ము—నీవు చెప్పవలసిన యంశము లేవో నిస్సంశయముగఁ జెప్ప
వచ్చును.

ప—అవసానసమయమున నాతండ్రి నాకు భర్తను స్థిరపఱిచినాఁడు.
ఆతని నేను జూడలేదు. నా కాతనియం దిష్టము లేదని గ్రహించి
యాతనికి మూఁతివంకర యని ముక్కువంకర యని చూచివచ్చి
నదాసులు చెప్పగా దాసిదానికంటెకే యాఁగనివాఁడు నాకం
టె కెట్లాఁగునని నే నతనిని దలపెట్టుటకూడ మానివైచితిని.
ఒక్కమాలినిమాత్ర మాతనిఁ గూర్చి యనుకూలముగఁ జెప్పు

చుండెడిది? అందుచేత దానిపై నాకుఁ గోపము. నాతండ్రి
కిట్లు నే నవిధేయురాలనైతిని. ఇది నాప్రథమదోషము. నారా
యణవర్మను నేను గాటముగా వలచితిని. ఆతని జేసికోఁదలఁచి
రత్నప్రభతో మాయమాటలు చెప్పి యామె కాతనియందు
రోఁతను గలిగించితిని. నారాయణవర్మతోఁ గూడ నట్లే చెప్పి,
యతనికి దానియం దసహ్యతను గలిగించితిని. సన్యాసివర్యా!
రత్నప్రభకు నీకు సంబంధమున్నదని నారాయణవర్మతోఁ
జెప్పితిని. సంధ్యాసమయమున నీ గదియొద్దకుఁ దన భవిష్య
త్తును దెలిసికొనుటకై పోవునట్లు ప్రోత్సహించినది నేనే. నీ
వామె చేయిపట్టుకొని చూచి, మాటలాడుచుండగా, నేను
నారాయణవర్మకు మిమ్మిద్దఱను జూపితిని. ఆతఁ డప్పుడే తీవ
రపడెను కాని నే నాఁపితిని. ఆరాత్రియే యాతఁడు నిన్ను రత్న
ప్రభనుగూడఁ జంపునని యెంచితిని. ఆమె నాతఁడు చంపుట
నా కిష్టమే. ఆమె యారీతిగ నాదారినుండి తొలఁగింపఁబడి
నప్పుడు నన్నాతఁడు వివాహముచేసికొను ననునాశ నాకప్పటి
కుండెను. కాని యాతఁడు నిన్ను జంపుట నా కెంత మాత్రము
సమ్మతి కాదు. నీకేమి యాపదకలుగునో యని యాఁదోళనప
డుచు నీ గదియొద్దకు వచ్చితిని. నేనొక్కనిముస మాలస్య
ముగా వచ్చుటచేత, నీకుఁ గాఁదగనిపని యేదో యది యైనది.
ఈనరహత్యాదోషము నాతలపై నున్నది.

ము—నారాయణవర్మను, రత్నప్రభను నింకనైన సుఖముగనుండ
నిచ్చెదవా?

ప—నారాయణవర్మమాట నే నెట్లు చెప్పఁగలను? నీవు మరణించు
నెడల నాతని కురిశిక్ష విధింపవలసి వచ్చునుగాదా?

ము—నా హత్యదోషము నీతలపై నున్నదని చెప్పినప్పు డాతనికి శిక్షయేల ?

ప—నేను బ్రత్యుత్తరము చెప్పలేని ప్రశ్నమడుగుట నీకు ధర్మమా? చూడు నీతో మరియొక ముఖ్యమైనమాట చెప్పవలసి యున్నది. నేను మోసములన్నియు వదలుకొంటిని. ఇఁక నెన్నడును మోసముచేయనని శపథ మొనర్చుకొంటిని. నా మోసమువలనఁ జెడినవారిని రక్షింపనిశ్చయించుకొంటిని. నీమనస్సు సంతుష్టి నొందినదా ?

ము—ఆ. మహాసంతోషము. నీవు నారాయణవర్మను రత్నప్రభను సుఖపెట్టఁగలవు కాని, నీ మోసముచేఁ జెడిన నన్నెట్లు సుఖపెట్టఁగలవు ?

ప—అందులకు నేనేమి చేయఁగలను? ఈవిచారము నాహృదయమును దహించుచునే యున్నది. నిన్ను బ్రదికించువా డెవఁడైన నున్నయెడల నారాజ్య మాతని కిచ్చెదను. నీవు బ్రదుకవలయునని భగవంతుని బ్రార్థించియే యిటకు వచ్చితిని.

ము—నేను బ్రదుకుట యెందులకు ?

ప—నేను బ్రదుకుటకొఱకు.

ము—(తనలో) ఆహా! ఎట్టి మహావాక్యము వింటిని. (ప్రకా) నీదయవలన బ్రదుకవలయును గాని యితర సాధనమేమియు నాకు లేదు. నీమూలమున నిట్టిదశకు రావలసి వచ్చిన నాయవసాన వాంఛ నీవు వినవలదా ?

ప—అయ్యయ్యో! నాదయ పరిపూర్ణముగా నున్నది. ని కోరిక తీర్చుటకంటె నాకుఁ గావలసినదేది? నేనేమి చేయఁగలనో చెప్పుము.

ము—చేయఁగలిగినది చేయుదువా ?

ప—సందేహమేమి ?

ము—నన్నుఁ బెండ్లాడుము.

ప—(తెల్లఁబోయి) అయ్యయ్యో! సన్యాసిని బెండ్లియాడుట యెట్లు?

ము—ఎట్లో తరువాతఁ జెప్పెదను. నీ కిష్టమున్నదా ?

ప—ఇష్టమున్నదే యనుకో. సన్యాసికి వివాహాధికార మెక్కడ నున్నదో ముందు చెప్పవేమి ?

ము—రేపో యెల్లుండియో మరణింతునేమో అటులైన నీకు మహాకష్టము సంభవించును గదా ?

ప—దానికేమి ? నా కట్టిగతియున్నఁ దప్పునా? నేను దప్పించుకొనఁగలనా? ఒకఁడు తప్పింపఁగలఁడా? కాని ముం దిది చెప్పవేమి ? సన్యాసికిఁ బెండ్లియాడుట కధికార మెక్కడిది ?

ము—సన్యాసికి లేక పోవచ్చును.

ప—ఆ! నీవు సన్యాసివి కావా ?

ము—కాకపోవుటఁ బట్టియే యట్లు కోరితిని.

ప—సన్యాసిరూపమూననున్న నీవు సన్యాసివే కావా ?

ము—కిరీటాంగదధారియైన నటుఁడు నలుఁడగునా ? సవరాలగడ్డము చెవులకుఁ దగిలించికొనిన పాత్రధారి పారాశర్యమౌని యగునా ?

ప—ఆలాగా సన్యాసివేషధారివై నీ వెందులకు వచ్చితివి ?

ము—ఎందులకా? ఎందులకా? నీకొఱకు; నాకన్నులకుఁ జంద్రికవైన నీకొఱకు. నాప్రాణమునకుఁ బ్రాణమైన నీకొఱకు. నామనస్సున కధిష్ఠానదేవతవైన నీకొఱకు. ఇట్టి నీకొఱకు. ఇంతకంటె నెక్కువయైన నీకొఱకు—

ప—ఇంకఁ జాలునయ్యా! నీ వెవఁడవు?

ము—నే నెవఁడనా? నీదర్శన మెటు లబ్బునోయని రేయుంబవళ్ళు తపించినవాఁడను. నీమూర్తి నే పూజించుచు సేవించుచు ధ్యానించుచు దినములు దొరలించుచున్నవాఁడను. నాకోరిక నెఱవేఱదుగదా యను చింతచేత రెండుమారులు ప్రాణత్యాగమునకు సిద్ధపడియు నిట్టి మహానందానుభవమునకై బ్రదికియున్నవాఁడను.

ప—ఈ మాటలన్నియుఁ జెప్పుమని నేనంటినా? మీరు బ్రాహ్మణులా. క్షత్రియులా? మీతలిదండ్రు లెవ్వరు? మీచరిత్ర రవంత చెప్పుమని నే ననఁగ నీగొడవయంతయు నెందులకు?

ము—నేను క్షత్రియుఁడను. మీ సామంతరాజపుత్త్రుఁడను.

ప—ఆఁ అటులా! (ప్రక్క మొగము చేసికొని వెనుకకుఁ బోవును.)

ము—సిగ్గుపడనక్కఱలేదు. నేను క్రొత్తవాఁడనుగాను. మన మిఁక నెప్పుడో దంపతులము కానక్కఱలేదు. మీతండ్రిగారు తన యవసానకాలమున మనల భార్యాభర్తలగఁ గూర్చియే కైలాసమున కేగినారు. ఆయనయాత్మశాంతికొఱకు మన మింతటినుండి భర్తృభార్యాధర్మమును నిర్వహించుకొనుటయే యవశిష్టము.

ప—నీ విట్లు వేషధారివై వచ్చి నన్ను మోసగింతువా?

ము—పద్మినీ! మోసముమాట నింకఁ దలపెట్టకుము. నీమోసముకంటె నామోస మెక్కువది కాదు. నామోసము ఫలించినది. నీది ఫలింపలేదు. దైవకటాక్షముచే నామోసము ఫలించినదనుచున్నాను. కాని నాప్రయోజకత్వముచే ఫలించినదని యెన్నడనువాఁడనుగాను. మనము దేవుని దాసులము. మనము భార్యాభర్తల మగుట దేవునియాజ్ఞ. ఆయాజ్ఞయే మీ తండ్రిగారి ముఖమునుండి వెడలినది. ఆయాజ్ఞ చెల్లించుట కదను వచ్చినది.

ప—(తనలో) అయ్యయ్యో! నేను నారాయణవర్మను గట్టుకొనుటకుఁ బడినపాటులన్నియు నాభర్త కానున్న యీతనికి నేనే చెప్పితినే. ఎంతబుద్ధిహీనురాలనైతిని. నాకింక నాతనియందే దృష్టియుండునని యీతఁడు నాయెడలఁ దప్పు టూహము కలిగియుండునేమో? నా కీతనితోఁ గాపురము సరిపడునో లేదో. మోస మొనర్చి యెంత యాశాభంగమునకు నగుబాటునకు నవిశ్వాసమునకుఁ బాపమునకుఁ బాలైతినో. నాకర్మము. ఇతనిని జేసికొమ్మనియే దేవుని యాజ్ఞయైనచో నేమిచేయఁగలను? మొట్టమొదట నన్నుఁ గోరినవానిని జేసికొందునని శపథ మొనర్చితిని. ఇఁక నాలోచనము సందేహము నేల? తిరుగుబాటేల? దేవునిశక్తి యెట్లీడ్చుకొనిపోవునో. యట్లేపోవుదును. పోకతప్పునా? ఇదిగో చేసిన ప్రయత్న మిన్నివిధముల భగ్నమైనది. ఇన్ని కొంపలు తీయుటకు సిద్ధమైనది. ఇందఱ ప్రాణముల కపాయదశ తెచ్చినది ఇంతపాపమునకు హేతువైనది. చచ్చినంతదెబ్బ తలకుఁ దగిలినది. బుద్ధి పూర్తిగ వచ్చినది.

ము—నీ వెంతమాత్రమును సందేహింపకుము. పడుచుపిల్లలగు మగవారికేమి యాఁడువారికేమి వివాహకాలము వచ్చునప్పుడు వారిని జేసికొనవలయుననియు, వీరిని జేసికొనవలయుననియు నూహము లందఱకుఁ గలుగును. అది సహజము. దానికై నీవు చింతింపవలదు.

ప—ఆమాట లెక్క నక్కఱలేదు. నీవు బ్రదుకుట దుర్ఘటమని వైద్యుఁడు చెప్పెనా?

ము—చెప్పలేను. నిన్నఁ జూచుటకు నేనే యట్లసత్యవార్తను మాలినిచే నీకుఁ బంపితిని. బాకు మొనగీఁచికొని పోయినది కాని యెంతమాత్రము భయములేదు. ఇదిగో చూడుము.

మా—(ప్రవేశించి) వైద్యుఁ డెక్కడ వెదకినను గానఁబడలేదు.

ప—మాలినీ! వచ్చితివా- వైద్యుఁ డక్కఱలేదు. (అప) ఇతఁడు దొంగసన్యాసి- మురళీమనోహరుఁడు. నాతండ్రి నాకేర్పఱచిన పెండ్లికొడుకితఁడే నఁటే.

మా—(అప) ఆలాగా! అమ్మా! పెద్దరాజుగారు సంకల్పసిద్ధులు.

ప—(అప) చక్కనివాఁడు కాఁడని యెక్కడవంకరయని యిక్కడవంకరయని యెవరో చెప్పినారు కాదఁటే. నిక్షేపములాగునఁ నున్నాఁడు. నీకు గూడఁ జక్కఁగఁ గానఁబడుచున్నాఁడు కాఁడఁటే.

మా—(అప) వారుఁ గనఁబడుట యెందులకు? మీ రీతని జేసికొనుట కంగీకరించినారా అమ్మా!

ప—నా యంగీకారమేమిటే. భగవంతుని యాజ్ఞయే. అదిగాక తండ్రిగారిమాటకు విరుద్ధముగ నడచుట తప్పుకాదఁటే.

మా—(అప) ఎవరియాజ్ఞయైనను బ్రాణము మీఁదికి వచ్చినవానిఁ జేసికొనుట తగునా?

ప—(అప) ఆసంగతికూడఁ గనుగొంటిని. అదియు దొంగమాటయే నఁటే!

మా—(అప) ఆలాగా! అమ్మా! ఇఁకఁ గావలసినదేమి?

ప—(అప) కావలసినది లేకేమి? మావలె నారాయణవర్మయు రత్నప్రభయు దంపతులై సుఖించినఁ గాని నాకు సంతోషముండునా? సంతోషము మాటయటుంపుము పాపవిముక్తి

యుండునా? వారిద్ద ఱొకరినొకరు చంపుకొను సంతవైరముతో నున్నారు. ఏమి చేయవలయును.

మా—(అప) అమ్మా! వారితో మీరే మాటలాడవలయును.

ప—(అప) నేను వారియెదుటఁ, జేసిన ద్రోహ మొప్పుకొనుటకు నాకుఁ జిన్నతనముగ నుండునే! అదిగాక పరపురుషునితో నేను మాటలాడుదునఁటే.

మా—(అప) అటులైన సన్యాసిచేఁ జెప్పింపవలయును.

ప—(అప) సన్యాసియందు వేమి? తప్పుకాదా? సంసారియే—చక్రవర్తియే—నీవే నాభర్తతో మాటలాడుము. నా కతనితో నీ యెదుట మాటలాడుట సిగ్గుగా నున్నదే.

మా—(అప) నేను ద్వారగఁ బోవలసినదని నీ యభిప్రాయమా అమ్మా.

ప—(అప) ఛీ! ఆఁగుము నేనుగూడ నిప్పుడే వచ్చెదను.

మా—అయ్యా! రత్నప్రభకు నారాయణవర్మకు దురదృష్టమువలనఁ గలిగిన యభిప్రాయభేదములను సరిచేయుమని చక్రవర్తిని మీతో సెలవిమ్మనినారు.

ప—నీ మొగము చక్రవర్తినియందు వేమి? సెలవిమ్మనినారేమి? గొప్పవారితో విధేయతగ మాటలాడుట యెఱుఁగవా?

ము—అదియేమియుఁ దప్పు చెప్పలేదు. నే నెప్పటికిఁ గూడ మీకు సామంతరాజునే. మీయాజ్ఞ శిరమునఁ ధరింపవలసినవాఁడనే- మాలినీ! ఎవరినైనఁ బిలువుము.

మా—ఎవరక్కడ?

[నేపథ్యమున] అమ్మా.

ప—నీవు కారాగృహాధిపతియొద్దకుఁ బోయి నారాయణవర్మ నిటకుఁ బంపుమని నేను జెప్పినట్లు చెప్పుము. వచ్చునప్పుడు రత్నప్రభనుగూడఁ దీసికొనిరమ్ము.

[నేపథ్యమున] చిత్తము.

ప—మాలినీ- వారు వచ్చునప్పుడు మే మిక్కడ నుండవచ్చునేమో యడుగుము.

ము—అభ్యంతరమేమి? మాలినీ! రవంత నాకుఁ జేయూఁతనిమ్ము.

మా—ఎందులకయ్యా- లేచెదరా యేమి?

ము—చక్రవర్తిని యటుఁ గూరుచుండగ నేను మంచముపైఁ బండుకొనుట తప్పుకాదా?

మా—చక్రవర్తినిగూడ మీతో మంచముపైఁ బండుకొనవలసెదని మీ యభిప్రాయమా?

ప—ఛీ! దౌడపైఁ గొట్టెదను.

(నారాయణవర్మయు రత్నప్రభయుఁ బ్రవేశింతురు.)

ము—నారాయణవర్మా! అకారణముగ నేను నీవలన శిక్షితుఁడనై యుటఁబడియున్నాను. నేను బవిత్రుఁడను. నాకాపాయమునైన నీవు గారవింపవైతివి. మీ కిద్దఱకుఁ బ్రారబ్ధవశమునఁ గొన్ని దురభిప్రాయములు కలిగినవి. ఎవరిదారిని వా రుండవచ్చును. మీరత్యంత సన్నిహితబంధువులు, నా కుపకార మొనర్చిన వారికైన నుపకార మొనర్చుట సన్యాసినైన నావిధి- నారాయణవర్మా! తల్లీ రత్నప్రభా! మీ రిటు రండు. మీ యిద్దఱచెవులలో సర్వేష్ట తారకమైన మంత్ర ముపదేశింతును.

(నారాయణవర్మ- రత్నప్రభ సందేహించి యూరకుందురు.)

ప—రత్నప్రభా! అటుపొమ్ము. నారాయణవర్మతో మాలినీ! నా యాజ్ఞ యని చెప్పుము.

(నారాయణవర్మ చెవిలోను రత్నప్రభ చెవిలోను మురళీమనోహరుఁడు) గుసగుసలాడును.)

నా—ఆహా! ఎంతటి మంత్రరాజ ముపదేశించితివయ్యా! నాజన్మము తరించినది. రత్నప్రభా! క్షమింపవలయును.

ప—నారాయణవర్మనేమి, రత్నప్రభనేమి క్షమింపవలయునని కోరవలసిన దానను నేను.

నా—అమ్మా! కృతార్థులమైతిమి మహానంద మొసంగినారు.

ప—(కౌఁగిలించుకొని) రత్నప్రభా! మన కందఱకు భగవంతుఁడు మహానంద మిచ్చినాఁడు.

ము—నారాయణవర్మా! నాకు రవంత యూఁతనిమ్ము నేను లేచి నాప్రియురాలి జేరెదను.

నా—(అట్లొనర్చును)

ము—ఈ రెండు వివాహములకుఁ బ్రధానోత్సవములకు లోపలికిఁ బోదము రండు.

స—ఔను- ఇఁక నిక్కడఁ గావలసిన దేమున్నది.

ము—గీ. క్షామ యీతిబాధలు లేక తనరు గాక
ప్రజల యన్యోన్యవైరముల్ పాయుఁగాక
కవిత రాజపోషణమునఁ గ్రాలుగాక
నీతిపాలనమున రాజు నెగడుగాక.

అంద—తథాస్తు.

ఇందుతో సర్వము సంపూర్ణము.

సాక్షి.

అచ్చుపడి సిద్ధముగ నున్నవి! కొలదిప్రతులుమాత్రమే గలవు!!

ఇదియొక యపూర్వగ్రంథరాజము. కథకాదు, ప్రబంధముకాదు, నవల యంత కన్న కాదు. తెలుఁగుభాషలో నిదివఱ కెన్నఁడు నిట్టిగ్రంథరాజముఁ జూచియుండరు. జంఘాలశాస్త్రి కాలాచార్యులు, బొఱ్ఱయ్యసెట్టి, వాణీదాసుఁడు, సాక్షి అను నైదుగురు సంఘము. ఈసంఘముచేఁ జర్చింపఁబడు విషయములు బహుచమత్కారముగ, నతిమనోహరముగ, హృదయానందకరముగ నుండును. మొదటినుండి చివరవఱకును కడుపు చెక్కలగునటుల నవ్వు వచ్చుచుండును మనోహరమును ప్రౌఢగంభీరము నగు శైలి నేర్చుకొనుటకు విద్యార్థుల కింతకన్న నుపయోగకరమగు గ్రంథము లేదు. జంఘాలశాస్త్రియుపన్యాసధోరణి, వాణీదాసు బంధురప్రబంధరచనాసక్తి, కాలాచార్యుల రచనానైపుణి, సాక్షి విషయనివేదనావైఖరి, అభిప్రాయసమంజసత చదువఁదగినవి. ఒకయెడ సంభాషణచాతుర్యము, ఇంకొకయెడ పాత్రవిలసనవైఖరి, మఱియొకయెడ అపూర్వవర్ణనాగాంభీర్యము చదువరుల కెంతయో సంతస మొసఁగును. ఆంధ్రపత్రిక సారస్వతానుబంధమునందలి "సాక్షి" సాదరముగ, సాంతముగ, సమోదభరి[illegible] చదివి, యందలి యపూర్వభావకల్పనాచమత్కృతి, వచనరచనానైపుణ్యము, పదలాలిత్యము, అనిర్వచనీయమై- ఆహ్లాదజనకమై హాస్యరసామృతమును మనసార [illegible]గ్రోలి యానందించు ఆంధ్రలోకము, జంఘాలశాస్త్రి యుపన్యాస మొక్కవారము రాని యెడల పొందెడి పరితాపము వర్ణనాతీతముగదా! ఇది యాంధ్రలోకమునకు, ఆంధ్రవాఙ్మయమునకు నవీనము. నానావిషయముల గూర్చి మనోహరమగు శైలిలో వ్రాయఁబడిన వ్యాసములు. ఈవ్యాసములు చదివినకొలఁది చదువవలయునని యుం[illegible]. తని[illegible] తీఱదు. తృప్తికలుఁగదు. ఒక్కవ్యాస మెన్నిసారులు చదివినను విసుఁగు జనింపకపోవుటయె కాక చదివినకొలఁది వింతవింత రుచుల నుత్పత్తిఁజేయుచుండును. చక్కని దళసరి కాగితములపై సుందరముగ ముద్రింపఁబడియెను. దిట్టమైన యట్టబైండు.

మొదటిభాగము	2-0-0	మూఁడవభాగము	1-8-0
రెండవభాగము	2-0-0	నాల్గవభాగము	1-12-0

వలయువారు: పానుగంటి రాజారావు బ్రదర్సు,

పిఠాపురము,

(గోదావరిజిల్లా.) అని వ్రాయవలెను.

END OF
TITLE